ప్రజాపక్షం 8th ANNIVERSARY 22nd October, 2026

ప్రతి అక్షరం ప్రజల కోసం

www.prajapaksham.in

# ప్రజాపక్షం

PRAJAPAKSHAM ★★

సంపుటి 09, సంచిక: 316 | శుక్రవారం | 16-10-2026 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

బాధిత, ప్రశ్నించే గొంతుల అణచివేతే మోదీ సర్కారు లక్షణం

తమిళనాడులో ఇండియా కూటమి భారీ నిరసన

రాహుల్‌గాంధీ, మరో 12 మంది ప్రతిపక్షనాయకుల పిటిషన్‌పై ఇసి, సిఇసి స్పందన కోరిన 'సుప్రీం' 07

# కేంద్ర సాయం కోసం ఢిల్లీకి అఖిలపక్షం

**ఎల్ నినోను ఎదుర్కొనేందుకు ఉప ముఖ్యమంత్రి అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘం**

● దసరా తర్వాత అఖిలపక్షం ● కార్మిక, వివిధ ప్రజాసంఘాలతో ఉప సంఘం భేటీ ● భవిష్యత్ కార్యాచరణ రూపకల్పన ● రానున్న 10 నెలలు అత్యంత గడ్డు పరిస్థితి ● ప్రజలు, రైతులు నీటిని, విద్యుత్‌ను ఆదా చేయాలి ● యాసంగిలో వరిసాగు వాయిదావేసి ఆరుతడి పంటలు వేసుకోవాలి ● ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి ● 'ఎల్ నినో ప్రభావం – తీసుకోవాల్సిన జాగ్రత్తల'పై మంత్రులతో సమీక్ష

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రపంచ వ్యాప్తంగా వంద దేశాలను వణికిస్తున్న 'సూపర్ ఎల్‌నినో' ప్రభావం తెలంగాణ రాష్ట్రం పైనా తీవ్రంగా పడనున్న నేపథ్యంలో రానున్న 8 నుంచి 10 నెలల కాలం అత్యంత గడ్డు పరిస్థితులను ఎదుర్కోవాల్సి ఉంటుందని, ఇందుకు ప్రతి పౌరుడూ, రైతులు అప్రమత్తమై నీటిని, విద్యుత్‌ను ఆదా చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు కేంద్ర సహాయం నిమిత్తం తన (సిఎం) నేతృత్వంలో అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి కేంద్ర ప్రభుత్వాన్ని కలుస్తామన్నారు. ఉప ముఖ్యమంత్రి అధ్యక్షతన మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేశామని, ఈ ఉప సంఘం దసరా పండగ తర్వాత అఖిలపక్షం, కార్మిక, వివిధ ప్రజా సంఘాలతో సమావేశమై భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తుందని సిఎం వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రిజర్వాయర్లలో కలిపి కేవలం 209 టిఎంసిల నీళ్లే ఉన్నాయని, ఈ నీటిని తాగునీటికే తొలి ప్రాధాన్యతనిస్తామని, యాసంగిలో వరి సాగును వాయిదా వేసుకోవాలని, ఆరుతడి పంటలను వేసుకోవాలని సిఎం కోరారు. రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసికట్టుగా ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కోవాలని సిఎం విజ్ఞప్తి చేశారు. అందుబాటులో ఉన్న మంత్రులు, ఉన్నతాధికారులతో హైదరాబాద్‌లోని సచివాలయంలో గురువారం ఎల్‌నినో ప్రభావం, తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై సిఎం రేవంత్ రెడ్డి సమీక్షించారు. సమావేశం అనంతరం సిఎం రేవంత్ రెడ్డి మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. 1950 తర్వాత ఎన్నోసార్లు ఎల్‌నినో వచ్చి కరవు పరిస్థితులను చూశామని, కానీ ఈసారి అతిపెద్ద ప్రకృతి విపత్తు అని, 2026 ప్రారంభం లోనే తీవ్ర ఎండలు, నీటి కొరతపై శాస్త్రవేత్తలు హెచ్చరించారని, వారు ఉహించినట్టే చేయి దాటే పరిస్థితులు కనిపిస్తున్నాయని సిఎం తెలిపారు. ఎల్‌నినో ప్రభావం భూమిపై ఉన్న ప్రతి జీవరాశి పైనా ఉంటుందన్నారు.

**వర్షపాతం.. నీటి లోటు**

రాష్ట్రంలో 23 శాతం లోటు వర్షపాతం నమోదవ్వగా, కృష్ణా బేసిన్‌లో 72 శాతం, గోదావరి బేసిన్‌లో 40 శాతం నీటి నిల్వలు పడిపోయాయని సిఎం రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. రిజర్వాయర్లలో సాధారణంగా ఉండాల్సిన 460 టిఎంసిలకు గాను కేవలం 209 టిఎంసిల నీరు మాత్రమే అందుబాటులో ఉన్నదని వివరించారు. ఈ నీటిని తరువాయి 8లో

# సొంత ప్రజలపైనే మోదీ సర్కార్ యుద్ధం

● సిఇసి జ్ఞానేశ్ కుమార్‌ను రక్షిస్తున్న ప్రధాని, హోంమంత్రి
● ఓటర్ల తొలగింపుల ద్వారా ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసేందుకు కుట్ర : అభిజీత్ దీప్కే



**న్యూఢిల్లీ :** కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సిఇసి) జ్ఞానేష్ కుమార్‌ను రక్షించడం కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా తమ సొంత దేశ ప్రజలపై యుద్ధం చేస్తున్నారని కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఆరోపించారు. సిఇసి రాజీనామాను డిమాండ్ చేస్తూ నిరసన తెలుపుతున్న వారిని, ప్రతిపక్ష నాయకులను నిర్బంధించడాన్ని ఆయన ప్రశ్నించారు. ఓటర్ల తొలగింపుల ద్వారా ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేయడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. 13 కోట్లకు పైగా ఓటర్ల పేర్లను తొలగించడం ఒక కుట్ర అని అన్నారు. ఐసా జాతీయ అధ్యక్షురాలు నేహా బోరా, ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఎఐఎస్ఎఫ్) జాతీయ అధ్యక్షుడు విరాజ్ దేవాంగ్, ఎస్ఎఫ్ఐ నాయకురాలు ఐషే ఘోష్, నటుడు ప్రకాష్ రాజ్ తదితరులతో కలిసి తరువాయి 8లో

**కన్నాట్ ప్లేస్ మూసేస్తున్నట్లు ఎన్ఎండిసి ప్రకటన**

కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే శుక్రవారం తలపెట్టిన 'లెహ్రా దో తిరంగా' నిరసన పిలుపు నేపథ్యంలో దేశ రాజధాని ఢిల్లీ మరోసారి భారీ సంఖ్యలో పోలీసులు, పారా మిలిటరీ బలగాల కంపెనీల మోహరింపునకు సమాయత్తమవుతోంది. శుక్రవారం సాయంత్రం 5గంటలకు కన్నాట్ ప్లేస్‌లోని సెంట్రల్ పార్క్‌లో సిజెపి ఈ నిరసనకు పిలుపునిచ్చింది. అయితే పరిపాలనాపరమైన కారణాలతో 16, 17 తేదీలలో ఈ రెండు ప్రాంతాలు మూసివేస్తున్నట్లు న్యూఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్ (ఎన్ఎండిసి) ప్రకటన చేసింది.

ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్‌లో ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో భారీ వర్షం మధ్యనే 'తిరంగా మార్చ్' (త్రివర్ణ పతాక ప్రదర్శన) నిర్వహించారు. 'జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి!', 'జంతర్ మంతర్ హమారా హై!' వంటి నినాదాలతో కన్నాట్ ప్లేస్ మార్మోగిపోయింది. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేశారు.

## 'నైరుతి' నిష్క్రమణ

ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో దక్షిణ భారతంలో వర్షాలు ప్రారంభం : ఐఎండి

**న్యూఢిల్లీ :** దేశవ్యాప్తంగా నైరుతి రుతుపవనాలు గురువారం నిష్క్రమించాయి. అయితే అదే రోజు దక్షిణ భారతదేశంలోని కొన్ని ప్రాంతాల్లో ఈశాన్య రుతుపవనాల వర్షాలు ప్రారంభమయ్యాయని భారత వాతావరణ శాఖ (ఐఎండి) తెలిపింది. తమిళనాడు, పుదుచ్చేరి, కారైకల్, కోస్తా ఆంధ్రప్రదేశ్, రాయలసీమ, దక్షిణ అంతర్గత కర్ణాటక, కేరళ, మాహేలలో ఈశాన్య రుతుపవనాల ప్రభావం కనిపించిందని ఐఎండి పేర్కొంది. 'ఈశాన్య రుతుపవనాల ప్రారంభంతో, ఈనెల 21 వరకు దక్షిణ ద్వీపకల్ప భారతదేశంలోని అనేక ప్రాంతాలలో అక్కడక్కడా భారీ వర్షాలతో కూడిన తడి వాతావరణం ఉండే అవకాశం ఉంది' అని ఐఎండి రోజువారీ అంచనాలో పేర్కొంది. భారతదేశంలో రెండు ముఖ్యమైన రకాల రుతుపవనాలు ఉన్నాయి: జూన్ నుండి సెప్టెంబర్ వరకు చురుకుగా ఉండే నైరుతి రుతుపవనాలు, అక్టోబర్ నుండి డిసెంబర్ వరకు తరువాయి 8లో

## సంపద సృష్టికర్తలకు ప్రభుత్వం అండ

● తెలంగాణలో పెట్టుబడులు పెట్టే పారిశ్రామికవేత్తలకు పూర్తి సహకారం
● సింగిల్‌విండో విధానంలో అనుమతులు, అవసరమైన భూమి, విద్యుత్, నీటి సదుపాయాలు
● 'గ్లోబల్ బిజినెస్ మీట్– 2026'లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చే పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క భరోసా ఇచ్చారు. పరిశ్రమల స్థాపనకు సింగిల్ విండో విధానంలో అనుమతులు మంజూరు చేయడంతోపాటు అవసరమైన భూమి, విద్యుత్, నీటి సదుపాయాలు కల్పిస్తామని ప్రకటించారు. పారిశ్రామికవేత్తలకు తాను గార్డియన్‌గా ఉంటూ, పరిశ్రమల ఏర్పాటులో ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టి ఆర్థికాభివృద్ధి, ఉపాధి కల్పనలో భాగస్వాములు కావాలని ప్రపంచవ్యాప్తంగా ఉన్న వ్యాపారవేత్తలకు పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో గురువారం నిర్వహించిన సమాఖ్య చాంబర్ ఆఫ్ కామర్స్ గ్లోబల్ బిజినెస్ మీట్–2026లో భట్టి విక్రమార్క మాట్లాడారు. సంపద సృష్టించే పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, పెట్టుబడులకు అవసరమైన మౌలిక తరువాయి 8లో

## ఎసిబికి చిక్కిన ప్రభుత్వాధికారులు

● లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న అధికారులు
● హైదరాబాద్, కీసర, వేములవాడలో ఘటనలు

ప్రజాపక్షం/హైదరాబాద్/మేడ్చల్/వేములవాడ

సామాన్యుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని అందినకాడికి దండుకోవాలనే దురుద్దేశంతో ప్రభుత్వాధికారులు లంచాలకు ఎగబడుతున్నారు. ఏ ప్రభుత్వా విభాగాంలో అయినా ఏ పని కావాలన్నా ముడుపు ఇవ్వనిదే పనులు కావడం లేదు. అయితే ఎసిబి అధికారులు కూడా దూకుడుగా వ్యవహరిస్తూ లంచాలు తీసుకుంటున్న అధికారులపై ఉక్కుపాదం మోపుతున్నారు. అయినా ఏ మాత్రం భయపడడం లేదు. గురువారం నాడు రాష్ట్రంలో పలువురు అధికారులను దర్యాప్తు సంస్థ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసర మండల రెవెన్యూ కార్యాలయం డిప్యూటీ తహసీల్దారు సందీప్ రెడ్డి, హైదరాబాద్ సంతోష్‌నగర్‌లో విద్యుత్ అసిస్టెంట్ ఇంజినీర్ తరువాయి 12లో

## కుప్పకూలిన స్కూల్ భవనం

● 34 మందికి పైగా విద్యార్థులు మృతి ● పాకిస్థాన్‌లో సంతాపదినం

**పెషావర్:** పాకిస్థాన్ నగరం పెషావర్‌లో మూడు అంతస్తుల స్కూలు భవనం మొదటి అంతస్తు పైకప్పు కుప్పకూలిపోవడంతో 34 మంది విద్యార్థులు దుర్మరణం చెందారు. ఈ ఘటనలో స్కూలు భవనం యజమానిని పోలీసులు అరెస్టు చేశారు.మరణించినవారిలో ఎక్కువమంది 13 ఏళ్ళ లోపు పిల్లలే ఉన్నారని ఆసుపత్రి వర్గాలు తెలియజేశాయి. పెషావర్ లేడీ రీడింగ్ ఆసుపత్రి తరువాయి 8లో

## మతం మారితే బిసి కోటా వర్తించదు

● సుప్రీంకోర్టు స్పష్టీకరణ
● మతం మారిన వ్యక్తులు పాత సామాజికవర్గం ఆధారంగా బిసి కోటా కోరలేరని వ్యాఖ్య

**న్యూఢిల్లీ :** మతం మారినంత మాత్రాన బిసి రిజర్వేషన్ పొందలేరని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. హిందూ మతం నుంచి ఇస్లాం వంటి ఇతర మతాల్లోకి మారిన వ్యక్తులు, తమ పాత సామాజిక వర్గం ఆధారంగా బిసి రిజర్వేషన్‌ను కోరలేరని తేల్చిచెప్పింది. ఒక మతంలో ఉన్న సామాజిక వెనకబాటుతనాన్ని మరో మతంలోకి మారిన తర్వాత కూడా అదే విధంగా పరిగణించలేమని పేర్కొంది. ఈ మేరకు తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన తరువాయి 8లో

ప్రజాపక్షం దినపత్రిక
యాజమాన్యానికి,
పాఠకులకు, పాత్రికేయులకు, సిబ్బందికి
8వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

I.SAMBASIVA RAO
General Secretary
Cell : 99080 70121

ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, శ్రేయోభిలాషులకు, మిత్రులకు
బతుకమ్మ & దసరా శుభాకాంక్షలు

P.N. SWAMY
President :
Cell : 98490 45583

SENIOR CITIZEN WELFARE ASSOCIATION, MALLAPUR
(Regd. No. 01/2020, Govt.of Telangana)
Medchal-Malkajgiri Dist.
Senior Citizen Bhavan, NFC Colony, Opp. Noma Kalyana Vedika, Mallapur, Hyderabad - 500 076, Telangana State.

# ఇలాంటి వారు గవర్నర్లా!?

మోదీ ప్రభుత్వ సిఫార్సు మేరకు నాలుగు రోజుల క్రితం రాష్ట్రపతి నియమించిన నలుగురు గవర్నర్‌లలో ఇద్దరు వివాదాల్లో చిక్కుకున్నారు. వారు ఒడిశా గవర్నర్ బ్రజ్ మోహన్ రామ్, సిక్కిం గవర్నర్ దుష్యంత్ గౌతమ్. ఇందులో ముఖ్యంగా దుష్యంత్ గౌతమ్ నియామకం అత్యంత వివాదాస్పదంగా మారింది. ఉత్తరాఖండ్ రాష్ట్రానికి చెందిన ఈయన ఒక యువతి అత్యాచారం, హత్య కేసులో తన ప్రమేయంపై సిబిఐ దర్యాప్తును ఎదుర్కొంటున్నారు. సిక్కిం గవర్నర్‌గా ఈయన నియామకం జరిగిన వెంటనే, దానిని వ్యతిరేకిస్తూ బాధితురాలు అంకితా భండారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఢిల్లీలోని ఇండియా గేట్ ఎదుట బుధవారం నిరసనకు దిగారు. ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ వచ్చి వారికి సంఘీభావాన్ని ప్రకటించారు. ఒక యువతికి సంబంధించిన కేసులో ఆరోపణలు ఎదుర్కొంటూ, సిబిఐ దర్యాప్తు కొనసాగుతున్న తరుణంతో దుష్యంత్ గౌతమ్ నియమకంపై పునరాలోచన చేయాలని భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్ముకు లేఖ రాశారు.

మరో వ్యక్తి జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన బ్రజ్ మోహన్ రామ్ ఒడిషా గవర్నర్‌గా నియమితులైన వెంటనే, తాను నిబద్ధత కలిగిన బిజెపి కార్యకర్తను అని అన్నారు. అంతే కాకుండా గవర్నర్‌గా నియమితుడైన వ్యక్తి ఒడిషాలో బిజెపిని సంస్థాగతంగా క్రియాశీలం చేసి, మరిన్ని ఓట్లు లభించేందుకు కృషి చేస్తానంటూ చెప్పినట్లు మీడియాలో వచ్చిన వార్తలు దూమారం రేపాయి. ఒకసారి ఎంఎల్‌ఏ, మూడు సార్లు ఎంపిగా గెలిచిన వ్యక్తికి గవర్నర్ పదవి, బాధ్యతల గురించి తెలియదనుకోవడం పొరపాటే. రాష్ట్ర ప్రథమ పౌరుడిగా పార్టీలకు అతీతంగా నిష్పాక్షికంగా ఉండాల్సిన గవర్నరే ఆ రాష్ట్రంలో అధికార పార్టీని బలోపేతం చేస్తానడం ఎలాంటి సంకేతాన్నిస్తోంది. గవర్నర్‌గా నియమితుడైన వ్యక్తి, తన గత రాజకీయ కార్యకలాపాలకు, భవిష్యత్ రాజ్యాంగ విధులకు మధ్య స్పష్టమైన వ్యత్యాసాన్ని ప్రదర్శించగలగాలి. ఒడిషాలో బిజెపి ప్రభుత్వమే ఉన్నందున పెద్ద ఇబ్బంది లేనప్పటికీ, సిక్కింలో పరిస్థితి వేరు. అక్కడ గతంలో బిజెపి మిత్రపక్షంగా ఉన్న సిక్కిం క్రాంతికారి మోర్చ(ఎస్‌కెఎం) మొత్తం 32 ఎంఎల్‌ఏల స్థానాలలో అన్నిటినీ గెలుచుకొని తిరుగులేని మెజారిటీతో అధికారంలో ఉంది. తక్కువ స్థానాలు ఉండడంతో ఏమైనా జరగవచ్చనే అభిప్రాయం ఉంది.

మోదీ సర్కార్ అధికారంలోకి వచ్చిన 12 ఏళ్ళలో గవర్నర్‌లు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి వత్తాసుగా వ్యవహరిస్తున్నారు. బిజెపి, దాని మిత్రపక్షాల యేతర పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలకు అనేక అంశాలలో మోకాలడ్డడమే కాకుండా, పరిపాలనకు ఆటంకాలు సృష్టిస్తున్నారు. అలాంటి వారిలో తమిళనాడు గవర్నర్‌గా వ్యహరించిన ఆర్.ఎన్.రవి, కేరళ గవర్నర్‌గా వ్యవహరించిన రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ వంటి వారు ముఖ్యమంత్రులతో ప్రత్యక్షంగా తలపడడం చూశాము. శాసనసభ ఆమోదించి పంపిన బిల్లులపై సంతకం చేయకుండా ఏళ్ళ తరబడి నాన్చడం, వైస్ ఛాన్స్‌లర్‌ల నియామకాలలో తలదూర్చడం వంటి సమాఖ్య స్ఫూర్తికి విఘాతం కలిగించే చర్యలకు ఒడిగట్టారు. రవి కుమార్ అయితే, తమిళులకు అత్యంత ప్రీతిపాత్రమైన తమిళ భాషపై ఉద్దేశ్యపూర్వక వివక్ష ప్రదర్శిస్తూ, హిందీకి ప్రాముఖ్యతనిచ్చేవారు.

శాసనసభ సమావేశాల ప్రారంభం సందర్భంగా సంప్రదాయం ప్రకారం రాష్ట్ర క్యాబినెట్ ఆమోదిత ప్రసంగాన్ని కాకుండా తమకు నచ్చిన పంక్తులను చేర్చడమో, లేదా ఉన్నవాటిని విస్మరించటమో చేసేవారు. గతంలో తెలంగాణ రాష్ట్రంలో సైతం తమిళసై సౌందర్‌రాజన్ గవర్నర్‌గా ఉన్న సమయంలో నాటి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ప్రభుత్వం పంపిన ఫైళ్ళను ఆపిన ఉదంతం మరుగునపడలేదు. అలాగే గతంలో పశ్చిమ బెంగాల్, ఢిల్లీలో సిఎంలుగా మమతా బెనర్జీ, అరవింద్ కేజ్రీవాల్‌లు ఉండగా, గవర్నర్‌లే ప్రత్యక్ష పరిపాలనలో తలదూర్చడం తెలిసిందే. ఆర్‌ఎస్‌ఎస్ వాది అయిన ఆర్లేకర్‌ను తమిళనాడుకు పూర్తికాలం గవర్నర్‌గా నియమితులు కావటం విజయ్ ప్రభుత్వానికి ఇబ్బందులు కలిగించక మానదు.

నిజానికి గవర్నర్‌గా వివిధ రంగాలలో నిష్ణాతులు, అనుభవజ్ఞులు, నైతిక విలువలతో గౌరప్రదులుగా గుర్తింపు ఉన్న వారిని నియమిస్తుంటారు. ఎందుకంటే రాష్ట్రంలో రాజ్యాంగాధిపతిగా, కేంద్ర ప్రభుత్వ ప్రతినిధిగా ఉంటూనే, సమాఖ్యవాదానికి పట్టంగట్టిన రాజ్యాంగానికి అనుగుణంగా కేంద్ర–రాష్ట్ర సంబంధాలను సుహృద్భావ వాతావరణంలో నడపాల్సిన బాధ్యతలు గవర్నర్ భుజాలపైన ఉంటాయి. గవర్నర్ ప్రధానమంత్రికి రాజకీయ ప్రతినిధి కాదు, అలాగే ముఖ్యమంత్రికి బేషరతు మద్దతుదారుడు కూడా కాదు. ఆ పదవి రాజ్యాంగ పరిమితుల్లో పనిచేయాలి, న్యాయ నిర్ణయాలను గౌరవించాలి, అలాగే కేంద్ర అధికారానికి, ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వ అధికారానికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని పాటించాలి. కానీ, ఇటీవల నియామకాలు లోక్‌భవన్‌లు అధికార పార్టీకి అనుబంధంగా మారుతున్నాయా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా ఒకే దేశం ఒకే ఎన్నిక వంటి కేంద్రీకృత చట్టాలను తీసుకురావాలని తలపోస్తున్న కేంద్రానికి రాష్ట్ర గవర్నర్‌ల పాత్ర కీలకంగా మారింది.

రాజ్యాంగబద్ధమైన పదవుల భర్తీలో అనుసరిస్తున్న తీరును, రాజ్యాంగ సంస్థలు, పదవులపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తోంది. నిజానికి బ్రిటీష్ పాలన నాటి అవశేషం లాంటి గవర్నర్ పదవి కొనసాగింపుపై గత కొంత కాలంగా చర్చ జరుగుతోంది. ప్రజలు ఎన్నుకున్న రాష్ట్ర ప్రభుత్వాలపై కేంద్రం నియమించే గవర్నర్ పెత్తనమేమిటనే ప్రశ్న ముఖ్యంగా ప్రాంతీయ పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలలో ప్రస్ఫుటమవుతోంది. అందుకే గవర్నర్ వ్యవస్థను తొలగించాలనే డిమాండ్ కూడా ఉపందుకున్నది.

ఒడిషా గవర్నర్‌గా నియమితులైన బ్రజ్ మోహన్ రామ్ తన రాజకీయ అస్థిత్వాన్ని బహిరంగంగా చాటుకోవడం అందోళనకరం. ఒక సిక్కిం గవర్నర్‌గా దుష్యంత్ గౌతమ్ నియామకం నైతిక విలువల పతనానికి పరాకాష్ఠ. ఆయన గవర్నర్‌గా ఉన్న కాలంలో సిబిఐ దర్యాప్తు నుంచి ఆయనకు రక్షణ ఉంటుంది. అలాంటప్పుడు ఒక యువతి దారుణ హత్యకు ఏ విధంగా న్యాయం జరుగుతుంది. భేటీ బచావో అని నినాదాలు చేసే మోదీ ప్రభుత్వం ఈ నియామకం ద్వారా ఎలాంటి సంకేతాలిస్తోంది. ఈ రెండు నియామకాలు మోదీ ప్రభుత్వంలోని నైతిక పతనానికి నిదర్శనం. ఇప్పటికే ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే విధంగా సర్ పేరిట 13 కోట్ల ఓట్లను గాలిలో దీపంలాగా మార్చిన మోదీ సర్కార్, తాజాగా గవర్నర్‌ల నియమకాల ద్వారా మరో అడుగు పాతళంలోకి వేసింది. ఇప్పటికైనా ఆ రెండు నియామకాలను ఉపసంహరించుకుంటే గుడ్డిలో మెల్లలాగా పరువు దక్కుతుంది. ●

## 'విబి-జి-రామ్ జి' బిల్లు బలవంతంగా ఆమోదం

**'నరేంద్రమోదీ ప్రభుత్వం పార్లమెంట్‌లో 'విబి-జి-రామ్ జి' బిల్లును బలవంతంగా ఆమోదింపజేసింది. రాజ్యాంగబద్ధమైన పనిహక్కును ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ కింద హామీ ఇవ్వబడిన వేతన పెంపు హక్కును అంతం చేసింది. ఇప్పుడు గిరిజన, ఇతర సాంప్రదాయ అటవీ నివాసవర్గాలకు చెందిన లక్షలాది మంది అటవీ హక్కుల చట్టం (ఎఫ్‌ఆర్‌ఎ)-2006 లబ్ధిదారులు కూడా 150 రోజుల అర్హతను కోల్పోవడం బాధాకరం. జాబ్ కార్డుల తొలగింపు, ఆధార్ ఆధారిత బ్రిడ్జ్ పేమెంట్ సిస్టమ్స్ (ఎబిపిఎస్), నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ (ఎన్‌ఎంఎంఎస్)ల తప్పనిసరి వినియోగం ద్వారా ఇలాంటి వర్గాలకు చెందిన లక్షలాది మందిని ఈ పథకం నుంచి మినహాయించిన దానికి ఇది అదనం. 'విబి-జి-రామ్ జి' కింద ఉన్న ఏకైక హామీ సాంకేతిక ఆధారిత బహిష్కరణ కేంద్రీకరణ గ్రామ పంచాయతీలను బలహీనపర్చడమే'.**

— కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి జైరామ్ రమేష్

## వైద్య రంగంలో నిశ్శబ్ద విప్లవం 'అనస్థీషియా'

మానవ వైద్యచరిత్రలో శస్త్రచికిత్సను ఒక భయంకరమైన నరకయాతన నుండి సురక్షితమైన ప్రక్రియగా మార్చిన మహోన్నత ఆవిష్కరణ 'అనస్థీషియా' (నిర్మగ్నత/మత్తు మందు). 1846 అక్టోబర్ 16 న అమెరికాలోని బోస్టన్ నగరంలో విలియం థామస్ గ్రీన్ మోర్టన్ అనే డెంటిస్ట్ ప్రదర్శించిన 'డై ఈథైల్ ఈథర్' విజయవంతమైన ప్రయోగం శస్త్రచికిత్సల రూపురేఖలనే మార్చివేసింది. ఈ చారిత్రాత్మక ఘట్టానికి గుర్తుగా ప్రతి సంవత్సరం అక్టోబర్ 16న 'ప్రపంచ అనస్థీషియా దినోత్సవం' నిర్వహిస్తారు. ఆధునిక వైద్యంలో నొప్పి లేని చికిత్సను సాధ్యం చేసి, కోట్లాది మంది ప్రాణాలను కాపాడుతున్న అనస్థీషియాలజిస్టుల సేవలను స్మరించుకోవడమే ఈ రోజు ముఖ్య ఉద్దేశం.

అనస్థీషియా ఆవిష్కరణకు ముందు శస్త్రచికిత్స అంటే రోగికి వర్ణించలేని శారీరక, మానసిక చిత్రహింస. శస్త్రచికిత్స సమయంలో నొప్పిని తట్టుకోలేక రోగులు స్పృహ తప్పిపోవడం, షాక్‌కు గురై ప్రాణాలు కోల్పోవడం సర్వసాధారణంగా జరిగేది. ఆధునిక అనస్థీషియా రాకతో ఈ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఇది కేవలం నొప్పిని నివారించడమే కాకుండా, శస్త్రచికిత్సలు చేసే సమయంలో వైద్యులకు తగిన సమయాన్ని, రోగి శరీరంలో స్థిరమైన ఉష్ణోగ్రత, రక్తపోటు, ఆక్సిజన్ స్థాయిలను నిర్వహించే అవకాశాన్ని కల్పించింది. ఫలితంగా సంక్లిష్టమైన గుండె, మెదడు మరియు అవయవ మార్పిడి శస్త్రచికిత్సలు సాధ్యమయ్యాయి.

చాలామంది భావించేట్లుగా అనస్థీషియాలజిస్ట్ బాధ్యత కేవలం శస్త్రచికిత్సకు ముందు మత్తు మందు ఇవ్వడం ముగిసిపోదు. ఆపరేషన్ థియేటర్‌లో రోగి ప్రాణాలకు రక్షణ కల్పించే తెరవెనుక కథానాయకుడు 'అనస్థీషియా' వైద్యుడే. ఆపరేషన్ ప్రారంభానికి ముందు రోగి ఆరోగ్యాన్ని అంచనా వేయడం, శస్త్రచికిత్స జరుగుతున్నంత సేపూ గుండె స్పందనలు, రక్తం ప్రసరణ, శ్వాసక్రియలను క్షణక్షణం పర్యవేక్షించడం మరియు శస్త్రచికిత్స అనంతరం రోగి స్పృహలోకి వచ్చే వరకు అత్యంత జాగ్రత్తగా చూసుకోవడం వీరి విధి. ఐసియు, అత్యవసర సంరక్షణ మరియు తీవ్రమైన నొప్పి నిర్వహణ లో కూడా వీరి పాత్ర కీలకం. సాంకేతికత ఎంత అభివృద్ధి చెందినప్పటికీ, ప్రపంచవ్యాప్తంగా సరైన అనస్థీషియా సేవలు అందుబాటులో లేకపోవడం నేటికీ ఒక పెద్ద సవాలుగా మిగిలిపోయింది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలు మరియు అభివృద్ధి చెందుతున్న దేశాల్లో నైపుణ్యం కలిగిన అనస్థీషియాలజిస్టుల కొరత తీవ్రంగా ఉంది. దీనితో పాటు అనస్థీషియా పట్ల రోగుల్లో ఉన్న అనవసరమైన భయాలు, అపోహలను తొలగించాల్సిన అవసరం ఉంది. సురక్షితమైన శస్త్రచికిత్స అనేది ప్రతి మానవుడి ప్రాథమిక ఆరోగ్య హక్కుగా మారినప్పుడే అందరికీ నాణ్యమైన వైద్యం అందుతుంది. వైద్యశాస్త్ర చరిత్రలోనే అత్యంత గొప్ప ఆవిష్కరణలలో ఒకటైన అనస్థీషియా, మానవాళిని నొప్పి అనే బంధనం నుండి విముక్తి చేసింది. మానసిక ధైర్యాన్ని, శారీరక ఉపశమనాన్ని ఇస్తూ ప్రతిరోజూ లక్షలాది శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించడంలో సహాయపడుతున్న అనస్థీషియాలజిస్టుల కృషి అమోఘమైనది. ఈ ప్రపంచ అనస్థీషియా దినోత్సవం సందర్భంగా సురక్షితమైన వైద్య సేవ ల విస్తరణకు పునరంకితం అవుతూ, రోగి ప్రాణ రక్షణలో రాత్రింబవళ్లు శ్రమించే అనస్థీషియా నిపుణులకు కృతజ్ఞతలు తెలుపుకోవడం మన అందరి బాధ్యత.

(అక్టోబర్ 16 ప్రపంచ అనస్థీషియా దినోత్సవం)

సుధాకర్ ఎవి,
9000674747

# ఢిల్లీలో శక్తివంతమైన రాజ్యం, పౌరుల మధ్య పోరాటం



డాక్టర్ అరుణ్ మిత్రా

ఢిల్లీలో మునుపెన్నడూ లేని రీతిలో చేసిన భద్రతా ఏర్పాట్లు రాజధానిని వాస్తవంగా ఒక సైనిక స్థావరం (కంటోన్మెంట్)గా మార్చేశాయి. ఇది బ్రిటిష్ పాలనను గుర్తుకు తెస్తున్నాయి. అప్పట్లో వలస పాలకులు ప్రజా ఉద్యమాలను అణచివేసేందుకు, అసమ్మతిని అణగదొక్కేందుకు క్రూరమైన బలప్రయోగాన్ని ఉపయోగించేవారు. కేవలం ఢిల్లీలోనే కాకుండా దేశవ్యాప్తంగా సిజెపి, ఎఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎ నాయకులను, కార్యకర్తలను, అలాగే విద్యార్థులను, యువతను పెద్ద సంఖ్యలో అరెస్టు చేయడం, మోదీ ప్రభుత్వంలో పెరుగుతున్న భయాందోళనలను, అభద్రతాభావాన్ని బట్టబయలు చేస్తోంది.

జంతర్‌మంతర్ వద్ద తమ పౌరులు చేస్తున్న శాంతియుత నిరసనను ఎదుర్కొనేందుకు సన్నద్ధతలాగా కాకుండా, ఢిల్లీ ఏదో శత్రు సైన్యంపై దండ యాత్రకు సిద్ధమవుతున్నట్లుగా ఈ భద్రతా మోహరింపుల స్థాయి, తీరు కనిపిస్తోంది. ప్రజలు ఢిల్లీకి చేరుకోకుండా నిరోధించేందుకు రైళ్లను రద్దు చేయటం, ఇతర రవాణా మార్గాలపై తనిఖీలను కఠినతరం చేయడం వంటివి ప్రజాస్వామ్య అసమ్మతిని అణచివేయడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నానికి మరిన్ని సాక్ష్యాలు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) రాజీనామా కోరుతూ జరుగుతున్న ఆందోళనను అదుపు చేయకపోగా, ఈ అణచివేత చర్య లు ఉద్యమాన్ని వికేంద్రీకరించి, రాజధాని దాటి దేశంలోని వివిధ ప్రాంతాలకు వ్యాప్తి చేశాయి.

ప్రభుత్వాలు ప్రజా ఉద్యమాలకు రకరకాలుగా స్పందిస్తాయి. ప్రజాస్వామ్య ప్రభుత్వాలు సాధారణంగా సంభాషణకు ప్రాధాన్యతనిస్తూ, చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకునేందుకు ప్రయత్నిస్తాయి. అయి తే, నిరంకుశ పాలనలు బలప్రయోగం, అణచివేత వంటి మార్గాలను అనుసరిస్తాయి. ఇలాంటి ప్రతిస్పందనలు బలాన్ని కాకుండా బలహీనతను, అభద్రతను, హేతుబద్ధత లోపాన్ని ప్రతిబింబిస్తా యి.

జర్మనీలో నాజీలకు, కార్పొరేట్ ప్రయోజనాలకు మధ్య జరిగిన సహకారానికి చరిత్రే సాక్ష్యం. నాజీలు యూదులను దేశ శత్రువులుగా చిత్రీకరిస్తూ, దేశ సంపదను దోచుకుంటున్నారని ఆరోపించారు. వారు యూదు సమాజంపై ఉద్దేశపూర్వకంగా ద్వేషాన్ని, సామూహిక ఉన్మాదాన్ని రెచ్చగొట్టి, చివరికి గతంలో ఎన్నడూ లేని స్థాయిలో జాతి నిర్మూలనకు పాల్పడ్డారు. కమ్యూనిస్టులు, సోషలిస్టులు, కార్మిక సంఘాల వారు, సమాజంలోని ప్రగతిశీల వర్గాలు ఫాసిజాన్ని ప్రతిఘటించగా, యూదు వ్యతిరేక పక్షపాతంతోనో లేదా నాజీల క్రూరత్వపు భయంతోనో అనేకులు మౌన ప్రేక్షకులుగా మిగిలిపోయారు లేదా నాజీలకు మద్దతు కూడా ఇచ్చారు. ముస్సోలినీ హయాంలో ఇటలీలో కూడా ఇలాంటి నిరంకుశ పాలన, అణచివేత ధోరణి యే ఆవిర్భవించింది.

నేడు భారతదేశంలో మనం ఆందోళనకరమైన సారూప్యతలను చూస్తున్నాము. ఇక్కడ ప్రభుత్వ అధికారాన్ని చెలాయించే శక్తులు నిరంకుశ, మెజారిటీవాద ధోరణులను అంతకంతకూ ప్రదర్శిస్తున్నాయి. ప్రజాస్వామ్య విలువలను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్న యువతను అడ్డుకోవడానికి పారామిలిటరీ బలగాలను మోహరించి, ఢిల్లీని భారీ పోలీసు పహరా నగరంగా మార్చడం ఈ వైఖరికి ఒక స్పష్టమైన నిదర్శనం. ఈ పరిణామాల వెనుక ఉన్న భావజాలానికి ఒక చారిత్రక నేపథ్యం కూడా ఉంది. బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో ఆర్‌ఎస్‌ఎస్ పాల్గొనలేదు. దాని విమర్శకుల ప్రకారం, అది వలసవాద వ్యవస్థతో సర్దుకుపోయింది. భగత్ సింగ్ వంటి విప్లవకారులను ధైర్యవంతులని, కానీ తప్పుదారి పట్టినవారని ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన సిద్ధాంతకర్త ఎం. ఎస్. గోల్వాల్కర్ అభివర్ణించారు. గోల్వాల్కర్ జాతీయ సంపదను కొద్దిమంది చేతుల్లో కేంద్రీకరించాలని, తద్వారా అత్యధిక ప్రజలకు ఏమీ మిగలకుండా చేసి, కొద్దిమంది అధికారాలు గలవారు అధిక సంఖ్యాకులపై ఆధిపత్యం చెలాయించడానికి వీలు కల్పించాలని కూడా వాదించారు.

మణిపూర్‌లో మూడున్నర సంవత్సరాల తర్వాత కూడా కొనసాగుతున్న హింస పట్ల చూపుతున్న ఉదాసీనత ఈ భావజాల ధోరణిని వివరించేందుకు ఉపయోగపడుతుంది. నిఘా, బలప్రయోగం ద్వారా పాలించబడే రాజ్యాన్ని సాధించాలనే తపన, ఇజ్రాయెల్‌తో బలపడుతున్న భారతదేశం రక్షణ, భద్రతా సంబంధాలలోనూ, పౌరులు, రాజకీయ ప్రత్యర్థులతో సహా వ్యక్తులను పర్యవేక్షించడానికి ఇజ్రాయెల్ అభివృద్ధి చేసిన పెగాసస్ గూఢచర్య సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించినట్లు వచ్చిన నివేదికలలోనూ మరింతగా ప్రతిబింబిస్తుంది.

ఓటర్ల జాబితాల ప్రత్యేక విస్తృత సవరణ (ఎస్ఐఆర్)అమలులో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ప్రవర్తనపై తీవ్రమైన ప్రశ్నలు తలెత్తడంతో, ప్రభుత్వం ఇప్పుడు ఆత్మరక్షణలో పడింది. కోర్టు అనుమతితోనే ఫామ్–6కు చేసిన మార్పులు చేశామన్న జ్ఞానేశ్ కుమార్ వాదనకు విరుద్ధంగా, ఆ మార్పులకు తమ ఆమోదం లేదని భారత సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలు నిర్వహించే బాధ్యత అప్పగించబడిన ఒక సంస్థకు అధిపతిగా, ఈ వైరుధ్యం ఆయన విశ్వసనీయత, నిజాయితీపై తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తింది. ఈ చర్యలు ఎన్నికల సంఘం నైతిక అధికారానికి, ప్రజా విశ్వాసానికి కలిగించిన నష్టం మరింత ఆందోళనకరం. ఎస్ఐఆర్ ప్రక్రియ కారణంగా 13కోట్లకు పైగా భారత పౌరులు ఓటర్ల జాబితాల నుండి మినహాయించబడతారని, వారి ఓటు హక్కు నిరాకరించబడే అవకాశం ఉందని తీవ్ర ఆందోళనలు వ్యక్తమయ్యాయి. ఇంత పెద్ద ఎత్తున ఓటు హక్కును కోల్పోవడం ప్రజాస్వామ్యానికి తీవ్రమైన ముప్పు. ముఖ్యంగా, ప్రజాస్వామ్య జవాబుదారీతనం, పౌరుల హక్కుల పరిరక్షణ ఇప్పటికే ఒత్తిడికి గురవుతున్న తరుణంలో ఇది మరింత ప్రమాదకరం.

మన జనాభాలో అత్యధికులకు, విద్య, ఆరోగ్య సంరక్షణ, ఉపాధి, ఆరోగ్యకరమైన పర్యావరణం, న్యాయమైన వేతనం వంటి హక్కులు అందని ఆకాంక్షలు గానే మిగిలిపోయాయి. చాలా మందికి, ప్రభుత్వ విధానాలపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడానికి, అధికారంలో ఉన్నవారిని జవాబుదారీగా ఉంచడానికి ఉన్న కొన్ని అర్థవంతమైన మార్గాలలో ఓటు ఒకటి. ఈ ప్రాథమిక హక్కును బలహీనపరిచినా లేదా నిరాకరించినా, ప్రజలు తమ ప్రయోజనాలను కాపాడుకోవడానికి, ప్రజాస్వామ్య జీవితంలో పాల్గొనడానికి ఉన్న ఒక ముఖ్యమైన సాధనాన్ని కోల్పోతారు.

భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్‌కు ఆపాదించబడిన వ్యాఖ్యల చుట్టూ నెలకొన్న వివాదం నేపథ్యంలో, భారతదేశం అంతటా వేలాది మంది యువకులు తమ గౌరవాన్ని, ప్రజాస్వామ్య హక్కులను కాపాడుకునేందుకు ముందుకు వచ్చారు. ప్రజాస్వామ్య విలువలు క్షీణించడం, మోదీ ప్రభుత్వ అణచివేత చర్యలుగా వారు భావిస్తున్న వాటికి వ్యతిరేకంగా వారి ఆగ్రహం నిరసనల రూపంలో ఎక్కువగా వ్యక్తమవుతోంది. ప్రధాన మంత్రి, హోంమంత్రి ప్రభావంతో ఎన్నికల సంఘం పని చేస్తోందని ఆరోపిస్తూ, జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ 'ఇండియా కూటమి' కూడా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఈ విధంగా ఈ ఉద్యమం ఎక్కువగా మోదీ ప్రభుత్వ విధానాలు, రాజకీయ నాయకత్వం వైపే మళ్ళించబడుతోంది.

నిరంతర ప్రజా ఉద్యమాలు అత్యంత శక్తివంతమైన, అణచివేత వ్యవస్థలను సైతం సవాలు చేయగలవని చరిత్ర నిరూపిస్తుంది. అయితే, అటువంటి ఉద్యమాలను సునిశితమైన ఆలోచన, రాజకీయ స్పష్టత, క్రమశిక్షణ, స్పష్టమైన దిశానిర్దేశంతో నిర్వహించాలి. ఫాసిజం వ్యాప్తిని ఎదుర్కోవటానికి ప్రజాస్వామ్య, లౌకిక, ప్రగతిశీల శక్తులతో కూడిన ఒక బలమైన, విస్తృతమైన కూటమిని నిర్మించాల్సిన ఆవశ్యకత ఎంతగానో ఉంది. ఈ పోరాటానికి ఐక్యత, వ్యూహాత్మక దూరదృష్టి, నిరంతర ప్రజా సమీకరణ అత్యంత అవసరం.

ద్రవ్య పెట్టుబడిలోని అత్యంత ప్రతిఘాతవాద, జాత్యాహంకార, సామ్రాజ్యవాద శక్తుల బహిరంగ, ఉగ్రవాద నియంతృత్వంగా ఫాసిజాన్ని జార్జి దిమిత్రోవ్ నిర్వచించారు. ఇది ఆర్థిక పెట్టుబడిలోని అత్యంత ప్రతిఘాతవాద వర్గాల ప్రత్యక్ష అధికార ప్రయోగాన్ని సూచిస్తుంది. ఇది బూర్జువా ప్రజాస్వామ్యాన్ని మార్చేసి, కార్మికవర్గం, రైతాంగం, మేధావులపై బహిరంగ హింస, అణచివేతలను ప్రవేశపెడుతుంది. అంతర్జాతీయ వేదికపై, ఇది తీవ్ర జాత్యాహంకారం, విస్తరణవాదం, సామ్రాజ్యవాద యుద్ధం ద్వారా వ్యక్తమవుతుంది.

ఆంటోనియో గ్రామ్సీ అవగాహన ప్రకారం ఫాసిజానికి వ్యతిరేకంగా జరిగే పోరాటం కేవలం సైనిక లేదా ఆర్థిక ఘర్షణలకు అతీతంగా రాజకీయ వ్యవస్థ, సాంస్కృతిక భాగస్వామ్యం, భావాల పోరాటాన్ని కూడా కలిగి ఉండాలని నొక్కి చెప్పింది. కార్మికులు, రైతులు మూల సూత్రాలను విడిచిపెట్టే సంస్కరణవాద రాజీలను, అలాగే రాజకీయ నిష్క్రియాత్మకతను తిరస్కరించి, పెట్టుబడిదారీ దోపిడీ, ఫాసిస్ట్ హింస నుండి ప్రజలను రక్షించగల విస్తృత కూటములను నిర్మించుకోవాలి. ఫాసిజం కేవలం బలప్రయోగంతోనే కాకుండా, తన విలువలను రోజువారీ ఆలోచనా విధానంలో, ప్రజా సంస్కృతిలో, సామాజిక సంస్థలలో పాతుకుపోయేలా చేయడం ద్వారా కూడా మనుగడ సాగిస్తుంది. కాబట్టి, దానిని ఓడించడానికి గ్రామ్సీ వర్ణించినట్లుగా ఒక 'స్థాన యుద్ధం' అవసరం. అంటే, నిరంకుశ భావజాలాలను సవాలు చేయడానికి, అవి ఆధారపడిన సామాజిక అంగీకారాన్ని కూల్చివేయడానికి పౌర సమాజం, సాంస్కృతిక సంస్థలు, సైద్ధాంతిక రంగంలో నిరంతరంగా సాగించే పోరాటం.

కాబట్టి, భారతదేశంలోని ప్రజాస్వామ్య శక్తులు తమ విభేదాలను పక్కనపెట్టి, రాజ్యాంగ విలువలు, పౌర స్వేచ్ఛలు, మానవ హక్కులను పరిరక్షించడానికి కలిసి ముందుకు సాగడం అత్యవసరం. అదే సమయం లో, వారు తమ స్వీయ లోపాలను, సంస్థాగత బలహీనతలను, రాజకీయ వ్యూహాలను నిజాయితీగా సమీక్షించుకోవాలి. దేశం ఎదుర్కొంటున్న ప్రాథమిక ప్రశ్నలపై ఐక్యతను, ద్వితీయ ప్రాధాన్యత అంశాలపై ఉన్న విభేదాలు అడ్డుపడటానికి అనుమతించకూడదు. సైద్ధాంతిక చర్చను నిర్మాణాత్మకంగా జరిపినప్పుడు, అది ఉద్యమాలను బలోపేతం చేసి, రాజకీయ అవగాహనను పెంచుతుంది. అయితే, వ్యక్తిగత ఆశయాలు, వర్గ ప్రయోజనా లు సంస్థాగత విశ్వసనీయతను దెబ్బతీసి, ఉమ్మడి కార్యాచరణను బలహీనపరిచి, ప్రజల విశ్వాసాన్ని క్షీణింపజేస్తాయి. బృహత్తర పోరాటం కంటే వీటికి ఎన్నడూ ప్రాధాన్యత లభించకూడదు.

ఈ పోరాటానికి రాజకీయ స్పష్టత, సంస్థాగత ఐక్యత, పటిష్టమైన వ్యూహం, నిరంతర ప్రజా భాగస్వామ్యం మార్గదర్శకంగా ఉండాలి. ముప్పు తీవ్రతను గుర్తించటంలో ఏమాత్రం విఫలమైనా, లేదా ఐక్యంగా, సమర్థవంతంగా ప్రతిఘటనను నిర్మించడంలో ఏ మాత్రం సంకోచించినా, అది కేవలం ప్రజాస్వామ్య సంస్థలకు, శ్రామిక ప్రజల హక్కులకే కాకుండా, సమాజం మొత్తానికే వినాశకరమైన పరిణామాలకు దారితీయవచ్చు.

# వ్యవసాయానికి నిధుల కొరత

భారతదేశంలో వాతావరణ మార్పుల ప్రభావం వ్యవసాయంపై తీవ్రంగా పడుతోంది. వేసవి ఎండలు కొన్ని ప్రాంతాల్లో తగ్గినప్పటికీ, అధిక ప్రాంతాల్లో ఇంకా వేసవిని తలపించే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ కారణంగా పండ్ల పెరుగుదల మందగించడం, కూరగాయల విత్తనాలు మొలకెత్తకపోవడం, చీడపీడలు పెరగడం వంటి సమస్యలు రైతులను ఇబ్బంది పెడుతున్నాయి. వాతావరణ హెచ్చరికలు అందుబాటులో ఉన్నప్పటికీ, వాటిని

## అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం జరిగే వరకూ

# విశ్రమించేది లేదు

- సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలి
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు
- ఎన్నికల నాటి హామీని సిఎం నెరవేర్చాలి : పశ్య పద్మ

**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం :** అగ్రిగోల్డ్ బాధితులకు సంపూర్ణ న్యాయం జరిగే వరకు ఉద్యమాలు కొనసాగిస్తామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయం శేషగిరిభవన్‌లో గురువారం జిల్లా స్థాయి అగ్రిగోల్డ్ బాధితుల విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ హాజరైనారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ రెక్కాడితే గానీ డొక్కాడని చిరువ్యాపారులు, రైతులు, పేదలు తమ కష్టార్జితాన్ని పొదుపు చేసుకుంటే ఆ సంస్థ నిలువునా మోసం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతపాలకులు నిర్లక్ష్యం కారణంగా ఏళ్లు గడుస్తున్నా బాధితులకు చిల్లిగవ్వకూడా అందకపోవడం దుర్మార్గమన్నారు. లక్షలాది మంది పేద కుటుంబాలు, ఎంతో మంది ఏజెంట్లు రోడ్డున పడి తీవ్ర మానసిక క్షోభతో ప్రాణాలు కోల్పోతుంటే ప్రభుత్వాలు చోద్యం చూడటం భావ్యం కాదన్నారు. సంస్థకు సంబంధించిన వేలకోట్ల విలువైన ఆస్తులను వెంటనే వేలం వేసి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బాధితుల సమస్యల సత్వర పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో అగ్రిగోల్డ్ యాజమాన్యం బినామీ పేర్లతో దాచిపెట్టిన ఆస్తులను గుర్తించి తక్షణమే ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అగ్రిగోల్డ్ కంపెనీ మోసాలను తట్టుకోలేక మరణాలకు పాల్పడిన బాధితులు ఏజెంట్ల కుటుంబాలకు రూ.5 లక్షలచొప్పున నష్టపరిహారం ఇవ్వాలన్నారు. బాధితుల పక్షాన అసెంబ్లీలో గళమెత్తడంతో పాటు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి పూర్తి నాయ్యం దక్కేలా ఉద్యమిస్తామని భరోసా ఇచ్చారు.

### ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేసి న్యాయం చేయాలి : పశ్య పద్మ

అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక కోర్టును ఏర్పాటు చేసి తక్షణమే న్యాయం చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ డిమాండ్ చేశారు. 2005–15 మధ్య కాలంలో అగ్రిగోల్డ్ సంస్థ తెలుగు రాష్ట్రాల్లో పేదలు, రైతుల నుండి రూ.600 కోట్లకు పైగా వసూళ్లు చేసి ఘరానా మోసానికి పాల్పడిందన్నారు. ఒక్క తెలంగాణలోనే సుమారు 3 లక్షల మంది బాధితులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వంద రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, ఇప్పటికైనా ఆ హామీని నిలబెట్టుకోవాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని బాధితులకు న్యాయం చేసేందుకు 35,444 మంది భూములను నిషేదిత జాబితా నుండి తొలగించిన మాదిరిగానే తెలంగాణాలోనూ తక్షణ నిర్ణయం తీసుకోవాలన్నారు. కంపెనీ వెంచర్లలో పేదలు కొనుగోలు చేసి ఇప్పటికే రిజిస్ట్రేషన్ పూర్తయిన ఇండ్ల స్థలాలను అటాచ్‌మెంట్ జాబితా నుండి తొలగించి బాధితులకు అప్పగించాలన్నారు. ఏళ్ల తరబడి బాధితులు ఏజెంట్లు ఆవేదనతో బతుకుతుంటే పాలకులు మొద్దునిద్ర వీడకపోవడం దారుణమన్నారు. బాధితల పక్షాన జరిగే రాజీలేని పోరాటాలకు తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం సంపూర్ణ మద్దతుగా నిలుస్తుందని ఆమె స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, మేయర్ మూడ్ గణేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు వీశంశెట్టి పూర్ణ చంద్రరావు, రైతు సంఘం జిల్లనాయకులు వైఎస్ గిరి, తెలంగాణ అగ్రిగోల్డ్ బాధితుల సంఘం నాయకులు, బాధితులు, ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## 'ఎల్ నినో'ను ఎదుర్కొనేందుకు..

# సమగ్ర కార్యాచరణ

### సిద్ధం కావాలని అధికారులకు మంత్రి సీతక్క ఆదేశాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎల్‌నినో ప్రభావంతో రాబోయే రోజుల్లో తలెత్తే కరువు పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు అధికారులు ఇప్పటి నుంచే సమగ్ర కార్యాచరణతో సిద్ధం కావాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి కొరత, ఉపాధి సమస్యలు, పశుగ్రాసం అభావం వంటి ఇబ్బందులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఏజెన్సీ, గిరిజన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రతి ఆదివాసీ గిరిజన కుటుంబానికి కనీసం 125 రోజుల ఉపాధి హామీ పనులు కల్పించాలని స్పష్టం చేశారు. బేగంపేటలో గురువారం విబిజిరామ్ జి' ద్వారా ఎల్‌నినో కరువు నివారణ చర్యలపై నిర్వహించిన రాష్ట్ర స్థాయి సదస్సుకు మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ కమిషనర్ దివ్య దేవరాజన్‌తో పాటు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారులు, సబ్ కలెక్టర్లు, ఐటిడిఏ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అదనపు డిఆర్‌డిఓలు, పిఓలు, ఎంపిడిఓలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామపంచాయతీల పరిధిలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాల ద్వారానే పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందన్నారు. చిట్టచివరి గ్రామంలోని చిట్టచివరి వ్యక్తి అభివృద్ధి చెందడమే నిజమైన సమగ్ర అభివృద్ధి అని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 16 నుంచి 18 జిల్లాల పరిధిలో సాధారణ వర్షపాతం కంటే 20 శాతానికి పైగా లోటు నమోదైందని, 18 జిల్లాల్లోని 320 మండలాలను తీవ్ర ఎల్‌నినో ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించినట్లు నివేదికలు చెబుతున్నాయని తెలిపారు. సాధారణ వేసవి ప్రభావం మూడు నెలలే ఉంటుందని, కానీ ఈసారి దాదాపు ఎనిమిది నెలల పాటు వేసవి తరహా పరిస్థితులు ఉండే అవకాశమున్నందున అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. గిరిజన ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం అత్యంత కీలకమని, రాబోయే ఐదు నెలల్లో ప్రతి జాబ్‌కార్డులకు నెలకు కనీసం రూ.7,500 వేతనం అందేలా లక్ష్యంగా పెట్టుకోవాలని చెప్పారు. పనుల్లో పారదర్శకత కోసం ప్రతి ఆదివాసీ నివాస ప్రాంతంలో ఒక మేట్‌ను నియమించాలని, వేతనాలు సకాలంలో చెల్లించాలని స్పష్టం చేశారు. ఉపాధి హామీ కింద లభ్యమయ్యే 370 రకాల పనులను ఉపయోగించుకుని ఊట చెరువులు, పెర్కొలేషన్ ట్యాంకులు, కందకాల తవ్వకం, మట్టి రహదారుల నిర్మాణం వంటి పనుల ద్వారా గ్రామాల్లో శాశ్వత ఆస్తులను సృష్టించాలని పిలుపునిచ్చారు. అధికారులు కేవలం కార్యాలయాలకే పరిమితం కాకుండా నిరంతరం గ్రామాల్లో పర్యటిస్తేనే ప్రజల సమస్యలు తెలుస్తాయని స్పష్టం చేశారు. పంచాయతీరాజ్, ఐటిడిఏ, పేదరిక నిర్మూలన సంస్థలు సమన్వయంతో పని చేసి ఎల్‌నినో సవాల్‌ను విజయవంతంగా ఎదుర్కోవాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు.

# గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపే లక్ష్యం

కాంగ్రెస్ శ్రేణులంతా సమన్వయంతో పనిచేసి భారీ మెజారిటీ సాధించాలి
మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క

**ప్రజాపక్షం/హనుమకొండ :** రాబోయే వరంగల్, ఖమ్మం, నల్గొండ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహకాల్లో భాగంగా హనుమకొండ జిల్లా మడికొండలోని సత్యసాయి కన్వెన్షన్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ తాగునీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి శ్రీమతి ధనసరి అనసూయ (సీతక్క), కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి హాజరయ్యారు. ఈ సమావేశంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్‌తో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ మాట్లాడుతూ రాబోయే వరంగ, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికలకు సిద్ధం కావాలన్నారు. ముఖ్యంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని యూనివర్సిటీ విద్యార్థులు, ఉద్యోగస్తులు, పట్టభద్రులు, నిరుద్యోగ యువతతో పాటు విద్యావంతులందరినీ కలుపుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు, ఉద్యోగులు, పట్టభద్రుల సమస్యలను తెలుసుకుంటూ, వారితో నిరంతరం సమన్వయం చేసుకుంటూ పార్టీ ఎన్నికల కార్యాచరణను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేస్తూ పట్టభద్రులతో సంబంధాలను బలోపేతం చేసుకోవాలని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి విజయమే లక్ష్యంగా ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త సమష్టి కృషి చేయాలన్నారు. యూనివర్సిటీ విద్యార్థులు, ఉద్యోగస్తులు, పట్టభద్రులు, యువతను సమన్వయం చేసుకుంటూ ఎన్నికల సన్నాహాలను పటిష్టంగా నిర్వహించాలని అయూబ్ కోరారు. అర్హులైన పట్టభద్రుల ఓటరు నమోదు, ఓటరు జాబితాలో వివరాల పరిశీలన, ఎన్నికల నిబంధనలపై అవగాహన కల్పించడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులంతా ఐక్యంగా ముందుకు సాగుతూ, పార్టీ నాయకత్వం నిర్దేశించిన కార్యాచరణను సమర్థవంతంగా అమలు చేయాలని, ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి విజయానికి కృషి చేయాలని వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, చైర్మన్స్, డిసిసి అధ్యక్షులు , రాష్ట్ర, జిల్లా, మండల, డివిజన్, టౌన్, ముఖ్య నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మార్కెట్ యార్డులన్నీ డిజిటల్ బాటలోకి!

- 15 రోజుల్లో సమగ్ర ప్రణాళిక సమర్పించాలి..
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలోని మార్కెట్ యార్డుల్లో గేట్ ఎంట్రీ నుంచి రైతులకు చెల్లింపుల వరకు ప్రతి దశను డిజిటలైజ్ చేసి, పారదర్శక మార్కెటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించిన సమగ్ర ప్రణాళికను రూపొందించి 15 రోజుల్లోగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించాలని స్పష్టం చేశారు. గురువారం సచివాలయంలో మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ రాహుల్ రాజ్‌తో సమావేశమైన మంత్రి.. మార్కెట్ యార్డుల ఆధునికీకరణ, సోలార్ విద్యుత్ వ్యవస్థల ఏర్పాటు, గోదాముల నిర్మాణం, సిబ్బంది నియామకాలపై సమీక్షించారు. మార్కెట్లలో వాహనం ప్రవేశించినప్పటి నుంచి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయాలు, తూకం, లావాదేవీలు, చెల్లింపులు పూర్తయ్యే వరకు అన్ని ప్రక్రియలను డిజిటల్ విధానంలో నిర్వహించాలని సూచించారు. రైతులకు ఆన్‌లైన్‌లోనే చెల్లింపులు జరిగేలా వ్యవస్థను రూపొందించాలని, తద్వారా పారదర్శకత, జవాబుదారీతనం పెంచి అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రతి మార్కెట్ యార్డులో సోలార్ విద్యుత్ వ్యవస్థలను ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. ఇప్పటికే 10 మార్కెట్ యార్డుల్లో ఇందుకు సంబంధించిన పనులు కొనసాగుతున్నాయని అధికారులు వివరించారు. మరోవైపు, తక్కువ స్థలంలో ఎక్కువ వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ చేసుకునేలా సైలోస్ విధానంలో గోదాములను నిర్మించాలని సూచించారు. మార్కెటింగ్ శాఖ పరిధిలో గోదాముల నిల్వ సామర్థ్యాన్ని రెండు లక్షల మెట్రిక్ టన్నులకు పెంచే లక్ష్యంతో అవసరమైన నిర్మాణాలు చేపట్టాలని ఆదేశించారు.మార్కెటింగ్ శాఖలో ఇంజనీరింగ్ అధికారుల నియామకాలను వేగవంతం చేయాలని,టిజిపిఎన్‌సి లేక జెఎన్‌టియూ ద్వారా నియామకాలు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. అజీజ్‌నగర్‌లో ప్రభుత్వం కేటాయించిన స్థలంలో కొత్త మార్కెట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, తూప్రాన్, గజ్వేల్, సూర్యాపేట తదితర ప్రాంతాల్లో నిరుపయోగంగా ఉన్న సమీకృత మార్కెట్లను తిరిగి అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు హైదరాబాద్ గ్రోత్ కారిడార్ ఎండి ఉపేందర్‌రెడ్డితో మాట్లాడిన మంత్రి కోహెడ్ మార్కెట్ పనులను వేగవంతం చేయాలని సూచించారు. మార్కెట్ యార్డులను ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చేసి రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు.

# రాష్ట్రంలో వారం రోజులు వర్షాలు

- పలు జిల్లాలకు ఉరుములు, ఈదురుగాలుల హెచ్చరిక
- వెల్లడించిన హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో రాగల ఐదు రోజుల పాటు పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. గురు, శుక్రవారాల్లో ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు, ఈదురుగాలులు వీచే అవకాశం ఉందన్నారు. శుక్ర, శనివారాల్లో వరంగల్, హనుమకొండ, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్ జిల్లాలు కూడా ఈ హెచ్చరిక పరిధిలోకి వస్తాయన్నారు. శనివారం నుంచి సోమవారం వరకు రాష్ట్రంలోని మరిన్ని ప్రాంతాలకు వర్షాలు విస్తరించే అవకాశముందన్నారు. జనగామ, సిద్ధిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాల్లో కూడా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముందని హెచ్చరించారు. సోమ, మంగళవారాల్లో వర్షాల తీవ్రత మరింత పెరిగే అవకాశముందన్నారు. వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. అదే సమయంలో జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ, సిద్ధిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్‌మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పారు. మంగళ, బుధవారాల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కొనసాగే అవకాశముందన్నారు. బుధ, గురువారాల్లో రాష్ట్రవ్యాప్తంగా కొన్ని చోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లోని కాంట్రాక్టు కార్మికుల జీతాలు పెంచాలి

నవంబర్ 12 నుంచి ఆందోళనలు : ఎండి.యూసుఫ్, ఎం.నరసింహ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ కార్మికుల కనీస వేతనాన్ని రూ.26 వేలకు పెంచాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర అధ్యక్షుడు ఎండి.యూసుఫ్, ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ డిమాండ్ చేశారు. జీతాల పెంపు, కార్మిక చట్టాల ప్రకారం సెలవుల అమలు కోసం నవంబర్ 12 నుంచి ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆందోళనలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. హిమాయత్‌నగర్‌లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన యూనియన్ సర్వసభ్య సమావేశంలో వారు మాట్లాడారు. గత ఐదేళ్లుగా చాలీచాలని వేతనాలతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదేళ్ల క్రితం టెండర్లు పిలిచిన సమయంలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా కార్మికులకు తక్కువ వేతనాలు అందుతున్నాయని పేర్కొన్నారు. కాంట్రాక్టు గడువు ముగిసి రెండేళ్లు కావస్తున్నా కొత్త టెండర్లు పిలవకపోవడం, వేతనాలు పెంచకపోవడం పట్ల ప్రభుత్వ అధికారుల తీరును విమర్శించారు. కార్మికుల వేతనాల పెంపు, చట్టబద్ధమైన సెలవుల అమలు కోరుతూ ఈ నెల 22న సంబంధిత అధికారులకు నోటీసులు అందజేయనున్నట్లు తెలిపారు. కాంట్రాక్టు చట్టం ప్రకారం ఏడాదికి 23 సెలవులు అమలు చేయాల్సి ఉన్నా, నేటికీ అమలు కావడం లేదని ఆరోపించారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి వై.ఓమయ్య, యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.లక్ష్మి బాయి, ఉప ప్రధాన కార్యదర్శి హసీనా బేగం, కార్యదర్శులు పి.సురేష్, ఏ.పార్వతి, జె.లక్ష్మి , ఎస్.కిష్టమ్మ, ఎఐటియుసి నాయకులు గన్నార రమేష్, సిర్రా దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌బి స్టేడియంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

### తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ: లలిత వాకిటి శ్రీహరి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలు, మహిళల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్‌లోని ఎల్‌బి ఇండోర్ స్టేడియంలో జరిగిన ఈ వేడుకల్లో మంత్రి వాకిటి శ్రీహరి సతీమణి లలిత పాల్గొని సందడి చేశారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సోని బాలాదేవితో పాటు అథారిటీ ఉద్యోగులు వేడుకల్లో పాల్గొన్నారు. తెలంగాణ సంప్రదాయానికి అద్దంపట్టేలా బతుకమ్మలను అందంగా అలంకరించి, ఉత్సాహంగా వేడుకలు జరుపుకున్నారు. మహిళలు ఆనందోత్సాహాల మధ్య బతుకమ్మ సంబరాల్లో పాల్గొని తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని చాటిచెప్పారు. తెలంగాణ అస్తిత్వానికి, ఐక్యతకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను సంప్రదాయబద్ధంగా జరుపుకోవడం ద్వారా భావితరాలకు రాష్ట్ర సంస్కృతి, వారసత్వాన్ని అందించవచ్చనే సందేశాన్ని ఈ వేడుకలు చాటిచెప్పాయి.

# బొగ్గు దిగుమతి ముసుగులో భారీ మోసానికి కుట్ర : కెటిఆర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** విదేశీ బొగ్గు దిగుమతి ముసుగులో సిఎం రేవంత్ రెడ్డి రూ.3 వేల కోట్ల భారీ స్కామ్‌కు కుట్ర చేస్తున్నారని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు ఆరోపించారు. భోత్రా లాజిస్టిక్స్‌తో రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి సంస్థ చేసుకున్న అన్ని రహస్య అగ్రిమెంట్లను బయటపెట్టాలని, ఈ కుంభకోణంపైన స్వతంత్ర సంస్థతో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఏ ప్రాతిపదికన సదరు కంపెనీని ఎంపిక చేశారో సమాధానం చెప్పాలన్నారు. విదేశీ బొగ్గు దిగుమతి పేరుతో సింగరేణి సంస్థకు సిఎం రేవంత్ రెడ్డి మరణశాసనం రాస్తున్నారని, కాంగ్రెస్ – బిజెపి కలిసి చేస్తున్న ఈ కుట్రలను బిఆర్‌ఎస్ చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. ఈ మేరకు సిఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డికి కెటిఆర్ గురువారం బహిరంగ లేఖ రాశారు. భోత్రా లాజిస్టిక్స్ అనే అనుమానాస్పద కంపెనీతో ముందే ముఖ్యమంత్రి చీకటి ఒప్పందం చేసుకున్నారని, కావాలనే కృత్రిమ బొగ్గు కొరత ద్వారా కరెంట్ సంక్షోభాన్ని సృష్టించి, అదనుచూసి ఆ కంపెనీని రంగంలోకి దింపారని ఆరోపించారు. సింగరేణి సంస్థకు రూ.60 వేల కోట్ల బాకీ చెల్లించకుండా సంస్థను కుప్పకూల్చేందుకు కుతంత్రం చేస్తున్నారని, దేశీయ సంస్థలను పక్కనపెట్టి కమీషన్ల కోసమే విదేశీ బొగ్గు కోసం వెంపర్లాడుతున్నారని మండిపడ్డారు. కమీషన్ల ముసుగులో ప్రతిటన్నుకు రూ1500ల చొప్పున ఏకంగా రూ.3వేల కోట్ల దోపిడీకి సిఎం రేవంత్, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క రంగం సిద్ధం చేశారన్నారు. భోత్రా లాజిస్టిక్స్ కంపెనీకి సింగరేణిలో కాంట్రాక్టులు అప్ప గించడంలో అనుసరించిన ప్రమాణాలేమిటని, ఏ అర్హతల ఆధారంగా ఈ సంస్థను ఎంపిక చే శారని ప్రశ్నించారు. 2023–24లో సుమారు 70.02 మిలియన్ టన్నుల ఉత్పత్తి నమోదవ్వగా, 2025–26లో ఉత్పత్తి సుమారు 58 మిలియన్ టన్నులకు పడిపోయిందని, ఇందుకు కారణాలు ఏమటని ప్రశ్నించారు. యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో బొగ్గు, యాష్ హ్యాండ్లింగ్ వంటి పనులను ప్రైవేటు సంస్థలకు అప్పగిం చి న అంశంపైన కూడా ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. విదేశీ బొగ్గు దిగుమతుల ప్రతిపాదనలపై శ్వేతపత్రం విడుదల చేయాలి. ఇప్పటి వరకు జరిగిన చర్చలు, ప్రతిపాదనలు, టెండర్లు, కొనుగోలు పరిమాణం, ధరల అంచ నాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సంక్షోభంపై ప్రభుత్వ ప్రణా ళికలను స్పష్టం చేయాలని, బొగ్గు సరఫరా, విద్యుత్ ఉత్పత్తి, ముందస్తు ప్రణాళికలో జరిగిన లోపాలపై సమగ్ర నివేదిక విడుదల చేసి, ప్రజలకు నిరంతర విద్యుత్ సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.

తెలంగాణ ప్రభుత్వము
రోడ్లు మరియు భవనాల శాఖ
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఆర్&బి) కార్యాలయం, డివిజన్: గజ్వేల్

NIT NO. 02/EE/R&B/GJWL/2026-27 — తేది: 14.10.2026

| క్ర.సం. | పని పేరు | అంచనా విలువ |
|---|---|---|
| 1 | సిద్దిపేట్ జిల్లాలోని గజ్వేల్ (ఆర్&బి) డివిజన్‌కు సంబంధించిన (04) పనులు. | రూ.98.00 లక్షలు |

1. బిడ్ సమర్పణకు ఆఖరి తేదీ: రూ.31.10.2026 సా.4.00గం.ల వరకు
2. సంప్రదించవలసిన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పేరు & చిరునామా: ఎగ్జిక్యూటివ్ 

# తాగునీటి సరఫరాకు ప్రత్యామ్నాయ ప్రణాళికలు

**పంటల రక్షణకు రానున్న రోజులు కీలకం**
**నీటి సంరక్షణ, ఆరుతడి పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలి**
**సిఎస్ సంజయ్ జాజు**

**ప్రజాపక్షం /సంగారెడ్డి :** ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితుల్లో చోటు చేసుకుంటున్న మార్పులు, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో తాగునీటి కొరత తలెత్తకుండా ముందుస్తు చర్యలు చేపట్టాలని ప్రస్తుత పంటలను కాపాడేందుకు వ్యవసాయ విద్యుత్ ,నీటిపారుదల శాఖలు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావంతో నీటి లభ్యత వ్యవసాయ రంగంపై పడే ప్రభావాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించేందుకు గురువారం సిఎస్ సంగారెడ్డి జిల్లాలో పర్యటించారు. ఇందులో భాగంగా సింగూరు జలాశయంలో నీటి నిల్వలను పరిశీలించారు. అనంతరం పుల్కల్ మండలం పెద్దారెడ్డి పేట వాటర్ ట్రీట్ మెంట్ ప్లాంట్‌లో నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, ట్రాన్స్‌కో సిఎండి జితేష్ పాటిల్, జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ ,జిల్లా ఎస్‌పి పరితోష్ ఫంకజ్, నీటిపారుదల ఆర్‌డబ్ల్యు ఎస్, విద్యుత్, వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, గ్రామీణాభివృద్ధి తదితర శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. సంగారెడ్డి, కామారెడ్డి, నిజామాబాద్, మెదక్ జిల్లాల్లో తాగునీటి సరఫరాకు ఇబ్బందులు తలెత్తకుండా చేపట్టాల్సిన ప్రత్యామ్నాయ చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సింగూరు జలాశయంలో నీటి మట్టం ,జిల్లాలో తాగునీటి లభ్యత వర్షపాతం పంటల సాగు పరిస్థితులు , తాగునీటి సరఫరాకు రూపొందించిన ప్రత్యామ్నాయ ప్రణాళికల గురించి సిఎస్‌కు వివరించారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ సింగూరు , మంజీరా జలాశయాల్లో నీటి నిల్వలు ,భూగర్భ జలాల పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని అందుబాటులో ఉన్న నీటిని ప్రణాళిక బద్ధంగా వినియోగించాలని సూచించారు. గ్రామాల వారీగా తాగునీటి అవసరాలను గుర్తించి అవసరమైన ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో కార్యాచరణ ప్రణాళికలను పటిష్టంగా అమలు చేయాలన్నారు. అగ్రిమెంటేషన్ అవసరమైన పనులన్నింటిని నవంబర్ నెలాఖరులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అవసరమైన ప్రాంతాల్లో అవసరమైనప్పుడు నీటి రవాణా ఏర్పాట్లు చేయడంతో పాటు అవసరమైన బోర్ వెల్లను ,హైరింగ్ చేసుకోవడానికి చర్యలు చేపట్టాలని సూచించారు. రానున్న 15–20 రోజులు పంటల రక్షణకు అత్యంత కీలకమైనందున వ్యవసాయ అధికారులు క్షేత్ర స్థాయిలో పంటల పరిస్థితులను పరిశీలించి రైతులకు అవసరమైన సూచనలను అందించాలని తెలిపారు. ట్రాన్స్ పార్మర్లపై అధిక విద్యుత్ బారం పడకుండా చర్యలు తీసుకోవడంతో పాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా జరిగేలా చూడాలన్నారు. నీటి లభ్యత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఆరుతడి స్వల్పకాలిక ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. పశుగ్రాసం కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని విబి–జి రామ్‌జీ పథకం కింద నీటి సంరక్షణ పనులు, నీటి నిల్వ కుంటల నిర్మాణం వంటి పనులను గుర్తించి చేపట్టాలని అవసరమైన పనుల జాబితాను ముందుగానే సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం చౌటకూరు గ్రామంలో కౌలు రైతు గొల్ల మహేష్ ఏడు ఎకరాల్లో సాగు చేస్తున్న పత్తి పంటను సిఎస్ పరిశీలించారు. వర్షాలు సకాలంలో కురవకపోవడంతో పత్తి దిగుబడి తగ్గే అవకాశం ఉందని రైతు వివరించారు. వర్షపాతం లోటు, వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటితో సాగు చేయగల స్వల్పకాలిక కూరగాయ పంటలను సాగు చేయాలని సిఎస్ సూచించారు. ట్రాన్స్‌కో సిఎండి జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ వర్షభావ పరిస్థితుల కారణంగా భూగర్భ జలమట్టాలు తగ్గి విద్యుత్ మోటార్లు ట్రాన్స్‌పార్మర్లపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉందన్నారు. రైతులు తక్కువ నీటితో సాగు చేయగల ఆకుకూరలు, కూరగాయలను పండించడంతో పాటు కోళ్ల పెంపకం , గొర్రెల పెంపకం వంటి అనుబంధ రంగాల ద్వారా ఆదనపు ఆదాయం పొందేలా సంబంధిత శాఖల అధికారులు తగిన సలహాలు సూచనలు అందించాలని తెలిపారు. ఆ కార్యక్రమంలో ఆదనపు ఎస్‌పి చైతన్య రెడ్డి, నారాయణ ఖేడ్ సబ్ కలెక్టర్, ఉమా హారతి, నీటిపారుదల ,ఆర్‌డబ్ల్యుఎస్ వ్యవసాయ ఉద్యానవన పశుసంవర్ధక ,గ్రామీణాభివృద్ధి, విద్యుత్ తదతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రిమ్స్ అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి: కలెక్టర్ రాజర్షి

**ప్రజాపక్షం/మావల:** రిమ్స్ ఆసుపత్రిలో అభివృద్ధి, భవన నిర్మాణ పనుల్లో నాణ్యత తప్పుతే ఉపేక్షించేది లేదని జిల్లా కలెక్టర్ రాజర్షిషా హెచ్చరించారు. గురువారం అదనపు కలెక్టర్ రాజేశ్వర్‌తో కలిసి రిమ్స్‌లోని కొత్త బ్లాక్, పరిసరాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో పారిశుద్ధ్యం పాటించని ఏజెన్సీలకు జరిమానాలు విధిస్తామన్నారు. రోగులు, అటెండెంట్లకు కావాల్సిన సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.

## యువత గంజాయికి దూరంగా ఉండాలి: ఎఎస్‌పి చిత్తరంజన్

**ప్రజాపక్షం / జైనూర్ :** యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని అసిఫాబాద్ ఎఎస్‌పి చిత్తరంజన్ అన్నారు. అసిఫాబాద్ సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో గెలుపొందిన జట్లకు ఆయన బహుమతులు ప్రదానం చేశారు. ఈ పోటీల్లో సిర్పూర్ (యు) మండలంలోని దేవుగూడ జట్టు ప్రథమ స్థానంలో నిలవగా, రాసిమెట్ట జట్టు ద్వితీయ, శివ్వూర్ జట్టు తృతీయ బహుమతులు సాధించాయి. ఈ సందర్భంగా ఎఎస్‌పి మాట్లాడుతూ యువత గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి రవాణా, విక్రయాలకు పాల్పడే వారి సమాచారాన్ని పోలీసులకు అందించి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి అశోక్, సిఐ రమేష్, ఎస్ఐ రవికుమార్, క్రీడాకారులు పాల్గొన్నారు.

## పాలపిట్టల సంరక్షణ అందరి బాధ్యత

**అటవీ డివిజనల్ అధికారి రామ్మోహన్**

**ప్రజాపక్షం / జన్నారం :** ప్రకృతిలో జీవవైవిధ్యాన్ని కాపాడటంలో పక్షులు కీలక పాత్ర పోషిస్తాయని, వాటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని అటవీ డివిజనల్ అధికారి రామ్మోహన్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర పక్షిగా ప్రత్యేక గుర్తింపు పొందిన పాలపిట్ట పంటలకు హాని కలిగించే పురుగులను తింటూ రైతులకు ఎంతో మేలు చేస్తుందని పేర్కొన్నారు. చెట్ల నరికివేత, సహజ ఆవాసాల ధ్వంసం, మితిమీరిన పురుగుమందుల వినియోగం వల్ల పక్షుల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. పక్షుల ఆవాసాల పరిరక్షణకు విరివిగా మొక్కలు నాటి పచ్చదనాన్ని కాపాడాలని సూచించారు. వన్యప్రాణి సంరక్షణ చట్టం1972 ప్రకారం పక్షులను వేటాడటం, గూళ్లను ధ్వంసం చేయడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. పక్షుల రక్షణపై ప్రజల్లో చైతన్యం పెరిగినప్పుడే జీవావరణ సమతుల్యత సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎయిడ్స్ నివారణలో భాగస్వాములు కావాలి

**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** జిల్లాలో ఎయిడ్స్ వ్యాధి వ్యాపించకుండా నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ కె. హరిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సముదాయం ఆవరణలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హెచ్ఐవి అవగాహన బైక్ ర్యాలీని అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్‌తో కలిసి ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హెచ్ఐవి బారిన పడకుండా విస్తృత నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలో నమోదైన 736 మంది బాధితులకు రిమ్స్ ఆసుపత్రి ద్వారా మెరుగైన చికిత్స అందిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం జిల్లా సురక్షిత స్థానంలో ఉందని, వ్యాధిపై ఎలాంటి అపోహలు, భయాలు వద్దని స్పష్టం చేశారు. లక్షణాలు ఉన్నవారు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా లేదా 1097 హెల్ప్‌లైన్ నంబర్‌ను సంప్రదించి పూర్తి సమాచారం పొందవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నాగేంద్ర, రాష్ట్ర నియంత్రణ సొసైటీ సభ్యులు, వైద్య సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీల సమగ్రాభివృద్ధే ధ్యేయం

**అదనపు కలెక్టర్ నగేష్**



**ప్రజాపక్షం / మెదక్ :** మెదక్ జిల్లాలో ఉన్న మున్సిపాలిటీల సమగ్ర అభివృద్ధి ధ్యేయంగా పారిశుద్ధ్యంపై పటిష్ట ప్రణాళిక ద్వారా ముందుకు పోతూ తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి ప్రజలు అందించే విధంగా అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ నగేష్ మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. కలెక్టరేట్ కార్యాలయంలో వీడియో సమావేశ మందిరంలో జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల కమిషనర్లు, సిబ్బందితో జిల్లాలోని మున్సిపాలిటీల సమగ్రాభివృద్ధిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలు ప్రగతి పథంలో నడవాలంటే కమిషనర్లు ప్రణాళికబద్ధంగా ముందుకు సాగుతూ, పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారిస్తూ మన మన పట్టణం, మన ఇల్లు మన పరిసరాలు పరిశుభ్రతకు నిలయాలుగా మారే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాపర్టీ టాక్స్ వసూలు చేసే విషయంలో లక్ష్యాలకు అనుగుణంగా ముందుకు పోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ కమిషనర్ నవీన్, రామాయంపేట తూప్రాన్ నర్సాపూర్ మున్సిపల్ కమిషనర్ మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## కల్యాణ లక్ష్మీ, షాదీముబారక్ పథకాలు పేదలకు వరం

**ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్**



**ప్రజాపక్షం/భైంసా :** కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకాలు పేదలకు వరమని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ అన్నారు. గురువారం బైంసా పట్టణంలోని బృందావన్ గార్డెన్స్‌లో భైంసా పట్టణం, మండలంలోని ఆయా గ్రామాల వారికి కల్యాణ లక్ష్మి , షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. 69 మందికి కల్యాణ లక్ష్మి , 52 మందికి షాదీ ముబారక్ చెక్కులను అందించారు. దసరా పండుగ నేపథ్యంలో పండుగ కంటే ముందే ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ ద్వారా లక్ష రూపాయలు అందిస్తున్నందుకు కృతజ్ఞతలు చెబుతూనే, ఎన్నికల్లో తులం బంగారం హామీ ఇచ్చారని, బంగారం ఇవ్వకున్నా ఈ పథకానికి లక్ష యాభై వేల రూపాయలకు పెంచాల్సిందిగా కోరారు. తనకు ప్రజలే ముఖ్యమని,ప్రజా శ్రేయస్సును కోరే వారిని స్వాగతిస్తామన్నారు. మహాలక్ష్మి పథకం కింద నెలకు రెండున్నర వేలు ఇస్తానని కాంగ్రెస్ ప్రభుత్వం వాగ్దానం చేసిందని, ఆ మాటను నెరవేర్చుకొని ఆడపడుచులకు డబ్బులను పంపిణీ చేయాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుమ్మోల్ల దత్తాత్రి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావు పటేల్,భైంసా పట్టణ నాయకులు,సర్పంచ్ లు, కౌన్సిలర్లు, మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

### రబీలో 'ఆరుతడి' పంటలు వేయాలి

ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో వర్షాభావ పరిస్థితులు తలెత్తడంతో ప్రస్తుతం రబీలో రైతులు ఆరుతడి పంటలను మాత్రమే వేయాలని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ సూచించారు. గురువారం బైంసాలోని ఎస్ ఎస్ జిన్నింగ్ ఇండస్ట్రీలో మిషన్ ఫర్ ఆత్మనిర్భరత ఇన్ పల్సేస్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం 50శాతం సబ్సిడీపై శనగ విత్తనాలు పంపిణీ చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ముందుగా చిన్న కారు రైతులకు సబ్సిడీపై విత్తనాలు అందజేయాల్సిందిగా సూచించారు. నియోజకవర్గంలో అన్ని మండలాలకు కలిపి ప్రస్తుతం సబ్సిడీపై 9వేల బస్తాలు అందుబాటులో ఉన్నాయన్నారు.ఈ సంవత్సరం లోటు వర్షపాతం, ఉష్ణోగ్రతలు పెరగడం, ప్రాజెక్టుల్లో నీరు లేకపోవడంతో విద్యుత్ సరఫరాను ప్రభుత్వం తగ్గిస్తుందని, నష్టపోకుండా ఉండాలంటే రైతులు ఆరుతడి పంటలను వేసుకొవాలన్నారు.ఈపాటికే భూగర్భ జలాలు తగ్గుముఖం పట్టాయని, ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వాడాల్సిన అవసరమందన్నారు. ఈ కార్యక్రమంలో బైంసా వ్యవసాయ శాఖ ఎడిఎతో పాటు, వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు, సర్పంచ్ లు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ ప్రమాణాలతో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్: కలెక్టర్

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన నాణ్యమైన విద్యనందించాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలను వెచ్చిస్తూ తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌ను ఏర్పాటు చేస్తోందని కలెక్టర్ ఇలా త్రిపాఠి వెల్లడించారు. అర్బన్ నియోజకవర్గానికి సంబంధించి జిల్లా కేంద్రంలోని కోటగల్లి బాలికల పాఠశాల ప్రాంగణంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు కోసం అనువైన పరిస్థితులను అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, మేయర్ ఉమారాణిలతో కలిసి కలెక్టర్ ఇలా త్రిపాఠితో గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పబ్లిక్ స్కూల్ కోసం అందుబాటులోని స్థలం, ఇతర వసతులను పరిశీలించి సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఒకేచోట కొనసాగుతున్న పాఠశాలలు, కళాశాలలను కలుపుకుని తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం రూ.6 కోట్ల నిధులు సైతం మంజూరు చేసిందన్నారు. ఆధునాతన వసతులతో ప్రభుత్వం నిర్మించదల్చిన తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణానికి సమగ్ర చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ భుజంగరావు, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్, ఇన్‌చార్జి జిల్లా విద్యాధికారి సాయగౌడ్, ఆర్‌డిఒ రాజేంద్రకుమార్, కార్పొరేటర్ ప్రసన్న తదితరులున్నారు.

## సిపిఐ ఆదిలాబాద్ జిల్లా కమిటీ రద్దు

**పార్టీ జిల్లా ఇన్‌చార్జిగా విలాస్ నియామకం**

**ప్రజాపక్షం/బోథ్ :** ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గ కేంద్రంలోని శంకర్‌రావు భవన్‌లో ఉన్న సిపిఐ కార్యాలయంలో పార్టీ జిల్లా నాయకులు కామ్రేడ్ భారతల గోవర్ధన్ అధ్యక్షతన బోథ్ నియోజకవర్గం, మండలాల నాయకులతో సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి సిపిఐ జిల్లా కన్వీనర్ కామ్రేడ్ ఎస్. విలాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా కామ్రేడ్ విలాస్ మాట్లాడుతూ, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కామ్రేడ్ తక్కళ్లపల్లి శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, జిల్లా ఇన్‌చార్జి కామ్రేడ్ కలవేణ శంకర్ ముఖ్య అతిథులుగా హాజరైన జిల్లా కౌన్సిల్ సమావేశంలో పార్టీ నిర్మాణ పరిస్థితులపై విస్తృతంగా చర్చించినట్లు తెలిపారు. రాష్ట్ర పార్టీ నాయకత్వం ఆదేశాల మేరకు సిపిఐ ఆదిలాబాద్ జిల్లా కమిటీని రద్దు చేయడంతో పాటు, ముదుపు ప్రభాకర్‌రెడ్డిని జిల్లా కార్యదర్శి బాధ్యతల నుంచి తప్పించి, కామ్రేడ్ విలాస్‌ను సిపిఐ జిల్లా కన్వీనర్‌గా నియమించినట్లు వెల్లడించారు. 25, 26, 27 తేదీల్లో జరిగే రాష్ట్ర సమితి సమావేశాల అనంతరం నూతన జిల్లా కమిటీని, జిల్లా కార్యదర్శిని ఎన్నుకోనున్నట్లు తెలిపారు.రైతులకు ఎకరాకు రూ.50 వేల పరిహారం చెల్లించాలని, ఎల్‌నినో ప్రభావం, ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని కామ్రేడ్ విలాస్ ఆవేదన వ్యక్తం చేశారు. పంటలు చేతికందే సమయంలో ప్రకృతి వైపరీత్యాలు రైతులను అప్పుల ఊబిలోకి నెడుతున్నాయని అన్నారు. వేసవిలో ప్రజలు తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధమైన చర్యలు చేపట్టాలని విలాస్ కోరారు. ఈ సమావేశంలో సిపిఐ బోథ్ మండల కార్యదర్శి కామ్రేడ్ నరేష్, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మున్సిఫ్, సిపిఐ కుచలాపూర్ శాఖ కార్యదర్శి ఎస్. దాస్, భోజన్న తదితరులు పాల్గొన్నారు.

## పక్కాగా రికార్డుల నిర్వహణ

**కాళేశ్వరం మల్టీజోన్ డిఐజి అంబర్ కిషోర్ ఝా**

**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** పోలీస్ శాఖ సమర్థవంతమైన పనితీరుకు ఖచ్చితమైన రికార్డుల నిర్వహణ ఎంతో కీలకమని కాళేశ్వరం మల్టీజోన్1 డిఐజి అంబర్ కిషోర్ ఝా అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం ఆయన కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయాన్ని సందర్శించారు. కార్యాలయానికి చేరుకున్న డిఐజికి జిల్లా ఎస్‌పి నితికా పంత్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన డిఐజి, కార్యాలయ పరిసరాలను పరిశీలించి పరిశుభ్రత, ఆహ్లాదకర వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా డిస్ట్రిక్ట్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (డిసిఆర్‌బి) విభాగాన్ని తనిఖీ చేసి నేరాల రికార్డులు, కేసుల వివరాలు, నేరస్థుల డేటా, పెండింగ్ కేసుల రిజిస్టర్ల నిర్వహణను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం జిల్లా పోలీస్ కార్యాలయంలోని ఎ,బి సెక్షన్లు, ఫింగర్‌ప్రింట్, డి ఫోర్ సి, కమాండ్ కంట్రోల్ విభాగాలను పరిశీలించి సిబ్బంది పనితీరును సమీక్షించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ డేటా నిర్వహణ, రికార్డుల నవీకరణలో నాణ్యత పాటించాలని ఆదేశించారు. ఉచిత పోలీస్ నియామక శిక్షణ పొందుతున్న 160 మంది అభ్యర్థులతో మాట్లాడి, శిక్షణను సద్వినియోగం చేసుకుని పోటీ పరీక్షల్లో ప్రతిభ చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్‌పి చిత్తరంజన్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్, డిపిఒ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థుల ఉన్నతికి ఉపాధ్యాయులు పనిచేయాలి

**కలెక్టర్ భవేశ్ మిశ్రా**

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థి విద్యాపరంగా ఉన్నత స్థాయికి చేరుకునేలా ఉపాధ్యాయులు బాధ్యతగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు.గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో విద్యాశాఖపై నిర్వహించిన సుదీర్ఘ సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఉపాధ్యాయులు, విద్యార్థుల క్రమం తప్పని హాజరుతోనే ప్రభుత్వ విద్యావ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని అన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించే ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థుల్లో నైపుణ్యాలు, విషయ పరిజ్ఞానం, అవగాహన సామర్థ్యాలను పెంపొందించేలా బోధన కొనసాగించాలని సూచించారు. తరచూ పాఠశాలకు గైర్హాజరవుతున్న విద్యార్థులను గుర్తించి, వారి తల్లిదండ్రులతో మాట్లాడి గైర్హాజరుకు గల కారణాలను తెలుసుకోవాలని, వారు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు విద్యార్థుల సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తూ, పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం 'అభ్యాస దీపిక' వెబ్‌సైట్‌ను రూపొందించిన ప్రధానోపాధ్యాయుడు మునిందర్ రాజును కలెక్టర్ అభినందించారు.గణితం తదితర సబ్జెక్టులను విద్యార్థులు సులభంగా అర్థం చేసుకునేలా పాఠాలు, మెళకువలు, అభ్యాస విధానాలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రత్యేక చొరవతో వెబ్‌సైట్‌ను రూపొందించడం అభినందనీయమన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి దోహదపడే ఇలాంటి వినూత్న ఆలోచనలు, సాంకేతిక పరిజ్ఞాన ఆధారిత కార్యక్రమాలను మరింత మంది ఉపాధ్యాయులు చేపట్టాలని ఆయన సూచించారు.ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న,ఎంఈఓలు, విద్యాశాఖ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## నిర్మల్‌లో మార్కెట్ కమిటీ 'నామినేటెడ్' రాజకీయం



**ప్రజాపక్షం/నిర్మల్ :** నిర్మల్ జిల్లాలో నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియ అధికార కాంగ్రెస్ పార్టీలో తీవ్ర రాజకీయ కలకలానికి దారి తీస్తోంది. ముఖ్యంగా వ్యవసాయ మార్కెట్ కమిటీల పదవులను దక్కించుకోవాలని లెక్కింపులు వేసుకున్న ఆశావహులకు, అకస్మాత్తుగా మారిన రిజర్వేషన్లు పెద్ద షాక్ ఇచ్చాయి. రిజర్వేషన్ సమీకరణాలు తారుమారు కావడంతో నాయకుల రాజకీయ రాతలు తలకిందులయ్యాయి. దీంతో నిర్మల్ జిల్లావ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీలో అంతర్గత పంచాయతీలు తీవ్రరూపం దాల్చాయి.వ్యవసాయ మార్కెట్ కమిటీల పాలకవర్గాల ఎంపికకు ప్రభుత్వం సిద్ధమవుతున్న తరుణంలో, నిర్మల్, సారంగాపూర్, భైంసా మార్కెట్ కమిటీల్లో రిజర్వేషన్లు మారిపోయాయి. ఇప్పటివరకు పదవిపై ధీమాతో ఉన్న సీనియర్ నాయకులు చివరి నిమిషంలో రిజర్వేషన్ల మార్పు వల్ల పోటీకి దూరమయ్యే పరిస్థితి ఏర్పడింది. దీనికితోడు కొత్తగా ఖరారైన రిజర్వేషన్ల ఆధారంగా తమ వర్గం నేతలకే పీఠం దక్కాలని స్థానిక నాయకులు పట్టుబడుతుండటంతో ఏకాభిప్రాయం కుదరడం లేదు. జిల్లాలో నామినేటెడ్ పదవుల కోసం వర్గపోరు తీవ్రస్థాయికి చేరింది. భైంసా నియోజకవర్గంలో నారాయణ రావు పటేల్, విట్టల్ రెడ్డి వర్గాల మధ్య నామినేటెడ్ పదవుల కోసం తీవ్ర పోటీ నెలకొంది. మరోవైపు నిర్మల్ నియోజకవర్గంలో శ్రీహరి రావు, ఇంద్రకరణ్ రెడ్డి, వేణుగోపాల చారి వర్గాల మధ్య గ్రూపు రాజకీయం నడుస్తోంది. నిర్మల్, సారంగాపూర్ మార్కెట్ కమిటీ పీఠాలను దక్కించుకునేందుకు ఈ మూడు గ్రూపులు స్వతంత్రంగా ప్రయత్నాలు సాగిస్తూ అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తున్నాయి.జిల్లా కేంద్రంలో పార్టీ పరంగా ధర్నాలు, నిరసన కార్యక్రమాలు జరుగుతున్నప్పటికీ, నాయకులు మాత్రం క్షేత్రస్థాయిలో ఎవరికి వారే ప్రచారంలో మునిగి తేలుతున్నారు. చైర్మన్ పదవి తమకే వచ్చిందంటూ జోరుగా ప్రచారం చేసుకుంటున్నారు. ఎవరి గ్రూపు బలం ఎంత ఉందో చూపించుకోవడంలోనే నేతలు నిమగ్నమవ్వడంతో, మార్కెట్ యార్డుల్లో కనీస వసతులు, మౌలిక సదుపాయాల కల్పన పడకేసిందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.నాయకుల మధ్య సమన్వయం లేకపోవడం, ఎవరికి వారే యమునా తీరం అన్నట్లుగా వ్యవహరించడంతో నియోజకవర్గాల్లో పనులు కావడం లేదని కాంగ్రెస్ శ్రేణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. పార్టీని నమ్ముకున్న కార్యకర్తలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, నాయకుల మధ్య అంతర్గత కుమ్ములాటలు ఇలాగే కొనసాగితే రాబోయే ఎన్నికల్లో పార్టీ పరిస్థితి ఏమవుతుందోనని కార్యకర్తలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

## కల్యాణ

# గోదావరి పుష్కరాల పనులు వేగవంతం

గోదావరి మహా పుష్కరాలు- 2027 ఏర్పాట్లపై అధికారులతో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సమీక్ష

**ప్రజాపక్షం/జగిత్యాల:** గోదావరి మహా పుష్కరాలకు సంబంధించి చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి,నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం జగిత్యాల జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం మినీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎన్.ప్రసూనాంబలతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో గోదావరి పుష్కరాల ఏర్పాట్లు,అభివృద్ధి పనుల పురోగతిపై మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ పుష్కరాల పనులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన ప్పటికీ, పనులను సకాలంలో పూర్తి చేయకపోతే జిల్లాకు చెడ్డపేరు వస్తుందని అన్నారు. ప్రతి పనికి స్పష్టమైన షెడ్యూల్ రూపొందించుకొని, నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని ఆదేశించారు. పనులు చేపట్టే ఏజెన్సీలతో సమన్వయం చేసుకుంటూ,అవసరమైన చోట జనరేటర్లు ఏర్పాటు చేసి రాత్రింబవళ్లు పనులు చేపట్టాలని సూచించారు. నవంబర్ 1వ తేదీ నుంచి వచ్చే ఏడాది మే 30వ తేదీ వరకు అన్ని శాఖలు తమ పరిధిలోని పనులను పూర్తి చేసేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని తెలిపారు. పెండింగ్ బిల్లుల చెల్లింపులు త్వరగా జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. భూసేకరణకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న నోటిఫికేషన్లను సోమవారం నుంచి జారీ చేయాలని మంత్రి ఆదేశించారు. ఆర్ అండ్ బి రోడ్లకు సంబంధించి 10ఏ మినహాయింపు ప్రతిపాదనలు పంపించామని, అనుమతులు మూడు రోజుల్లో అందితే వెంటనే భూసేకరణ నోటిఫికేషన్లు జారీ చేయాలని సూచించారు. భూసేకరణకు సంబంధించిన పరిహారం చెల్లింపులను మూడు నెలల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ధర్మపురి ఘాట్‌ను 270 మీటర్ల పొడవుతో అభివృద్ధి చేయాలని స్పష్టం చేశారు. ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ పునరుద్ధరణకు సంబంధించిన కూల్చివేత పనులను రెండు రోజుల్లో పూర్తి చేయాలని, కోటిలింగాల ఆలయ కూల్చివేత పూర్తయినందున అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్,ఎస్పీ అశోక్ కుమార్, తదితరులు ఉన్నారు.

## పేదలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం

**ధర్మపురి :** పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు,స్వచ్ఛమైన తాగునీరు, మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు.గురువారం ధర్మపురిలో జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్‌తో కలిసి నూతన ఆరోగ్య ఉప కేంద్రం, చిల్డ్రన్ పార్క్, ఓపెన్ జిమ్, తాగునీటి పైపులైన్లను మంత్రి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేద,మధ్యతరగతి ప్రజలకు వైద్య సేవలను చేరువ చేసేందుకు ప్రభుత్వం ఆరోగ్య రంగంలో మౌలిక సదుపాయాలను బలోపేతం చేస్తోందన్నారు. మహిళలు, గర్భిణులు, చిన్నారులు, వృద్ధులకు సకాలంలో వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్, డీఎంహెచ్ఓ సుజాత, దినేష్, లక్ష్మి , నీలారపు శ్రీనివాస్, శ్రీనివాస్ రావు, శ్రీనివాస్, విజయ్ బాబు, రాజేష్, జక్కు రవీందర్, కుంట సుధాకర్, అధికారులు, వైద్య సిబ్బంది, ప్రజాప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

## రైతులను రాజులుగా చేయడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం

**ప్రజాపక్షం/ చందుర్తి:** రాష్ట్ర రైతుల ను రాజుగా చూడటమే కాకుండా, రారాజులు గా నిలబెట్టాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం చందుర్తి, సనుగుల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు గసికంటి ప్రభాకర్, ఎగలం శ్రీనివాస్, కార్యవర్గ సభ్యుల అభినందన సభకు ముఖ్య అతిథిగా హాజరై నూతన కార్యవర్గాలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు సాగునీరు, నాణ్యమైన విద్యుత్, పంటలకు గిట్టుబాటు ధర, కొనుగోలు కేంద్రాల ఏర్పాటు వంటి అంశాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు.గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి రైతుల సంక్షేమానికి పెద్దపీట వేశారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని ఆది శ్రీనివాస్ తెలిపారు. వరంగల్ రైతు డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ మేరకు రూ.2 లక్షలలోపు పంట రుణాలను మాఫీ చేశామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.20,650 కోట్లతో సుమారు 25.28 లక్షల రైతు కుటుంబాలకు రుణమాఫీ ప్రయోజనం కల్పించినట్లు వివరించారు. సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ప్రకటించడం, కనీస మద్దతు ధరతో పంటలను కొనుగోలు చేయడం ద్వారా రైతుల్లో నమ్మకం పెరిగిందన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించేలా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, దళారుల సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

## ఆర్థిక సమ్మిళిత పథకాల అమలుపై ప్రచార కార్యక్రమాల పోస్టర్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/ సిద్దిపేట :** కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఆర్థిక సమ్మిళిత పథకాల సంపూర్ణ అమలు ప్రచార కార్యక్రమం పోస్టర్‌ను సిద్ధిపేట జిల్లా కలెక్టర్ హైమావతి గారు ఆవిష్కరించారు.ఈ ప్రచార కార్యక్రమం 2026 అక్టోబర్ 21 నుండి డిసెంబర్ 31 వరకు జిల్లావ్యాప్తంగా నిర్వహించబడుతుందన్నారు . ఈ కార్యక్రమం ద్వారా అర్హులైన ప్రజలకు వివిధ కేంద్ర ప్రభుత్వ ఆర్థిక పథకాల ప్రయోజనాలను అందించడంతో పాటు,బ్యాంకింగ్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడం ప్రధాన లక్ష్యంగా నిర్దేశించబడిందన్నారు. ఈ ప్రచారంలో భాగంగా జిల్లాలోని అన్ని గ్రామ , పట్టణ స్థానిక సంస్థల పరిధిలో బ్యాంకుల ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన సేవా శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ శిబిరాల ద్వారా ప్రధానమంత్రి జన్ ధన్ యోజన, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన వంటి పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, అర్హులైన లబ్ధిదారులకు పథకాలలో నమోదు చేసుకునే అవకాశం కల్పిస్తారన్నారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా బ్యాంకులు, సంబంధిత ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని లీడ్ బ్యాంక్ కార్యాలయం విజ్ఞప్తి చేసిందన్నారు.

## కల్యాణలక్ష్మి చెక్కులతో పేద కుటుంబాలకు ఊరట

**ప్రజాపక్షం/సుల్తానాబాద్:** సుల్తానాబాద్ మండల కేంద్రంలోని ఎస్.వి.ఆర్ ఫంక్షన్ హాల్‌లో గురువారం రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు సుల్తానాబాద్ పట్టణం, మండలం మరియు ఎలిగేడు మండలాలకు చెందిన 140 మంది కళ్యాణ లక్ష్మి , షాదీ ముబారక్ లబ్ధిదారులకు రూ.1,40,16,240 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. అలాగే సుల్తానాబాద్ మున్సిపల్ కార్మికులకు దుస్తులు, పాదరక్షలను స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి అందజేశారు.అనంతరం సుల్తానాబాద్ మండలం భూపతిపూర్ గ్రామ ఉప సర్పంచ్ కవ్వంపల్లి కార్తీక్ బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరగా, ప్రభుత్వ విప్ విజయరమణరావు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి ఆయనను పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణరావు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజల సంక్షేమమే లక్ష్యంగా అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం సన్న వడ్ల కొనుగోలు చేపట్టి బోనస్ అందిస్తోందన్నారు. రానున్న వేసవి కాలంలో ఎల్‌నినో ప్రభావం కారణంగా తీవ్ర ఎండలు ఉండే అవకాశం ఉన్నందున రైతులు వరి సాగుకు బదులుగా ఆరుతడి పంటలు సాగు చేయాలని సూచించారు. భూగర్భ జలాలు తగ్గే పరిస్థితులు ఉన్నందున పంటల ఎంపికలో అప్రమత్తంగా ఉండాలని కోరారు. రైతులు ఏ ప్రత్యామ్నాయ పంట సాగు చేసినా ప్రభుత్వం ద్వారా కొనుగోలు జరిగేలా తాను కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాధాకృష్ణ, ప్రకాశ్‌రావు,పుష్పలత, బషీరుద్దీన్, రమేష్, సుల్తానాబాద్, ఎలిగేడు మండలాల సింగిల్ విండో చైర్మన్లు, కౌన్సిలర్లు, సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, పట్టణ, మండల అధ్యక్షులు, లబ్ధిదారులు,తదితరులు పాల్గొన్నారు.

## కొత్తగట్టులో టోల్ ప్లాజా ప్రారంభం

**ప్రజాపక్షం/శంకరపట్నం:** శంకరపట్నం మండలం కరీంనగర్‌వరంగల్ జాతీయ రహదారి ఎన్ హెచ్ 563 పై కొత్తగట్టు వద్ద ఏర్పాటు చేసిన టోల్ ప్లాజాను ప్రారంభించారు.భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ ఎన్ హెచ్ ఏ ఐ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయగా గురువారం ఉదయం 8 గంటల నుండి టోల్ వసూళ్లు ప్రారంభమయ్యాయి.ఈ రహదారిపై రాకపోకలు సాగించే వాహనాల నుండి నిబంధనల మేరకు టోల్ ట్యాక్సి వసూలు చేస్తున్నట్లు నిర్వహకులు తెలిపారు.కరీంనగర్‌వరంగల్ మధ్య ప్రయాణించే వాహనదారులు టోల్ చేల్లించి సహకరించాలని వారు కోరారు.

## పల్లగుట్ట మైనింగ్ తవ్వకాలను వెంటనే నిలిపివేసేందుకు చర్యలు

కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామికి చాడ వెంకట్‌రెడ్డి వినతి



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల:** రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలోని నామాపూర్ గూడూరు మధ్యలో గల పల్లగుట్ట మైనింగ్ తవ్వకాలను వెంటనే నిలిపివేసేందుకు చర్యలు చేపట్టాలని కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామికి సిపిఐ జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి గురువారం హైదరాబాద్‌లో కలిసి వినతి పత్రం అందజేశారు. గతంలో 60 ఎకరాలలో రంగురాళ్ల తవ్వకానికి ప్రభుత్వం ఉత్తర్వులు ఉన్నప్పటికీ గ్రామ ప్రజల ఒత్తిడి మేరకు పర్యావరణ పరిరక్షణలో భాగంగా అప్పటి కాంట్రాక్ట్ రద్దు చేయబడిందని పేర్కొన్నారు. తిరిగి అదే కాంట్రాక్టర్ ప్రస్తుతం దాదాపు 12 ఎకరాలలో రంగురాళ్ల కోసం తవ్వకాలు మొదలు పెట్టారని ఈ తవ్వకాలతో పల్లగుట్ట కనుమరుగయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. ఈ గుట్ట గూడూరు గ్రామానికి సహజ రక్షణగా ఉంటుందని ఈ గుట్టను తొలగించడం చేత భూగర్భ జలాలు అడుగింటే ప్రమాదం ఉందని దీంతో సాగు, తాగునీటికి ఇబ్బందులు ఏర్పడుతాయని ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నారు. గ్రానైట్ క్వారీ పేరుతో విధ్వంసం కాకుండా తవ్వకాలను వెంటనే నిలిపివేసే విధంగా చర్యలు చేపట్టాలని ఆయనను ఈ సందర్భంగా కోరారు.

## ప్రజల సహకారంతోనే నియోజకవర్గ అభివృద్ధి సాధ్యం

**ప్రజాపక్షం/జగిత్యాల :** ప్రజల సహకారం, భగవంతుని కృపతో నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమవుతుందనిజగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పేర్కొన్నారు. జగిత్యాల పట్టణంలో శ్రీ దుర్గా శరన్నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా శ్రీ దుర్గా గాయత్రి సేవా సమితి ఆధ్వర్యంలో గాయత్రి మాత ఆలయంలో, మహా దుర్గా సేవా సమితి ఆధ్వర్యంలో, జయ దుర్గా సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గా శరన్నవరాత్రి ఉత్సవాలకు ఎమ్మెల్యే హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం ఉన్నప్పటికీ సమృద్ధిగా వర్షాలు కురవడంతో ప్రస్తుతం పంటలు చేతికి వచ్చే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాజంగి నందయ్య, గిరి నాగభూషణం, ఎఎంసి చైర్మెన్ గడ్డం నారాయణ రెడ్డి, తదితరులు ఉన్నారు.

## ఓటర్ నమోదు నిరంతర ప్రక్రియ

అర్హులైనవారు బిఎల్ఒలకు దరఖాస్తు చేసుకోవాలి

కలెక్టర్ గరిమ అగ్రవాల్

**ప్రజాపక్షం/రాజన్నసిరిసిల్ల:** ఓటర్ నమోదు నిరంతర ప్రక్రియ అని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ఆదేశాలమేరకు జిల్లాలోని ప్రతి పోలింగ్ కేంద్రంలో ఈనెల 15 గురువారం, 16 శుక్రవారం రోజుల్లో ప్రత్యేక శిబిరాలు కొనసాగుతుండగా తంగెళ్లపల్లి మండలం బద్దెనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాల నంబర్ 278, 279లో ప్రత్యేక ఓటర్ నమోదు శిబిరాన్ని కలెక్టర్ గురువారం పరిశీలించారు. ఫారం6 ద్వారా ఎన్ని ధరఖాస్తులు వచ్చాయో ఆరా తీయగా మొత్తం 12 ధరఖాస్తులు వచ్చినట్లు బూత్ లెవల్ అధికారి కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా నూతన ఓటర్ నమోదు కోసం వచ్చిన ధరఖాస్తులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా శుక్రవారం కూడా శిబిరాలు కొనసాగుతాయని తెలిపారు. మొదటిసారి ఓటర్లుగా నమోదు చేసుకోవాలనుకునే యువత తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటరర్ల జాబితాలో తమ పేర్లను నమోదు చేసుకోవడానికి ఫారం6 ద్వారా ధరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పైన పేర్కొన్న రోజుల్లో సంబంధిత బిఎల్‌వోలు, బిఎల్‌ఓలు ఆయా నిర్దేశిత కేంద్రాలలో అందుబాటులో ఉంటారని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో కీలకమని పేర్కొన్నారు. మెరుగైన సమాజ నిర్మాణం కోసం ఓటు హక్కు పునాది వంటిదన్నారు. 18 ఏళ్ల వయసు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందుకోసం ఫారం6 ద్వారా ధరఖాస్తు చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కలెక్టర్ వెంట సిరిసిల్ల ఆర్డీవో శ్రీధర్ బాబు, ఇంఛార్జీ తహసీల్దార్ మురళి, సర్పంచ్ చిలువేరి లావణ్య తదితరులు ఉన్నారు.

## ఎల్ నినోతో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ చిత్రా మిశ్రా

**ప్రజాపక్షం/కరీంనగర్:** ఎల్‌నినో నేపథ్యంలో తలెత్తే పరిస్థితులను ఎదుర్కొనేందుకు అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశించారు. తాగునీటి సరఫరాకు ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక దృష్టి సారించాలని విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమస్యలు తలెత్తిన తర్వాత స్పందించడం కాకుండా సమస్యలు ఏర్పడే అవకాశమున్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి పరిష్కార మార్గాలను సిద్ధం చేసుకోవాలని స్పష్టం చేశారు. గురువారం ఐడీఓసీ లోని కలెక్టర్ ఛాంబర్‌లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డి.శ్రీనివాస్ రెడ్డితో కలిసి జిల్లా స్థాయి అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎల్‌నినో నేపథ్యంలో జిల్లాలో చేపట్టాల్సిన ముందస్తు చర్యలు, వివిధ శాఖల సన్నద్ధతపై చర్చించారు. ఇరిగేషన్, విద్యుత్, వ్యవసాయ, భూగర్భ జల శాఖలతో పాటు ఇతర శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు.

**రిజర్వాయర్ల నీటిమట్టాలపై నిరంతర పర్యవేక్షణ**

రిజర్వాయర్లలో నీటి మట్టాలను ఇరిగేషన్ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. తాగునీటి అవసరాలకు సరిపడా నీరు అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని నీటి సరఫరాకు ఏలాంటి ఇబ్బందులు తలెత్కుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదేశించారు. నీటి నిల్వలు, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని స్పష్టం చేశారు. నీటి లభ్యతపై నిరంతరం సమీక్షిస్తూ సమస్యలు తలెత్తే అవకాశమున్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి పరిష్కార చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

**తాగనీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు**

రానున్న రోజుల్లో తాగునీటి అవసరాలు, నీటి లభ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. నీటి ఎద్దడి ఏర్పడే అవకాశమున్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి అక్కడి పరిస్థితులకు అనుగుణంగా కార్యచరణ ప్రణాళిక రూపొందించాలని చెప్పారు. ప్రజలకు తాగునీటి సరఫరాలో ఇబ్బందులు కలుగుకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

**విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండొద్దు**

విద్యుత్ సరఫరాకు ఆటంకాలు ఏర్పడకుండా సంబంధిత అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. వ్యవసాయ అవసరాలు, నీటి సరఫరా వంటి కీలక అంశాలను దృష్టిలో ఉంచుకొని శాఖలవారిగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు.

## యాసంగిలో వరి సాగుకు దూరంగా ఉండాలి

కలెక్టర్ కోయ శ్రీహర్ష

**ప్రజాపక్షం/పెద్దపల్లి:** యాసంగి సీజన్‌లో వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు వరి సాగు చేయకుండా ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులను ఆదేశించారు. తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలను సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యాసంగి సీజన్‌లో వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకొని రైతులు వరి సాగుకు దూరంగా ఉండాలని సూచించారు. నీటి లభ్యతను పరిగణనలోకి తీసుకొని సాగు నిర్ణయాలు తీసుకోవాలని, అవసరమైతే పొలాలను బీడుగా ఉంచుకోవాలని తెలిపారు.వరి సాగుకు బదులుగా మొక్కజొన్న, పప్పుధాన్యాలు, కూరగాయలు వంటి తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలను సాగు చేసేలా రైతులకు సూచించాలని అధికారులను ఆదేశించారు. తక్కువ కాలంలో దిగుబడి వచ్చే ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. వర్షాభావ పరిస్థితుల్లో పంట నష్టాలను నివారించేందుకు, నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకునేందుకు రైతులకు అవసరమైన సూచనలు అందించాలని తెలిపారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అందుబాటులో ఉంటూ ప్రత్యామ్నాయ పంటల సాగుపై మార్గదర్శనం చేయాలని ఆదేశించారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు (పీపీసీ) ఎంత పరిమాణంలో ధాన్యం వచ్చే అవకాశం ఉంది, ప్రైవేటు మార్కెట్‌కు ఎంత పరిమాణంలో వెళ్లే అవకాశం ఉందనే అంశాలపై స్పష్టమైన అంచనాలు రూపొందించాలని ఆదేశించారు. ఈ వివరాల ఆధారంగా ధాన్యం సేకరణకు అవసరమైన ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా సహకార అధికారి శ్రీమాల, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రసాద్,సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

## గంటల వ్యవధిలోనే హత్య కేసు ఛేదించిన పోలీసులు

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** మండల కేంద్రంలోని గొల్లపల్లి గ్రామంలో సంచలనం సృష్టించిన టైల్స్ వర్క్ కాంట్రక్టర్ పవన్ సింగ్(28) హత్య కేసును పోలీసులు కేవలం 14 గంటల్లోనే ఛేదించారు. డబ్బుల కోసమే ఈ దారుణానికి ఒడిగట్టినట్లు పోలీసులు నిర్ధారించారు. పోలీసులు తెలపిన వివరాల ప్రకారం ఉత్తరప్రదేశ్‌కు చెందిన కాంట్రక్టర్ పవన్ సింగ్‌ను, అతని వద్ద కూలీలుగా పనిచేస్తున్న జోగిందర్, శివమ్ ఈ నెల 14వ తేది మధ్యాహ్నం గొంతుకోసి చాతిపై పొడిచి కిరాతకంగా హత్య చేశారని, అనంతరం నిందితులు మృతుడి ద్విచక్ర వాహనంపై పారిపోయారని తెలిపారు. ఎల్లారెడ్డిపేట సీఐ వెంకటేష్, వీర్నపల్లి ఎస్ఐ లక్ష్మణ్ ఆధ్వర్యంలో రంగంలోని దిగిన ప్రత్యేక బృందాలు, సాంకేతిక ఇతర ఆధారాల సహాయంతో రైల్వే స్టేషన్‌లో నిందుతులను పట్టుకుని, రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. కేసును వేగంగా ఛేదించిన పోలీస్ సిబ్బందిని డీఎస్పీ నాగేంద్రచారి మీడియా సమావేశంలో అభినందిస్తూ, వారికి జిల్లా ఎస్పీ ద్వారా రివార్డులు అందజేస్తామని ప్రకటించారు.

## కలెక్టర్ కార్యాలయ ఆవరణలో 3 రోజుల నిరవధిక సమ్మె

ఉద్యోగ భద్రత, న్యాయమైన ప్రధాన డిమాండ్లను పరిష్కరించాలి: ఎన్‌హెచ్ఎం జెఎసి

**జాపక్షం/పెద్దపల్లి :** పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయ ఆవరణలో గురువారం రోజున ఎన్‌హెచ్ఎం జేఏసీ పెద్దపల్లి ఆధ్వర్యంలో మూడు రోజులపాటు ధర్నా నిర్వహిస్తున్నట్లు ఉద్యోగులు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్ హెచ్ ఎం) పరిధిలో పనిచేస్తున్న జిల్లా ఉద్యోగులను క్రమబదీకరణ చేయాలని, క్రమబద్ధీకరణ అయ్యే వరకు మా యొక్క న్యాయమైన సమస్యలు పరిష్కారం కోసం ఎన్ హెచ్ ఎం జేఏసీ పెద్దపల్లి ఆధ్వర్యంలో 3 రోజుల నిరవధిక సమ్మె ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతియుత నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఉద్యోగులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ హెచ్ ఎం ఉద్యోగులు మాట్లాడుతూ మా ప్రధాన డిమాండ్లు అయిన ఎన్ హెచ్ ఎం ఉద్యోగులందరినీ రెగ్యులరైజేషన్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం కల్పించాలనీ, మెటర్నిటీ లీవ్స్ 180 రోజులకు తప్పకుండా ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పిఆర్సి సర్వీసెస్ ప్రయోజనాలు ఇంక్రిమెంట్స్ లాయరిటీ బోనస్ ఇన్సూరెన్స్ ఇతర పెండింగ్ సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ బేసిక్, ఔట్సోర్సింగ్ డాక్టర్లు, ఏఎన్ఎం, జిఎన్ఎమ్, ఫార్మసిస్టులు పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా ఎన్ హెచ్ ఎం ఉద్యోగులందరూ పాల్గొన్నారు.

## చిగురుమామిడి పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ

**ప్రజాపక్షం/చిగురుమామిడి:** చిగురుమామిడి పోలీస్ స్టేషన్‌ను కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా పోలీస్ స్టేషన్‌లోని జనరల్ డైరీ, ఎఫ్ఐఆర్ కాపీలు, పెండింగ్ కేసులు, రౌడీ షీటర్ల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణ, రిసెప్షన్ కౌంటర్, లాకప్ రూమ్‌లను పరిశీలించి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీపీ గౌష్ ఆలం మాట్లాడుతూ

## ఇంటింటా సర్వేను తహసీల్దార్ పరిశీలన

**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** పువ్వాడ నగర్ గ్రామ పంచాయతీలో చేపట్టిన ఇంటింటా సర్వేను రఘునాథపాలెం తహసీల్దార్ శ్వేత పరిశీలించారు. గురువారం తహసీల్దార్ శ్వేత పువ్వాడ నగర్‌లో జరుగుతున్న సర్వేను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అధికారులు, గృహవాసులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్వే సిబ్బందికి గృహవాసులు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఎటువంటి అపోహలు, భయాందోళన చెందకుండా సర్వేకు వచ్చిన వారికి పూర్తి స్థాయిలో తమ వివరాలను వెల్లడించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు ప్రవీణ్, జగదీష్, సర్వే బృందం సభ్యులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పారదర్శకంగా కొనుగోళ్లు

జిసిసి డిఎం రామానందం

**ప్రజాపక్షం/భద్రాచలం :** ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లు పారదర్శకంగా సాగాలని జిసిసి డిఎం రామానందం అన్నారు. గురువారం ఐటిడిఎ కార్యాలయ సమావేశ మందిరంలో జిసిసి మేనేజర్లు, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జీలకు కార్యాచరణపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు జిసిసి కొనుగోలు కేంద్రాలుక రైతులు తీసుకొచ్చినప్పుడు ధాన్యాన్ని పూర్తి స్థాయిలో పరిశీలించాలని, తడిసిన ధాన్యాన్ని ఎట్టిపరిస్థితుల్లో కొనుగోలు చేయరాదన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని జాగ్రత్తగా భద్రపరుచుకోవాల్సిన బాధ్యత నిర్వాహకులదే అని తెలిపారు. అనంతరం టెక్నికల్ ఇన్‌చార్జ్ సతీష్ మాట్లాడుతూ రైతులు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకొచ్చినప్పుడు తేమ శాతాన్ని తక్షణమే పరిశీలించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిసిసి మేనేజర్లు సమ్మయ్య వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జీలు జిసిసి సిబ్బంది పాల్గొన్నారు.

## సన్న ధాన్యం రకాల గుర్తింపునకు ప్రత్యేక చర్యలు

**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** వానాకాలం ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రభుత్వం ఏడు గుర్తింపు పొందిన సన్న ధాన్యం రకాలను ప్రోత్సహిస్తూ ఆ రకాలను సాగు చేసిన రైతులకు క్వింటాకు రూ.500 బోనస్ అందించనున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు ప్రభుత్వం ప్రకటించిన బోనస్ సక్రమంగా అందేలా ధాన్యం కొనుగోళ్లు కేంద్రాల వద్ద గుర్తింపు పొందిన సన్న ధాన్యం రకాల గుర్తింపు, ధృవీకరణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. కొనుగోలు సమయంలో ధాన్యం రకాన్ని సక్రమంగా గుర్తించి అర్హులైన రైతులకు మాత్రమే బోనస్ ప్రయోజనాలు అందేలా చూస్తామన్నారు. జిల్లాలోని ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం రకాలను గుర్తించడంలో నైపుణ్యం కలిగిన ఒక సిబ్బందిని నియమించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ ప్రక్రియలో భాగంగా ఈ విధుల్లో పాల్గొనే అర్హత కలిగిన సిబ్బందికి ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం పారితోషికం అందిస్తామని తెలిపారు.వ్యవసాయంలో బియస్సి లేదా డిప్లోమా అర్హత కలిగిన వ్యక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని సంబంధిత మండల వ్యవసాయ అధికారి, విస్తరణ అధికారులను సంప్రదించాలన్నారు. నియమిత సిబ్బంది ధాన్యం కొనుగోలు సంస్థలకు సహకరిస్తూ సన్న ధాన్యం రకాల గుర్తింపు ధృవీకరణ ప్రక్రియలో భాగస్వాములు అవుతారని వ్యవసాయ అధికారి తెలిపారు.

## అధికారులు వార్డుల్లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకోవాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత

**ప్రజాపక్షం/మధిర :** అధికారులు కార్యాలయాలకే పరిమితమైతే ప్రజా సమస్యలు కాగితాలకే పరిమితమవుతాయి. క్షేత్రస్థాయిలో అడుగుపెట్టి మూలాలను గుర్తిస్తేనే ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని మధిర మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత స్పష్టం చేశారు. పట్టణ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా అధికార యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా వ్యవహరించాలని ఆమె హెచ్చరించారు. గురువారం మధిర మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డులో ఆమె పర్యటన చేపట్టారు. ఈ పర్యటనలో వైస్ చైర్మన్ కోన ధనికుమార్, ఆ వార్డు కౌన్సిలన్ యన్నం శెట్టి అప్పారావు, మున్సిపల్ కమీషనర్ శామ్యూల్‌పాల్‌తో పాటు వివిధ శాఖల అకీలక అధికారులను వెంటబెట్టుకొని ఆమె వార్డులోని ప్రతి సందు, ప్రతీ గల్లీని కాలినడకన కలియతిరుగుతూ స్థానిక పరిస్థితులను, ఇబ్బందికర అంశాలను స్వయంగా పరిశఖులించారు. ఎక్కడెక్కడ ఏ సమస్య పేరుకుపోయింది? ప్రజలు ఏయే ఇబ్బందులతో సతమతమవుతున్నారు? అనే వివరాలను కౌన్సిలర్‌ను, స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వార్డులో నెలకొన్న తాగునీరు, వీధిదీపాలు, పారిశుద్ధ్యం వంటి వివిధ సమస్యలపై ఆమె అధికారులతో మాట్లాడారు. ప్రజాక్షేత్రంలో పర్యటించి ఈ సమస్యలను మూలాల నుంచి గుర్తించాల్సిన బాధ్యత అధికారులపైనే ఉందన్నారు. అలాగే, వార్డులో దెబ్బతిని పాడైపోయిన రోడ్ల దుస్థితిపై ఆమె స్పందిస్తూ ఆ రోడ్ల సమస్యను త్వరలోనే శాశ్వతంగా పరిష్కరిస్తామని అన్నారు. ఈ పర్యటనలో కౌన్సిలర్ రమణ నాయక్, వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పింఛన్ దరఖాస్తులపై క్షేత్రస్థాయి విచారణ

ఇంటింటికీ వెళ్లి అర్హతలు, ధ్రువపత్రాల పరిశీలన

**ప్రజాపక్షం/ఇల్లందు :** ఇల్లందు మండలంలో పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్న లబ్దిదారుల అర్హతలపై రెండో రోజు విచారణ కొనసాగింది. జిల్లా పంచాయితీ అధికారి డిప్యూటీ సీఈవో అప్పారావు గురువారం పలు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. చల్లసముద్రం పంచాయితీతో పాటు మామిడిగుండాల, బోయితండా, మసివాకు, ముత్తారపుకట్ట, రాఘుబోయినగూడెం, మర్రిగూడెం, మిట్టపల్లి, రొంపేడు గ్రామ పంచాయితీల్లో పంచాయితీ కార్యదర్శులు రూపొందించిన జాబితాల ఆధారంగా విచారణ నిర్వహించారు. దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి కుటుంబ వివరాలు, అర్హత ప్రమాణాలు, ధ్రువపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి నమోదు చేశారు.

# ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఆర్థిక సాధికారత

చిమ్మపుడిలో ఘనంగా మహిళా కిసాన్ దివాస్

**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** వ్యవసాయ సాగులో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని మహిళా రైతులు ఆర్థిక సాధికారత సాధించాలని ఆత్మ ఖమ్మం ప్రాజెక్టు డైరెక్టర్ పి.సరిత తెలిపారు. మహిళా రైతుల భాగస్వామ్యాన్ని గుర్తించి వారిలో అవగాహన పెంచే లక్ష్యంతో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గురువారం మండల పరిధిలోని చిమ్మపుడి గ్రామంలో మహిళా కిసాన్ దివాస్ వేడుకలను సర్పంచ్ కొటేరు నర్సిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా రైతులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పిడి సరిత మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో మహిళల పాత్ర వెలకట్ట లేనిదన్నారు. మహిళా రైతులు సంఘటితమై రైతు ఉత్పత్తిదారుల సంఘాలుగా (ఎఫ్‌పివోఎస్) ఏర్పడాలన్నారు. పండించిన పంటను నేరుగా విక్రయించకుండా విలువ జోడించి మార్కెటింగ్ చేసుకుంటే అధిక ఆదాయం వస్తుందన్నారు. మారుతున్న వాతావరణ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వాడుకోవాలని సూచించారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలను ఇచ్చే అపరాలు, కూరగాయల సాగుపై దృష్టి సారించాలన్నారు. ఎడిఎ వాణి మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణంలో మిరప తదితర పంటల్లో తీసుకోవాల్సిన సమగ్ర సస్యరక్షణ చర్యలు, చీడ పీడల నివారణ, పంటల ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. సర్పంచ్ నర్సిరెడ్డి మాట్లాడుతూ విత్తనం నాటే నాటి నుంచి కోతల వరకు మహిళలే వ్యవసాయానికి వెన్నుముకగా నిలుస్తున్నారన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో సాగు చేపట్టాలన్నారు. అనంతరం పలువురు మహిళా రైతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎఒలు అరుణ జ్యోతి, కర్నాటి ఉమామహేశ్వరరెడ్డి, ఎఇఒ కార్తీక్, వార్డు సభ్యులు, మహిళా రైతులు పాల్గొన్నారు.

## 'ఖమ్మం'ను కరువు జిల్లాగా ప్రకటించాలి

ఎఐకెఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండపర్తి

**ప్రజాపక్షం/చింతకాని :** తీవ్ర వర్షాభావ పరిస్థితులతో ఖమ్మం జిల్లా రైతాంగం తీవ్రంగా నష్టపోయిందని తక్షణమే ఖమ్మం జిల్లాని కరువు జిల్లాగా ప్రకటించి ప్రభుత్వం రైతాంగాన్ని ఆదుకోవాలని ఎఐకెఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండపర్తి గోవిందరావు డిమాండ్ చేశారు. గురువారం చింతకాని మండలం కొదుమూరు గ్రామంలో ఎఐకెఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కొండపర్తి మాట్లాడుతూ ఇప్పటికే రైతులు ఒక్కో ఎకరాకు వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టారని, పంట చేతికొచ్చే పరిస్థితి లేదని ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు. తక్షణం కరువు ప్రాంతంగా ప్రకటించి సాగర్, గోదావరి జలాలతో చెరువులు, కుంటలు నింపాలని ఆయన డిమాండ్ చేశారు. యూరియా యాప్‌ను రద్దుచేయాలని కోరారు. సన్న వడ్లకు ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం మద్దతు ధరను పెంచాలని, కౌలు రైతులను గుర్తించి తక్షణమే వారిని ఆదుకోవాలని డిమండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐకెఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కూచిపుడి రవి, మండల అధ్యక్షుడు దొబ్బల వెంగళరావు, సిపిఐ శాఖ కార్యదర్శి నీరుడు గోవిందరావు, సహాయ కార్యదర్శి చల్లగుండ్ల సాయి, నాయకులు నారపోగు నాగార్జున, అనిల్, మాజీ ఉపసర్పంచ్ కోటగిరి పరభూషణాచారి, కూచిపుడి వెంకటేశ్వర్లు, నూకల నాగయ్య, జనగాం వెంకటేశ్వర్లు, ఖాదర్‌బాబు, నారపోగు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## సందడి సందడిగా బతుకమ్మ

బిఆర్ఎస్ కార్యాలయంలో కోలాహలం

గ్రామాల్లో ఆటా పాటల జోరు

**ప్రజాపక్షం/ఖమ్మం :** బతుకమ్మ ఇప్పుడు కొత్త జోష్ నింపుతోంది, ఎక్కడ చూసినా సందడి సందడిగా కనిపిస్తుంది. ముఖ్యంగా స్థానిక రాజకీయ నాయకులు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని దుర్గామాత విగ్రహాలను ఏర్పాటు చేయించి మండపాల వద్ద భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. సాయంత్రం కాగానే డిజెలతో పల్లె వాతావరణం సందడి సందడిగా మారింది. ఎక్కడ చూసినా బతుకమ్మ పాటలు అలరిస్తున్నాయి. నగరాలు, పల్లెలు అనే తేడా లేకుండా సాయంత్రం కాగానే బతుకమ్మ ఆటలు ఆడుతూ కోలాటాలు వేస్తూ ఉల్లాసంగా గడిపేస్తున్నారు. ముఖ్యంగా ఖమ్మంలో బిఆర్ఎస్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన బతుకమ్మ ఆటకు విశేష ఆదరణ లభిస్తుంది. ఎంఎల్‌సి తాతా మధు నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఈ బతుకమ్మ సంబురాలకు వందలాది మంది ప్రతిరోజు హాజరవుతున్నారు. రూరల్ మండలం ఆరెంపుల గ్రామంలో ప్రభాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బతుకమ్మ సంబురాలకు వందల సంఖ్యలో గ్రామస్తులు హాజరై ఉత్సాహాల్లో పాల్గొంటున్నారు. బతుకమ్మతో గ్రామాలు కొత్తశోభను సంతరించు కుంటున్నాయి.

# విద్యుత్ సరఫరా మెరుగుపరిచి రైతులను ఆదుకోవాలి

ప్రభుత్వ వైఫల్యాన్ని ఎల్ నినోతో కప్పిపుచ్చుకునే ప్రయత్నం

సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య

**ప్రజాపక్షం/సత్తుపల్లి :** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుభవం లేని పాలన, ముందు చూపులేని తనంతో ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర బిఆర్ఎస్ నాయకుడు సండ్ర వెంకట వీరయ్య ధ్వజమెత్తారు.
గురువారం సత్తుపల్లిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యుత్ సరఫరా సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, తన వైఫల్యాలకు అధికారులను బాధ్యులుగా చూపడం సరికాదని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో విద్యుత్ సరఫరాను మెరుగుపరిచి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గత నెల రోజులుగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలపై ప్రజలు, రైతులు సబ్‌స్టేషన్ల ఎదుట ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆరోపించారు. విద్యుత్ సమస్యలకు పరిష్కారం చూపకుండా అధికారులపై నెపం నెట్టడం పాలనా వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. అధికారులపై పట్టు సాధించలేకపోతున్న ముఖ్యమంత్రి "మీరు నా మాట వినట్లేదు" అంటూ వ్యాఖ్యానించడం పాలనలోని వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. గోదావరిఖనిలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ సింగరేణి బొగ్గు ఉత్పత్తి, విద్యుత్ ఉత్పత్తికి సంబంధించిన వాస్తవాలను ప్రజల ముందుంచే ప్రయత్నం చేశారని గుర్తుచేశారు. ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించకుండా ఢిల్లీ పర్యటనలు, రాజకీయ కార్యకలాపాలకే ముఖ్యమంత్రి ప్రాధాన్యత ఇస్తున్నారని విమర్శించారు.
**కెసిఆర్ హయాంలో విద్యుత్ రంగానికి ప్రాధాన్యం...** తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన సమయంలో విద్యుత్ కొరతతో ఇబ్బందులు ఎదురుకాగా, కెసిఆర్ నాయకత్వంలోని గత బిఆర్ఎస్ ప్రభుత్వం వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ అందించే స్థాయికి రాష్ట్రాన్ని తీసుకువచ్చిందని సండ్ర పేర్కొన్నారు. తమ ప్రభుత్వ హయాంలో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 7,778 మెగావాట్ల నుంచి 19,450 మెగావాట్లకు పెరిగిందని తెలిపారు. విద్యుత్ సరఫరా వ్యవస్థను బలోపేతం చేసేందుకు సబ్‌స్టేషన్లు, విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని విస్తరించినట్లు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ సరఫరాను మెరుగుపరిచి వ్యవసాయానికి నిరంతరాయంగా విద్యుత్ అందించాలని సండ్ర వెంకట వీరయ్య కోరారు. ఈ సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, శీలపురెడ్డి హరికృష్ణ రెడ్డి, కూసంపూడి రామారావు, మల్లూరి అంకమ్మ రాజు, అమరవరపు కృష్ణారావు, మోదుగు పుల్లారావు, బెల్లంకొండ రాము, చాంద్ పాషా, పర్వతనేని వేణు, వల్లభనేని పవన్, నడ్డి ఆనంద రావు, మేకల నరసింహారావు, జొన్నలగడ్డ విజయ్, మోరంపూడి శివ పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం

లబ్ధిదారు గృహప్రవేశ వేడుకలో ఎంఎల్ఎ పాయం

**ప్రజాపక్షం/గుండాల:** పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని పినపాక ఎంఎల్ఎ, తెలంగాణ శాసన సభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు అన్నారు. గుండాల మండలం ముత్తాపురం గ్రామ పంచాయతీ పరిధిలో లబ్ధిదారు తురుబాక నాగేంద్ర నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో గురువారం ఆయన పాల్గొని, కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ సొంత ఇల్లు అనేది కేవలం నివాసం మాత్రమే కాదని, కుటుంబానికి భద్రత, ఆత్మగౌరవం, భవిష్యత్తుపై భరోసా కల్పిస్తుందని పేర్కొన్నారు. అర్హులైన నిరుపేద కుటుంబాలకు పక్కా గృహాలు అందించి, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో, రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సహకారంతో పేదల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సంగీత, ఎంపిడివో బాలరాజు, హౌసింగ్ ఎఇ రాజేష్, ఎఒ వెంకటరమణ, ఎంపిఒ త్రిలోక్, పంచాయతీ కార్యదర్శి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు పొంబోయిన ముత్తయ్య, జిల్లా కార్యదర్శి ఎస్‌కే ఖదీర్, మండల అధ్యక్షుడు ఊకె బుచ్చయ్య, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ధార అశోక్, పడుగోనిగూడెం సర్పంచ్ ఈసం సంజీవరావు, రోళ్లగడ్డ సర్పంచ్ భూక్య మంగమ్మ, శెంబునిగూడెం సర్పంచ్ ఈసం సుమలత, శెట్టుపల్లి సర్పంచ్ ఢిల్లీ వసంతరావు, దామరతోగు సర్పంచ్ కల్తి కృష్ణారావు, మాజీ ఎంపిపి చాట్ల పద్మ, మండల నాయకులు ఎస్‌కే అబ్దుల్ నభి, వంకుడోత్ బికోజీ, భూక్య శ్రీను, ఎస్‌కే వాజీద్ పాషా, ఎస్‌కే కాసీం, పోలెబోయిన బాబురావు, మహిళా నాయకులుపాల్గొన్నారు.

# 'బార్' కోసం పోటా పోటీ

దరఖాస్తులతోనే ఎక్సైజ్ శాఖకు రూ.6.82కోట్లు ఆదాయం

నేడు లాటరీ

**ప్రజాపక్షం/ఖమ్మం :** బార్ షాపుల లైసెన్స్‌లను దక్కించుకునేందుకు మద్యం వ్యాపారులు పోటీ పడుతున్నారు. ఈ పోటీ తీవ్ర స్థాయిలో ఉంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నూతనంగా ఏర్పడిన రెండు మున్సిపాలిటీలలో బార్‌షాపులను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అనుమతిచ్చింది. ఖమ్మం జిల్లా కల్లూరు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో బార్లు నూతనంగా ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో దరఖాస్తు లక్ష రూపాయలుగా నిర్ణయించి ఆ సొమ్మును తిరిగి ఇవ్వని విధంగా ప్రభుత్వం నిబంధన విధించింది. కల్లూరు బార్ షాపు లైసెన్స్ దక్కించుకునేందుకు 325 దరఖాస్తులు వచ్చాయి. ఒక్కో దరఖాస్తుకు లక్ష రూపాయల చొప్పున రూ.3.25కోట్ల రూపాయల ఆదాయం ఎక్సైజ్ శాఖకు లభించింది. అశ్వారావుపేటలో బార్ లైసెన్స్ దక్కించుకునేందుకు 357 మంది దరఖాస్తు చేశారు. వీటి ద్వారా ప్రభుత్వానికి రూ.3.57కోట్ల ఆదాయం లభించింది. ఈ దరఖాస్తుల నుంచి లాటరీ పద్ధతిలో ఎంపిక చేయనున్నారు. శుక్రవారం కల్లూరుకు సంబంధించి ఖమ్మం కలెక్టరేట్‌లోనూ, అశ్వారావుపేటకు సంబంధించి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్‌లోనూ లాటరీ నిర్వహించనున్నారు. ఒక పక్క ఎల్ నినో ప్రభావం మరో పక్క దేశంలో నెలకొన్న ఆర్థిక సంక్షోభం ఇతరత్రా పరిస్థితుల నేపథ్యంలో ప్రతి వ్యాపారం ఒడుదొడుకులను ఎదుర్కొంటున్న వేళ మద్యం వ్యాపారం మాత్రం మూడు పువ్వులు, ఆరు కాయలుగా వర్ధిల్లుతుంది. బార్ షాపుల యజమానులు మాత్రం తమకు నష్టాలే వస్తున్నాయని చెబుతున్నప్పటికీ ఎందుకు ఇంతగా పోటీ పడుతున్నారో అర్థం కావడంలేదు. దశాబ్ద కాలంగా మద్యం సేవించే వారి సంఖ్య క్రమేపి పెరుగుతూ వచ్చింది. ఒకప్పుడు మద్యం సేవించి తిరగడాన్ని అవమానకరంగా భావించేవారు. ఇప్పుడు మద్యం సేవించడం స్టేటస్ సింబల్‌గా మారింది. గతంలో ఒకట్రెండు సందర్భాల్లో మాత్రమే మద్యం ఏర్పాటు చేసేవారు. ఇప్పుడు పుట్టిన రోజు మొదలు శుభం, అశుభం, వివాహాలు, గృహప్రవేశాల సందర్భంగా కూడా మందు పార్టీలు ఏర్పాటు చేస్తున్నారు. మంచి, చెడు ఏదైనా సరే బంధువులు, ఆత్మీయులను పిలిచి చేయి కడిగించాలన్న ఆలోచన రాగానే దానితో పాటే మందు పార్టీ ఆలోచన పుట్టుకోస్తుంది. అందుకే మద్యం వ్యాపారంలో భారీ పోటీ పెరిగింది. మద్యానికి తోడు మత్తు పదార్థాల వాడకం కూడా పెరిగి చాలా సందర్భాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే పరిస్థితి ఏర్పడింది.

## కొత్తగూడెం-ఖమ్మం రహదారిని ఎన్‌హెచ్ చేయాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కొత్తగూడెం ఖమ్మం రహదారిని తక్షణమే జాతీయ రహదారిగా ప్రకటించి తగిన ప్రమాణాలకు అనుగుణంగా సమగ్రాభివృద్ధి చేయాలని ఎంఎల్ఎ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ విషయంపై రోడ్లు, భవనాల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో పాటు కేంద్ర మంత్రికి వినతిపత్రాలు అందజేసినట్లు తెలిపారు. ఎస్సీసిఎల్ కెటిపిఎస్ వంటి భారీ పారిశ్రామిక సంస్థలతో పాటు వ్యాపార, వాణిజ్య, రవాణా అవసరాలకు ఈ మార్గం ఎంతో కీలకమన్నారు. ఏజెన్సీ గ్రామీణ ప్రాంతాల ప్రజల రాకపోకలకు సైతం ఈ రహదారే ప్రధాన ఆధారమని పేర్కొన్నారు. దీనిని జాతీయ రహదారిగా తీర్చిదిద్దితే ప్రయాణ సమయం తగ్గడంతోపాటు రోడ్డు భద్రత సైతం మెరుగుపడుతుందని తెలిపారు. ఈ ప్రాంత వ్యవసాయ పారిశ్రామిక రంగాలు పుంజుకోవడంతో పాటు ప్రజలకు విద్య, వైద్య సేవలు మరింత సులభంగా అదుబాటులోనికి వస్తాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యతా క్రమంలో స్పందించి తగిన నిధులను కేటాయించాలని ఆయన కోరారు.

## వైద్యం పేరుతో వేధింపులు : వైద్యుడి అరెస్టు

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** వైద్యం పేరుతో తనను వేధింపులకు గురిచేసినట్లు ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు డాక్టర్ నాడికూడి శైలేష్ కుమార్‌పై పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. నిందితుడు విద్యానగర్ కాలనీలోని శ్రీకృష్ణ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో వైద్యునిగా పనిచేస్తున్నాడు. ఈ కేసులో భాగంగా గురువారం తెల్లవారుఝామున విద్యానగర్ కాలనీ వద్ద చుంచుపల్లి పోలీసులు నిందితున్ని అదుపులోనికి తీసుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బిఎస్ఎన్, ఎస్సి ఎస్టి అట్రాసిటి నిరోధక చట్టంలోని నిబంధనల క్రింద కేసు నమోదైంది.

## చెట్లు నరికివేత... ఇద్దరిపై కేసు

**ప్రజాపక్షం/కల్లూరు :** కల్లూరు మండలం ఎంపిడిఒ కార్యాలయంలో చెట్లు నరికివేతపై అక్రమ రవాణాలో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఫారెస్ట్ రేంజర్ తల్లాడ అధికారిని తెలిపారు. ఈనెల 13వ తేదీ ఎంపిడిఒ కార్యాలయంలో పది చెట్లు నరికివేతపై కల్లూరు మండలం రఘునాథగూడెంకు చెందిన కుక్క రానా, ఎంపిడిఒ చంద్రశేఖర్‌లపై కేసు నమోదైనట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి... ఎంపిడిఒ కార్యాలయంలో 13వ తేదీ కార్యాలయ ఆవరణలో పది చెట్లు నరికివేత.. ఆపై కలప మాయంపై దినపత్రికలలో రావడంతో అటవీశాఖ అధికారులు రెండు రోజులపాటు విచారణ చేసి చేధించారు. దానిలో నిందితులుగా ఇద్దరని గుర్తించి వారు ఇరువురుపై కేసు నమోదు చేసినట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. ప్రభుత్వ భూముల్లో చెట్లను సంరక్షించడం, ప్రతి ఒక్కరి బాధ్యత అని, అనుమతి లేకుండా చెట్లను నరికివేయడం లేదా చట్టం విరుద్ధం కనుక రవాణా చేయడం వంటి చర్యలకు పాల్పడకూడదని అటవీశాఖ అధికారులు ప్రజలను కోరుతున్నటు తెలిపారు. 2002, 1970లోని అటవీ శాఖ చట్ట ప్రకారం ఈ చర్యలు తీసుకున్నట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు.

## మత్స్య రైతులకు నైపుణ్య శిక్షణ పూర్తి

దేశవాళీ కార్ప్ చేపల పెంపకం, యాజమాన్యంపై అవగాహన

**ప్రజాపక్షం/కూసుమంచి :** పాలేరు మత్స్యపరిశోధన స్థానం ఆధ్వర్యంలో, జాతీయ మత్స్య అభివృద్ధి మండలి ఆర్థిక సహకారంతో తెలంగాణ మత్స్య రైతులు, మత్స్యకారులకు నిర్వహించిన మూడు రోజుల నైపుణ్యాభివృద్ధి శిక్షణ గురువారం ముగిసింది. రాజన్న సిరిసిల్ల, భద్రాద్రి కొత్తగూడెం, నాగర్ కర్నూల్, ఖమ్మం జిల్లాల నుంచి 25మంది పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా సూర్యాపేట జిల్లా మత్స్యశాఖ అధికారి డి ఆంజనేయస్వామి మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న మెలకువలను పాటించి, ప్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము
రెవెన్యూ (భూ సేకరణ) శాఖ
జిల్లా కలెక్టర్, జనగాం గారి రూడీ ప్రకటన

ఫారం - VII

(చట్టం 30/2013) లోని సెక్షన్ 19 (1) లోని సబ్ రూల్ - 1 రూల్ 25 ప్రకారం)

యన్.డి.సి. ఫైల్ నెం. బి/25/2023 తేదీ: 24.09.2026
కలెక్టర్, జనగాం ఫైల్ నెం. జి2/299/2023 తేదీ: 24.09.2026
గెజిట్ నెం. JN/LA/53/2026 తేదీ: 29.09.2026

ఈ దిగువ నిర్దిష్ట పరిచిన జనగాం జిల్లా పాలకుర్తి మండలము మల్లంపల్లి గ్రామ పరిధిలో ఈ దిగువ షెడ్యుల్‌లో నిర్దిష్ట పరిచిన విస్తీర్ణం **ఎ.5.26 గుంటలు** గల భూమి ప్రజా ప్రయోజనాలకై అనగా వ్యవసాయ భూములకు సాగు నీరు అందించుటకు గాను దేవాదుల ప్రాజెక్ట్‌లో (జి.సి.ఆర్.జి.ఎల్.ఐ.పి) భాగంగా భాగంగా 10 ఆర్ -7 ఎల్ డిస్ట్రిబ్యూటరి ఆఫ్ నష్కల్ మెయిన్ కెనాల్ కి.మీ 0.000 నుండి కి.మీ 1.187 వరకు కెనాల్ నిర్మాణ నిమిత్తం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము, జిల్లా కలెక్టర్, జనగాం జిల్లా గారి ద్వార భూసేకరణ చట్టం 30/2013 లోని సెక్షన్ 19 (1) ప్రకారము భూమిని సేకరించుటకు నిర్ణయించినారు.

అంతేకాక, పై నీటిపారుదల ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణను న్యాయమైన పరిహారం మరియు పారదర్శకత హక్కు, పునరావాసం మరియు పునర్నిర్మాణ చట్టం, 2013 లోని అధ్యాయం-II (సామాజిక ప్రభావ మదింపు) మరియు అధ్యాయం-III (ఆహార భద్రతకు సంబంధించిన ప్రత్యేక నిబంధనలు) అమలులో నుండి, తెలంగాణ సవరణ చట్టం, 2016 (చట్టం 21 ఆఫ్ 2017) ద్వారా చేర్చబడిన సెక్షన్ - 10A ప్రకారం, జి.ఓ.ఎం.ఎస్. నెం. 63, రెవెన్యూ శాఖ, తేదీ: 29.07.2017 ప్రకారం మినహాయించబడినందున, ఈ భూసేకరణకు అధ్యాయం-II మరియు అధ్యాయం-III నిబంధనలు వర్తించవు.

ఈ భూసేకరణ కారణంగా మొత్తం కుటుంబాలు శూన్యం (Nil) మాత్రమే నిర్వాసితులయ్యే అవకాశం ఉన్నందున, ప్రభావిత కుటుంబాల పునరావాసం మరియు పునర్నిర్మాణం కొరకు అదనపు కలెక్టర్ (రెవెన్యూ), జనగామ గారిని అడ్మినిస్ట్రేటర్గా నియమించడమైనది.

కావున పైన తెలిపిన 10 ఆర్ - 7 ఎల్ డిస్ట్రిబ్యూటరి ఆఫ్ నష్కల్ మెయిన్ కెనాల్ కి.మీ 0.000 నుండి కి.మీ 1.187 వరకు కెనాల్ నిర్మాణము కొరకు జనగాం జిల్లా పాలకుర్తి మండలములోని మల్లంపల్లి గ్రామములో భూమిని సేకరించుటకు గాను ప్రజా ప్రయోజనం కొరకు రూడి ప్రకటన (డిక్లరేషన్) జారి చేయనైనది.

అనుబంధము

10 ఆర్ - 7ఎల్ డిస్ట్రిబ్యూటరీ ఆఫ్ నష్కల్ మెయిస్ కెనాల్

గ్రామము: మల్లంపల్లి మండలం: పాలకుర్తి జిల్లా: జనగాం

| క్ర.సం. | సర్వే నెం. | విస్తీర్ణం | టైప్ రకం | భూమి రకం | సేకరణ విస్తీర్ణం | ఆసక్తి కలిగియున్న వ్యక్తుల పేరు మరియు చిరునామా | రిమార్కులు |
|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | | 5 | 6 | 7 |
| 1 | 192 | పోరం బోకు | ఖుష్కి | | 0.02 | సంపతి హరీష్ తండ్రి కొమురయ్య | సమాచారం పరిశీలించాల్సి ఉంది |
| 2 | 192 | పోరం బోకు | ఖుష్కి | | 0.04 | సంపతి మహేందర్ తండ్రి కొమురయ్య | సమాచారం పరిశీలించాల్సి ఉంది |
| 3 | 192 | పోరం బోకు | ఖుష్కి | | 0.09 | సంపతి రాజు తండ్రి మల్లయ్య | సమాచారం పరిశీలించాల్సి ఉంది |
| 4 | 192 | పోరం బోకు | ఖుష్కి | | 0.13 | బానోతు రవి తండ్రి తేద్య | సమాచారం పరిశీలించాల్సి ఉంది |
| 5 | 192 | పోరం బోకు | ఖుష్కి | | 0.05 | సంపతి వెంకటయ్య తండ్రి రామయ్య | సమాచారం పరిశీలించాల్సి ఉంది |
| 6 | 192 | పోరం బోకు | ఖుష్కి | | 0.05 | సంపతి మల్లన్న తండ్రి రామయ్య | సమాచారం పరిశీలించాల్సి ఉంది |
| 7 | 192 | పోరం బోకు | ఖుష్కి | | 0.18 | సంపతి మహేందర్ తండ్రి కొమురయ్య | సమాచారం పరిశీలించాల్సి ఉంది |
| 8 | 192 | పోరం బోకు | ఖుష్కి | | 0.01 | రోడ్ | సమాచారం పరిశీలించాల్సి ఉంది |
| 9 | 192 | పోరం బోకు | ఖుష్కి | | 0.04 | సంపతి శ్రీనివాస్ తండ్రి కొమురయ్య | సమాచారం పరిశీలించాల్సి ఉంది |
| 10 | 192 | పోరం బోకు | ఖుష్కి | | 0.01 | సంపతి సుధకర్ తండ్రి పెద్ద కొమురయ్య | సమాచారం పరిశీలించాల్సి ఉంది |
| 11 | 192 | పోరం బోకు | ఖుష్కి | | 0.01 | తాళ్ళపల్లి యాకయ్య | సమాచారం పరిశీలించాల్సి ఉంది |
| 12 | 192 | పోరం బోకు | ఖుష్కి | | 0.03 | సంపతి శ్రీను తండ్రి కొమురయ్య | సమాచారం పరిశీలించాల్సి ఉంది |
| 13 | 192 | పోరం బోకు | ఖుష్కి | | 0.02 | సంపతి శ్రీను తండ్రి పెద్ద కొమురయ్య | సమాచారం పరిశీలించాల్సి ఉంది |
| 14 | 192 | పోరం బోకు | ఖుష్కి | | 0.08 | సంపతి సుధాకర్ తండ్రి పెద్ద కొమురయ్య | సమాచారం పరిశీలించాల్సి ఉంది |
| 15 | 192 | పోరం బోకు | ఖుష్కి | | 0.13 | సంపతి రామ తండ్రి సంపతి శ్రీనివాస్ | సమాచారం పరిశీలించాల్సి ఉంది |
| 16 | 192 | పోరం బోకు | ఖుష్కి | | 0.06 | తాళ్ళపల్లి సైద భర్త వెంకన్న | సమాచారం పరిశీలించాల్సి ఉంది |
| 17 | 192 | పోరం బోకు | ఖుష్కి | | 0.07 | సంపతి సత్తయ్య తండ్రి యాది రెడ్డి | సమాచారం పరిశీలించాల్సి ఉంది |
| 18 | 192 | పోరం బోకు | ఖుష్కి | | 0.22 | పురుమ ఎల్లయ్య తండ్రి లక్ష్మ య్య పురుమ సంజీవ తండ్రి ఎల్లయ్య | సమాచారం పరిశీలించాల్సి ఉంది |
| | | | మొత్తం | | 3.04 | | |
| 19 | 196 | పట్టా | ఖుష్కి | | 0.12 | మన్నెం దివ్య భర్త అనిల్ రెడ్డి | |
| 20 | 196 | పట్టా | ఖుష్కి | | 0.11 | గుగులోతు కిషన్ తండ్రి పుల్య | |
| 21 | 196 | పట్టా | ఖుష్కి | | 0.11 | గుగులోతు రవి తండ్రి పుల్య | |
| | | | మొత్తం | | 0.34 | | |
| 22 | 197 | పట్టా | ఖుష్కి | | 0.07 | గుగులోతు కల్పన భర్త రవి | |
| 23 | 197 | పట్టా | ఖుష్కి | | 0.25 | పెండ్లి బిచ్చం తండ్రి జేన్నయ్య | |
| | | | మొత్తం | | 0.32 | | |
| 24 | 198 | పోరం బోకు | ఖుష్కి | | 0.27 | పెర్నిమహేందర్ తండ్రి సోమలింగం | సమాచారం పరిశీలించాల్సి ఉంది |
| 25 | 198 | పోరం బోకు | ఖుష్కి | | 0.09 | పేరం యాకయ్య తండ్రి శంకరయ్య | సమాచారం పరిశీలించాల్సి ఉంది |
| | | | మొత్తం | | 0.36 | | |
| | | పూర్తి మొత్తం | | | 5.26 | | |

వృక్షములు / నిర్మాణములు

గ్రామము: మల్లంపల్లి మండలం: పాలకుర్తి జిల్లా: జనగాం

| వ.సం. | సర్వే నెం. | విస్తీర్ణం | ఆసక్తి కలిగియున్న వ్యక్తుల పేరు మరియు చిరునామా | వృక్షములు రకము | వృక్షములు సంఖ్య | నిర్మాణములు రకము | రిమార్కులు ప్లింత్ ఏరియా/ సంఖ్య | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 |
| 1 | 192 | 0.04 | సంపతి మహేందర్ తండ్రి కొమురయ్య | | | పైప్‌లైన్ | 1 | |
| 2 | 192 | 0.09 | సంపతి రాజు తండ్రి మల్లయ్య | | | పైప్‌లైన్ | 1 | |
| 3 | 192 | 0.13 | బానోతు రవి తండ్రి తేద్య | | | పైప్‌లైన్ | 1 | |
| 4 | 192 | 0.05 | సంపతి వెంకన్న తండ్రి రామయ్య | | | పైప్‌లైన్ | 1 | |
| 5 | 192 | 0.05 | సంపతి మల్లన్న తండ్రి రామయ్య | | | పైప్‌లైన్ | 2 | |
| 6 | 192 | 0.18 | సంపతి మహేందర్ తండ్రి కొమురయ్య | టేకు చెట్టు<br>వేప చెట్టు<br>నమిలినార చెట్టు | 5<br>1<br>1 | పైప్‌లైన్ | 1 | |
| 7 | 192 | 0.04 | సంపతి శ్రీనివాస్ తండ్రి కొమురయ్య | తాటి చెట్టు | 1 | | | |
| 8 | 192 | 0.03 | సంపతి శ్రీను తండ్రి కొమురయ్య | తాటి చెట్టు | 1 | | | |
| 9 | 192 | 0.02 | సంపతి శ్రీను తండ్రి పెద్ద కొమురయ్య<br>సంపతి సుధాకర్ తండ్రి పెద్ద కొమురయ్య | కొబ్బరి చెట్టు<br>తాటి చెట్టు | 2<br>1 | పైప్‌లైన్ | 2 | |
| 10 | 192 | 0.08 | సంపతి సుధాకర్ తండ్రి పెద్ద కొమురయ్య | | | పైప్‌లైన్ | 2 | |
| 11 | 192 | 0.13 | సంపతి రామ తండ్రి సంపతి శ్రీనివాస్ | | | పైప్‌లైన్ | 2 | |
| 12 | 192 | 0.06 | తాళ్ళపల్లి సైద భర్త వెంకన్న | మోదుగ చెట్టు | 1 | పైప్‌లైన్ | 1 | |
| 13 | 192 | 0.07 | సంపతి సత్తయ్య తండ్రి యాది రెడ్డి | మోదుగ చెట్టు | 1 | పైప్‌లైన్ | 1 | |
| 14 | 192 | 0.22 | పురుమ ఎల్లయ్య తండ్రి లక్ష్మ య్య పురుమ సంజీవ తండ్రి ఎల్లయ్య | తుమ్మ చెట్టు | 1 | పైప్‌లైన్ | 1 | |
| 15 | 196 | 0.12 | మన్నెం దివ్య త భర్త అనిల్ రెడ్డి | తాటి చెట్టు | 1 | పైప్‌లైన్ | 1 | |
| 16 | 196 | 0.11 | గుగులోతు కిషన్ తండ్రి పుల్య | | | పైప్‌లైన్ | 1 | |
| 17 | 196 | 0.11 | గుగులోతు రవి తండ్రి పుల్య | | | పైప్‌లైన్ | 1 | |
| 18 | 197 | 0.07 | గుగులోతు రవి | | | పైప్‌లైన్ | 1 | |
| 19 | 197 | 0.25 | పెండ్లి బిచ్చం తండ్రి జేన్నయ్య | | | పైప్‌లైన్ | 1 | |
| 20 | 198 | 0.27 | పెర్ని మహేందర్ తండ్రి సోమలింగం | మామిడి చెట్లు<br>తాటి చెట్లు<br>టేకు చెట్లు<br>వేప చెట్లు<br>గంధమ్ చెట్లు | 30<br>10<br>20<br>4<br>3 | పైప్‌లైన్ | 3 | |

సెక్షన్ (15) చట్టం 30/2013 క్రింద భూసేకరణ పై వచ్చిన అభ్యంతరములను పరిశీలించిన పిదప ఇట్టి రూడి ప్రకటన (డిక్లరేషన్) జారిచేయనైనది. ఇట్టి ప్రాజెక్ట్ నిర్మాణ భూసేకరణ ద్వారా ఏ ఒక్క కుటుంబం కూడా నిర్వాసితులు కావడం లేదు.

భూసేకరణ తల పెట్టిన భూమిలో బొగ్గు, ఇనుము, స్టీల్ మరియు ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత బాగాములలో లభ్యమైనచో ఆ ఖనిజాలు ప్రాజెక్ట్ నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షములో, వాటిని స్వీకరించబడును లేనిచో స్వీకరించబడవు.

భూసేకరణ అధికారి మరియు ప్రత్యేక ఉప కలెక్టర్, భూసేకరణ, పునరుపాది మరియు పునరావాసం, యూనిట్ - 2 నీటి పారుదల శాఖ జనగాం వారి కార్యాలయం లో భూసేకరణకు సంబందించిన భూముల ప్లానును కార్యాలయ పని దినములలో తనిఖీ చేసుకోవచ్చును.

సం/- ప్రత్యేక ఉప కలెక్టర్ భూసేకరణ, యల్.ఎ., ఆర్ & ఆర్, యూనిట్-2, ఇరిగేషన్ ప్రాజెక్ట్, జనగాం

సం/- అదనపు కలెక్టర్ జనగాం

సం/- జిల్లా కలెక్టర్ జనగాం

DIPR RO NO. 1015/LA/PP/Advt/Pub/2026-27

ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్‌లో ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో భారీ వర్షం మధ్యే 'తిరంగా మార్చ్'

# మాల్దీవుల కోస్ట్‌గార్డ్ అదుపులో 25మంది తమిళ జాలర్లు

## విడుదలకు చర్యలు తీసుకోవాలని కోరిన సిఎం విజయ్

**చెన్నై :** మాల్దీవుల కోస్ట్‌గార్డ్ బందీలుగా వున్న 25మంది తమిళనాడు జాలర్ల విడుదలకు, అలాగే జాలరులతో పాటు పడవలు విడుదలకు తగిన చర్యలు తీసుకోవలసిందిగా ముఖ్యమంత్రి సి.జోసెఫ్ విజయ్ గురువారం కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం తెల్లవారుజామున తూత్తుకూడి జిల్లాకు చెందిన జాలరులు, వారితో పాటు మెకనైజ్డ్ పడవులను కోస్ట్‌గార్డ్ అదుపులోకి తీసుకుందని విజయ్ తెలిపారు. ఈ విషయమై విదేశాంగ మంత్రి జయశంకర్‌కు రాసిన లేఖలో విజయ్ అంశాన్ని ప్రస్తావించారు. వివిధ దౌత్య మార్గాల ద్వారా మా ల్దీవ్స్ ప్రభుత్వంతో చర్చించి బందీలుగా వు న్న జాలర్లు సురక్షితంగా స్వదేశానికి చేరేందుకు చర్యలు తీసుకోవాలని, ఈ విషయం లో విదేశాంగ మంత్రి వ్యక్తిగతంగా జోక్యం చేసుకుని జాలర్ల కుటుంబాలకు, వారి సమాజానికి భరోసా కల్పించాలన్నారు.

### బాధిత, ప్రశ్నించే గొంతుల

# అణచివేతే మోదీ సర్కారు లక్షణం

## ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ విమర్శ

**న్యూఢిల్లీ:** ఉత్తరాఖండ్‌లో 2022లో హత్యకు గురైన అంకితా భండారి తల్లిదండ్రులను నిర్బంధించడంపై లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ మోదీ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. బాధితుల గొంతులను అణచివేయడం, ప్రశ్నలు అడిగేవారిని తొలగించడమే ఈ ప్రభుత్వ లక్షణమని ఆయన మండిపడ్డారు. సిక్కిం గవర్నర్‌గా దుష్యంత్ కుమార్ గౌతమ్ నియామకానికి వ్యతిరేకంగా ఇండియా గేట్ సమీపంలో నిరసన తెలుపుతున్న 19 ఏళ్ల అంకితా భండారి తల్లిదండ్రులను కొన్ని గంటల తర్వాత నిర్బంధించి, గురువారం తెల్లవారుజామున విడుదల చేశారు. నిర్బంధంలో ఉన్నప్పుడు, గౌతమ్ నియామకాన్ని రద్దు చేయాలని ఆమె తండ్రి కేంద్రానికి 24 గంటల అల్టిమేటం జారీ చేశారు. 'ప్రపంచం నిద్రిస్తున్న వేళ ఉదయం 4 గంటలకు అంకితా భండారీ తల్లిదండ్రులను అదుపులోకి తీసుకున్నారు. వారి నేరం ఏమిటి? వారు ఇండియా గేట్ వద్ద భారమైన భుజాలతో, ఎలాంటి అలజడి లేకుండా నిశ్శబ్దంగా కూర్చుని, సిబిఐ దర్యాప్తు పూర్తయ్యే వరకు దుష్యంత్ గౌతమ్‌ను సిక్కిం గవర్నర్‌గా నియమించవద్దని మాత్రమే డిమాండ్ చేస్తున్నారు' అని గురువారం రాహుల్‌గాంధీ ఎక్స్‌లో పోస్టు చేశారు. 'నిన్న, నేను, ప్రియాంక ఈ తల్లిదండ్రులను కలిశాము. ఆ విచారణ ఫలితాలు రాకముందే, నియామకాన్ని హడావిడిగా జరిపారు, ప్రశ్నలు అడుగుతున్న తల్లిదండ్రులను అర్ధరాత్రి వేళ అదుపులోకి తీసుకున్నారు' అని రాహుల్‌గాంధీ అన్నారు. బాధితుల గొంతులను నొక్కడం, ప్రశ్నలు అడిగే వారిని తొలగించడం ఈ ప్రభుత్వ నైజం అని లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయం కోసం జరిగే పోరాటాన్ని అణచివేయలేరు, ఆపలేరు రాహుల్ ఉద్ఘాటించారు. 'జస్టిస్ ఫర్ అంకితా భండారి' అనే హ్యాష్‌ట్యాగ్‌ను ఉపయోగిస్తూ, కాంగ్రెస్ అంకితా భండారి కుటుంబానికి అండగా నిలుస్తుందని, వారికి న్యాయం జరిగే వరకు అండగానే ఉంటుందని ఆయన చెప్పారు.

**అంకితా తల్లిదండ్రులు విడుదల**

సిక్కిం గవర్నర్‌గా దుష్యంత్ కుమార్ గౌతమ్ నియామకానికి వ్యతిరేకంగా ఇండియా గేట్ సమీపంలో నిరసన తెలుపుతున్న సమయంలో అంకితా భండారి తల్లిదండ్రులను అదుపులోకి తీసుకని, కొన్ని గంటల తర్వాత, గురువారం తెల్లవారుజామున విడుదల చేశారు. అదుపులో ఉన్నప్పుడు, గౌతమ్ నియామకాన్ని రద్దు చేయాలని ఆమె తండ్రి కేంద్రానికి 24 గంటల అల్టిమేటం జారీ చేశారు. ప్రభుత్వం తమ డిమాండ్‌ను అంగీకరించకపోతే దేశవ్యాప్త ఆందోళన చేపడతామని అంకిత తండ్రి హెచ్చరించారు. అంకితా తల్లిదండ్రులతో పాటు, కాంగ్రెస్ పార్టీ మీడియా, ప్రచార విభాగం అధిపతి పవన్ ఖేరా, సోషల్ మీడియా విభాగం అధిపతి సుప్రియా శ్రీనాతే, ఇండియన్ యూత్ కాంగ్రెస్ చీఫ్ ఉదయ్ భాను చిబ్ సహా పలువురు కాంగ్రెస్ నాయకులను కూడా అదుపులోకి తీసుకుని, ఆ తర్వాత విడుదల చేశారు. రిషికేశ్‌లోని వనంతపుర రిసార్ట్‌లో రిసెప్షనిస్ట్‌గా పనిచేస్తున్న అంకిత, 2022 సెప్టెంబర్ 18న హత్యకు గురయ్యారు.

# తమిళనాడులో ఇండియా కూటమి భారీ నిరసన

**న్యూఢిల్లీ:** 'సర్' ప్రక్రియపై కేంద్రం, జ్ఞానేష్ కుమార్‌పై ఒత్తిడి పెంచుతూ, ఇండియా ఇండియా గురువారం చెన్నైలో భారీ నిరసన చేపట్టింది. 'సర్'ను ప్రజాస్వామ్య హత్యగా అభివర్ణించింది. కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి (సిఇసి) జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని డిమాండ్ చేసింది. ప్రతిపక్ష కూటమిలో చేరిన కొద్ది రోజులకే, సి. జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని అధికార టివికె ఈ నిరసనలో పాల్గొంది. ఓటర్ల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) విషయంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) కుమార్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ టివికె, ఆ పార్టీ కీలక మిత్రపక్షమైన కాంగ్రెస్, విసికె, వామపక్ష పార్టీతలో సహా ఇండియా కూటమిలోని ఇతర భాగస్వామ్య పక్షాలు ఈ నిరసనలో పాల్గొన్నాయి. ఇదిలా ఉండగా, ఏప్రిల్ ఎన్నికల తర్వాత టివికె ప్రభుత్వానికి మద్దతుగా డిఎంకె నేతృత్వంలోని కూటమి నుంచి బయటకు వచ్చిన విసికె వ్యవస్థాపకుడు తోల్ తిరుమావళవన్, ద్రవిడ పార్టీ ఓటమికి ఎస్ఐఆర్‌నే కారణమని ఆరోపించారు. 'లక్షిత ఓటర్ల తొలగింపు, ఎన్నికల అవకతవకల పద్ధతి ద్వారా డిఎంకె ఓడిపోయింది' అని ఆయన అన్నారు. అప్పటి అధికార పార్టీకి ప్రతికూల ఫలితం వచ్చేలా వ్యక్తులను ప్రత్యేకంగా లక్ష్యంగా చేసుకున్నారని ఆయన సూచించారు. గురువారం జరిగిన నిరసనకు తమిళనాడు కాంగ్రెస్ అధ్యక్షుడు బి. మణికం ఠాగూర్ నాయకత్వం వహించగా, తమిళగ వెట్రి కజగం (టివికె) తరపున పాఠశాల విద్యాశాఖ మంత్రి ఎ. రాజ్‌మోహన్ ప్రాతినిధ్యం వహించారు. ఈ నిరసనలో ఇండియా బ్లాక్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో గుమికూడి, తమ తమ పార్టీ జెండాలను ప్రదర్శిస్తూ, ఎస్ఐఆర్ ప్రక్రియపై సిఇసి తక్షణమే రాజీనామా చేయాలని నినాదాలు చేశారు. ఈ నిరసనలో పలువురు వక్తలు మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియ కింద లక్షలాది మంది ఓటర్లను ముఖ్యంగా ముస్లింలు, గిరిజన సమూహాలు, అణగారిన వర్గాలను ఓటర్ల జాబితా నుండి క్రమపద్ధతిలో తొలగించారని ఆరోపించారు. ఒక్క తమిళనాడులోనే 97 లక్షలకు పైగా ఓటర్లను జాబితా నుండి తొలగించారని వారు స్పష్టం చేశారు. ఈ ప్రక్రియ రాజ్యాంగాన్ని బలహీనపరుస్తోందని, ఇది ఒక ప్రజాస్వామ్య మారణకాండ అని వారు అన్నారు. అధికార పార్టీ అయిన బిజెపికి అనుకూలంగా ఎన్నికల ప్రక్రియలను తారుమారు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పారదర్శకత పాటించాలని, అన్యాయంగా తొలగించిన ఓటర్లను తక్షణమే తిరిగి జాబితాలో చేర్చాలని వారు డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితా ఎస్ఐఆర్‌కు తమ పార్టీ దీర్ఘకాలంగా వ్యతిరేకతను, ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించాలనే నిబద్ధతను రాజ్‌మోహన్ నొక్కి చెప్పారు. నిరసనలో పాల్గొన్న తిరుమావళవన్, ఓటర్ల సవరణ ప్రక్రియలో అవకతవకలు జరిగాయని పేర్కొన్నారు. 'జాబితా నుండి ఓటర్లను తొలగించడం ద్వారా రాజకీయ ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకోవడానికి అధికార ప్రభుత్వం, ఎన్నికల సంఘం కలిసి పద్ధతి ప్రకారం ఓట్లను దొంగిలించి, కుట్ర పన్నాయి. గైర్హాజరు, మారిన, స్థానభ్రంశం చెందిన, లేదా నకిలీ అనే వర్గాల కింద ఓటర్లను తొలగిస్తున్నారు' అని ఆయన ఆరోపించారు. ప్రతిపక్ష మద్దతుదారులు, మైనారిటీ వర్గాలు, అణగారిన వర్గాల ఓటు హక్కును హరించడానికి ఓటర్ల జాబితా ఎస్ఐఆర్‌ను దుర్వినియోగం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఎండిఎంకె వ్యవస్థాపకుడు వైకో, సిపిఐ (ఎం), సిపిఐ రాష్ట్ర కార్యదర్శులు పి. షణ్ముగం, ఎం. వీరపాండియన్ తదితరులు పాల్గొన్నారు. తమిళనాడుకు జరిగిన అన్యాయానికి'వ్యతిరేకంగా గళం విప్పాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఎం. వీరపాండియన్ ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్‌ను కోరారు. న్యాయవ్యవస్థపై వీరపాండియన్ నిరాశ వ్యక్తం చేశారు. ఓటరు హక్కుల హరణకు సంబంధించిన తీవ్రమైన ఆందోళనలను పరిష్కరించకుండా, సుప్రీంకోర్టు ఒక కేసులో చిన్నపాటి గుమాస్తా తప్పిదాలపైనే దృష్టి సారించిందని ఆరోపించారు.

### రాహుల్‌గాంధీ, మరో 12మంది ప్రతిపక్షనాయకుల పిటిషన్‌పై...

# ఇసి, సిఇసి స్పందన కోరిన 'సుప్రీం'

**న్యూఢిల్లీ :** పెద్ద యెత్తున ఓటర్ల తొలగింపు, ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ, మరో 12 మంది ప్రతిపక్ష నాయకులు దాఖలుచేసిన పిటిషన్‌పై ఎన్నికల సంఘం, ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేశ్ కుమార్ నుంచి సుప్రీంకోర్టు గురువారం స్పందన కోరింది. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ఢిల్లీ నిరసనలు, సుప్రీంకోర్టుకు పాదయాత్ర, పాత్రికేయులు, న్యాయవాదులపై జరిగిన దాడి ఆరోపణలకు సంబంధించిన వివిధ పిటిషన్లపై విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం, అందరి వాదనలు వింటామని భరోసా ఇచ్చింది. సోమవారం రాహుల్‌గాంధీతో సహా ప్రతిపక్ష నాయకులు చేపట్టిన మార్చ్ గురించి కొందరు న్యాయవాదులు సుప్రీంకోర్టులో ప్రస్తావించగా, భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) నేతృత్వంలోని ధర్మాసనం 'మమ్మల్ని (న్యాయ వ్యవస్థను) ఎవరూ బెదిరించలేరు' అని తేల్చిచెప్పింది. సుప్రీంకోర్టును బెదిరించడానికే ఈ యాత్ర జరిగిందని న్యాయవాదులు చెప్పారు. రాహుల్‌గాంధీ, ఇతరుల పిటిషన్‌పై నోటీసు జారీ చేస్తూ జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి సభ్యుడిగా ఉన్న ధర్మాసనం, పిటిషనర్లలో ఒకరి ప్రవర్తనను తాము గమనించామని పేర్కొంది. అయితే, ధర్మాసనం పిటిషనర్ పేరును వెల్లడించలేదు. రాహుల్‌గాంధీ సహా కొంతమంది నాయకుల ప్రవర్తన, ప్రకటనల గురించి సీనియర్ న్యాయవాది, బిజెపి నాయకుడు గౌరవ్ భాటియా ప్రస్తావించినప్పుడు 'మేం ఏమీ అసాధారణమైన చోట కూర్చుని లేము. వారు బయట ఎలాంటి ప్రకటనలు చేస్తున్నారో, కోర్టులో ఏమి చెబుతున్నారో మాకు తెలుసు. మాకు అన్నీ తెలుసు' అని ప్రధాన న్యాయమూర్తి జ్ఞానేశ్ కుమార్ అన్నారు. అలాగే ఎన్నికల అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ, 'సర్'కు వ్యతిరేకంగా ఒక సంయుక్త వినతిపత్రాన్ని దాఖలు చేశారు. అక్టోబరు 12న జరిగిన మార్చ్‌కు వ్యతిరేకంగా దాఖలు సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్‌పై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, సమాజ్‌వాదీ పార్టీ (ఎస్‌పి) చీఫ్ అఖిలేష్ యా దవ్, తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) ఎంపి మహువా మొ యిత్రా, కాంగ్రెస్ పార్టీకి కూడా సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. కీలక నిర్ణయాలు తీసుకునేటప్పుడు ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి మధ్య ఏకాభిప్రాయంలేదని 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్'లో వచ్చిన ఒక వార్తా కథనం నేపథ్యంలో 'సర్'ను రద్దు చేయాలని కోరుతూ ఆల్ ఇండియా మజ్లిస్ ఇత్తెహాద్–ఉల్–ముస్లిమీన్ (ఏఐఎంఐఎ ం) చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ దాఖలు చేసిన పిటిషన్‌పై ధర్మాసనం ఎన్నికల సంఘానికి, ఇతరులకు కూడా నోటీసులు జారీ చేసింది. దేశ రాజధానిలో జంతర్ మంతర్‌ను ని ర్దేశిత నిరసన ప్రదేశంగా తొలగించడాన్ని సవాల్ చేస్తూ దా ఖలైన వేరొక పిటిషన్‌పై కేం ద్రం, సుప్రీం కోర్టు స్పందన కోరింది.

### నిరసనల వేదికగా జంతర్ మంతర్ తొలగింపుపై...

# కేంద్రం, ఢిల్లీ పోలీసులకు సుప్రీంకోర్టు ఆదేశం

**న్యూఢిల్లీ :** జంతర్ మంతర్‌ను నిర్దేశిత నిరసన స్థలం జాబితా నుంచి తొలగించి, ప్రదర్శనల కోసం మూడు ప్రత్యామ్నాయ వేదికలను ప్రకటిస్తూ అక్టోబరు 11న జారీ చేసిన ఉత్తర్వును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై గురువారం సుప్రీంకోర్టు కేంద్రం, ఢిల్లీ పోలీసుల స్పందన కోరింది. ఢిల్లీ పోలీస్ కమిషనర్ అనురాగ్ కుమార్ అక్టోబరు 11న జారీ చేసిన స్టాండింగ్ ఆర్డర్ ద్వారా జంతర్ మంతర్‌ను డీ–నోటిఫై చేసి, తూర్పు ఢిల్లీలోని రామ్‌లీలా మైదానం, బురారీ మైదానం, సిబిడి గ్రౌండ్‌లను నిరసనలు, ప్రదేశాల కోసం కొత్త వేదికలుగా నిర్దేశించారు. ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం, నిరసన ప్రదర్శనగా జంతర్ మంతర్ వినియోగం, దాని సమర్థతపై అధికారులు ఆలోచించారా ? లేదా? అనే విషయాన్ని పరిశీలిస్తామని మౌఖికంగా పేర్కొంది. న్యాయవాది స్వాతి సింగ్ దాఖలు చేసిన పిటిషన్ విచారణ సందర్భంగా, జంతర్ మంతర్‌ను నిరసన ప్రదేశంగా జారీచేసిన నోటిఫికేషన్‌ను పునరుద్ధరించాలని సీనియర్ న్యాయవాది గోపాల్ శంకర నారాయణన్ కోరారు. గత పక్షం రోజులుగా ఢిల్లీలో పలు తేదీలలో బహిరంగ సమావేశాలు , ప్రదర్శనలను పరిమితం చేస్తూ, గతంలో సిపిసిలోని సెక్షన్ 144గా ఉన్న బిఎస్ఎస్‌లోని సెక్షన్ 163 కింద జారీ చేసిన నిషేధాజ్ఞలను సమర్పించాలని సుప్రీంకోర్టు ఢిల్లీ పోలీసులను ఆదేశించింది. నిరసన

# హోర్మజ్ జలాల్లో నౌక దగ్ధం

- అడ్డదారిలో వెళ్ళి మందుపాతరను ఢీకొన్న నౌక
- సముద్రంపాలైన విలువైన సరుకు
- నీటిలో తేలియాడుతున్న వందల కొద్దీ ఐ-ఫోన్లు
- 21 మంది సిబ్బంది క్షేమంగా ఒడ్డుకు..
- మా దారికి రాకపోతే ఇదే గతి : ఐఆర్‌జిసి హెచ్చరిక

**టెహ్రాన్ :** హోర్మజ్ జలసంధిలో ఇరాన్ ఐఆర్‌జిసి విధించిన నిబంధనలను ఉల్లంఘించి దొడ్డిదారి మార్గంలో వెళుతున్న ఒక సింగపూర్ జెండాతో వెళుతున్న జిఎఫ్‌ఎస్ ప్రైడ్ నౌక మందుపాతరను ఢీకొట్టింది. దీంతో నౌక అగ్నికి ఆహుతైంది. సింగపూర్ మారిటైమ్ అండ్ పోర్ట్ అథారిటీ సమాచారం ప్రకారం అందులో ప్రయాణిస్తున్న 21 సిబ్బందిని కాపాడి సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. ఈ కార్గో నౌకలో దాదాపు 2,500 కంటైనర్లు ఉన్నాయి.ఈ కంటైనర్లలో వందలకొద్దీ ఐ-ఫోన్లు,విలాసవంతమైన పెర్ఫ్యూమ్ బాలిల్స్,ఇతర లగ్జరీ వస్తువులు ఉన్నాయి. ఈ నౌక ధ్వంసం కావడంతో ఈ కంటైన్లు అన్నీ చెల్లాచెదురుగా హోర్మజ్ జలసంధిలో పడిపోయాయి. ఇందులో ఐ-ఫోన్లు హోర్మజ్ జలాలలో తేలియాడుతూ ఈతలు కొడుతున్నాయి.ఈ దృశ్యాలు వీడియోలు వైరల్ అవుతున్నాయి.'ది సన్' కథనం ప్రకారం,హోర్మజ్ జలసంధిలో సింగపూర్ జెండాతో వెళుతున్న వాణిజ్య నౌక ఐఆర్‌జిసి పాతిన సముద్ర మందుపాతరను ఢీకొని ధ్వంసం కావడంతో అందులోని లగ్జరీ సరుకు సముద్రంలో తేలియాడుతోంది.చిన్న చిన్న పడవల్లో వచ్చినవారు ఆ సరుకును సేకరించుకుంటున్నారు.అమెరికాకు కీలకమైన భాగస్వామి సౌదీఅరేబియాకు-హౌతీలకు మధ్య భీకరయుద్ధం కొనసాగుతున్న తరుణంలో హోర్మజ్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది.గడచిన 48 గంటల్లో ఈ ప్రాంతంలో ట్యాంకర్లు,వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకుని డ్రోన్ దాడులు సహా ఐదు రకాల ఘటనలు జరిగినట్లు బ్రిటన్‌కు చెందిన మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ ఏజన్సీ ప్రకటించింది.గడచిన పది రోజులుగా హౌర్మజ్ జలసంధి పరిసరాల్లో నౌకలపై దాడులు తీవ్రరూపం దాల్చాయి.అమెరికా-ఇజ్రాయెల్ మరోసారి ఇరాన్‌పై దాడులు ప్రారంభిస్తాయని వార్తలు వస్తున్న తర్వాత ఈ దాడులు పెరిగాయి.అమెరికా దళాలు తమ ఓడరేవులపై దిగ్బంధనం కొనసాగిస్తున్నందుకు ప్రతీకారంగా ఈ దాడులు చేస్తున్నట్లు ఇరాన్ చెబుతున్నది.చమురు ధరలను అధికస్థాయికి తీసుకువెళ్ళడం ద్వారా నవంబరు మూడో తేదీన జరిగే అమెరికా మధ్యంతర ఎన్నికల్లో అధికార రిపబ్లికన్‌పార్టీ విజయం సాధించకుండా ప్రభావితం చేసేందుకే కొత్త ఉపాయాలు అమలు చేస్తున్నట్లు ఇద్దరు సీనియర్ ఇరాన్ అధికారులు చెప్పినట్లు రాయిటర్స్ వార్తాసంస్థ తెలియజేసింది.

కాగా,తమ కళ్ళు కప్పి తప్పించుకుని దొంగదారిలో వెళ్ళాలనుకున్న నౌకలకు ఇదే గతి పడుతుందని, ఇప్పటికైనా నౌకలన్నీ తమ దళాలతో అనుసంధానంలో ఉంటూ జలసంధిలో రాకపోకలు సాగించాలని ఐఆర్‌జిసి దళాలు హెచ్చరిక జారీ చేశాయి.హోర్మజ్ జలసంధిని ఐఆర్‌జిసి గడచిన మార్చినెలారంభంలో తన అధీనంలోకి తెచ్చుకుంది. అప్పటినుండీ జలసంధిని మూసివేసింది. పూర్తిగా జలసంధి తమ అధీనంలోనే ఉందని ఇరాన్ సైన్యాన్ని సమన్వయం చేసే ఉప అధిపతి రియర్ అడ్మిరల్ హబీబొల్లా సయ్యారీ చెప్పారు. టెహ్రాన్‌లో గురువారనాడు సైనిక నర్సులను సత్కరించే కార్యక్రమం తర్వాత పాత్రికేయులతో మాట్లాడుతూ,హోర్మజ్ జలసంధి పూర్తిగా తమ అధీనఇరాఇంలోనే ఉందని,మూసివేసి ఉందని, అమెరికా తప్పుడు ప్రచారం చేస్తోందని విమర్శించారు. హోర్మజ్ జలసంధిలో ప్రయాణం చేసే ఏ నౌక అయినా ఇరాన్ బలగాలతో సంప్రదింపుల ద్వారా సమన్వయంతో తమ ప్రయాణ రాకపోకలు కొనసాగించాలని స్పష్టం చేశారు. హోర్మజ్ జలసంధిలో పశ్చిమాన ఐఆర్‌జిసి నౌకాదళాలు బలమైన ఉనికి కొనసాగిస్తూ నిఘా అమలు చేస్తున్నాయని,ఉత్తరాన,తూర్పున ఒమన్ వరకూ ఇరాన్ సైన్యాలు పనిచేస్తున్నాయని,మొత్తంగా జలసంధి పూర్తిగా తమ అధీనంలో ఉందని రియర్ అడ్మిరల్ సయ్యారీ చెప్పారు.ఇరాన్-ఒమన్‌మధ్య విస్తరించి ఉన్న హోర్మజ్ జలసంధి అంతర్జాతీయ రవాణాకు అత్యంత కీలకమైన జలమార్గం.

**అమెరికా దుష్టకృత్యాలు సాగనివ్వం**

ఇరాన్‌ను ఆర్థికంగా దెబ్బతియ్యాలని, ఏకాకిని చెయ్యాలని చేస్తున్న దుష్టకృత్యాలను సాగనివ్వబోమని ఆ దేశాధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ హెచ్చరించారు. ఇరాన్ ప్రజలను రెచ్చగొట్టి పరిపాలన అస్తవ్యస్తం చేయాలని అమెరికా ప్రయత్నం చేస్తోందని, ఇరాన్‌కు వచ్చే సరఫరా మార్గాలను దెబ్బతీయాలని చూస్తోందని, ఈ ఆటలు సాగనివ్వబోమని అన్నారు. ఇరాన్‌కు సహాయం చేసే ఎగుమతిదారులు, ఉత్పత్తి దారుల అండతో ఈ దుష్టకృత్యాలను అడ్డుకుంటున్నామన్నారు. ఇరాన్ బలమైనస్థానంలో ఉందని, ప్రజల సహాయంతో అందుబాటులో ఉన్న మార్గాలలో తన అవసరాలు తీర్చుకుంటుందన్నారు. దేశంలో ప్రజలు, అధికారులు కలిసి పనిచేయాలని, రాష్ట్రాలు పూర్తిగా దేశ రాజధాని పాలకుపైనే ఆధారపడకూడదని చెప్పారు.

## అమెరికా మమ్మల్ని మోసం చేసింది

- ఫైనాన్సియల్ టైమ్స్ ఇంటర్వ్యూలో జెలెన్‌స్కీ
- రష్యా ఇంధన వనరులపై దాడులు ప్రారంభిస్తామని వెల్లడి

**కీవ్:** రష్యా ఇంధన వనరులపై తిరిగి దాడులు ప్రారంభిస్తామని ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ప్రకటించారు. కుదిరిన అంగీకారానికి రష్యా కట్టుబడి ఉండటంలేదని, గడచిన మూడు రోజులుగా తాము ట్రంప్ చెప్పిన విధంగా అంగీకారానికి కట్టుబడి ఉన్నామని, దానివల్ల ఫలితం లేదని, అందువల్ల ఆ దేశ ఇంధన వనరులపై తాము తిరిగి దాడులు ప్రారంభిస్తామని చెప్పారు. రష్యాతో డీజిలు దిగుమతి ఒప్పందం ద్వారా తమ దేశానికి ట్రంప్ ద్రోహం చేశారని, అమెరికా తమను మోసం చేసిందని భావిస్తున్నట్లు ఫైనాన్సియల్ టైమ్స్‌కు ఇంటర్వ్యూ సందర్భంగా విలేకరి పియర్స్ మోర్గాన్ ప్రశ్నల సందర్భంగా జెలెన్‌స్కీ అంగీకరించారు. కీలకమైన మద్దతును అమెరికా ఉపసంహరించుకుంది, ఇక మా పని అయిపోయింది''అని ఇంటర్వ్యూలో జెలెన్‌స్కీ చెప్పారు. రష్యా నుండి ఇప్పటివరకూ ఎదురైన దాడులకు సంబంధించిన ముందస్తు సమాచారాన్ని తమకు షేర్ చేసే నిఘా సమాచార భాగస్వామ్యాన్ని కూడా అమెరికా ఉపసంహరించుకుందని, అమెరికా స్టార్‌లింక్ వ్యవస్థలను ఉక్రేన్ సైన్యం ఉపయోగించుకునే సేవలపై కూడా ఉద్దేశపూర్వకంగానే నిషేధం విధించారని చెప్పారు. డ్రోన్ల వేగం పరిమితం కావడం సాంకేతికలోపం కాదని, ఉద్దేశపూర్వక సంకల్పమని ఆయన అన్నారు. ఐతే స్టార్ షీల్డ్ సేవలు పునరుద్ధరించినట్లు ఉక్రేన్ అధికారులు తర్వాత చెప్పారు. రష్యాతో డీజిలు దిగుమతి ఒప్పందం చేసుకున్నట్లు అక్టోబరు తొమ్మిదో తేదీన ట్రంప్ ప్రకటించారు. ఆ మరునాడే మరో బాంబు పేల్చారు. ఇక జెలెన్‌స్కీని అధ్యక్ష పదవి నుండి దించివేసేందుకు సమయం ఆసన్నమైందని ప్రకటించారు. ఆ తర్వాత రష్యా-ఉక్రేన్ మధ్య ఇంధన వనరులపై పరస్పర దాడుల ఉపసంహరణ తక్షణం అమలులోకి వస్తుందని గడచిన ఆదివారం ట్రంప్ ప్రకటించారు. రష్యా ఇంధన వనరులపై దాడులు చేయవద్దని అంతకుముందే జెలెన్‌స్కీకి ట్రంప్ ఒక విజ్ఞప్తి చేశార. ఈ పరిస్థితుల్లో తమకు రక్షణ లేదని ఉక్రేన్ తీవ్ర అభద్రతాభావంలో మునిగిపోయింది. కానీ తాము పూర్తి మద్దతు తెలియజేస్తామని, ఆయుధ సరఫరాలు చేస్తామని బ్రిటన్ ప్రధాన మంత్రి బర్నహామ్ ప్రకటించారు.

ఇదిలాఉండగా, గురువారం తెల్లవారుజామున మాస్కోకు దక్షిణాన ఉన్న ఒక చమురు శుద్ధి కర్మాగారంపై దాడులకు ఉక్రేన్ ప్రయత్నం చేసిందని, నాలుగు క్షిపణులు, డజన్లకొద్దీ డ్రోన్లను రష్యా సైన్యం అడ్డుకుందని క్రెమిన్ వర్గాలు ప్రకటించాయి. ఇంధన వనరులపై దాడులు నిలివేస్తామనే ఒప్పందానికి అంగీకరించినట్లు తాము ఎన్నడూ ప్రకటన చేయలేదని క్రెమ్లిన్ వర్గాలు స్పష్టం చేశాయి.

## ఢాకా రహదారుల దిగ్బంధం

వస్త్రకార్మికుల ప్రదర్శనపై పోలీసు దౌర్జన్యం

**ఢాకా:** బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో ప్రధాన రహదారులను వస్త్రకార్మికులు దిగ్బంధనం చేశారు. తమకు మంచి వేతనాలు చెల్లించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. బంగ్లాదేశ్‌వ్యాప్తంగా గార్మెంట్ ఇండస్ట్రీలో 4000 మంది రిజిస్టర్డ్ కర్మాగారాలు ఉన్నాయి. దాదాపు 40 లక్షలమంది కంటే ఎక్కువమంది కార్మికులు ఈ కర్మాగారాలలో పనిచేస్తున్నారు. రహదారులను దిగ్బంధనం చేసిన కార్మికులపై పోలీసులు బల ప్రయోగం చేశారు. వరుసగా నాలుగోరోజు కూడా భారీసంఖ్యలో కార్మికులు ఢాకా-మైమెన్‌సింగ్ రహదారిని దిగ్బంధనం చేశారు. కార్మికులను చెదరగొట్టేంకు పోసులు లాఠీలు ప్రయోగించారు. సౌండ్ గ్రెనేడ్లు ఉపయోగించారు. బంగ్లాదేశ్ వస్త్ర ఉత్పత్తి, ఎగుమతిదారుల సంఘం(బిజిఎంఇఎ) చెప్పిన సమాచారం ప్రకారం, 2025-26 ఆర్థిక సంవత్సరంలో బంగ్లాదేశ్ నుండి వస్త్ర ఎగుమతులు 38.70 బిలియన్ డాలర్లకు చేరుకోవడంతో ప్రపంచంలో చైనా తర్వాత బంగ్లాదేశ్ ఈ ఎగుమతుల్లో రెండోస్థానానికి చేరుకుంది. మొత్తం 150 దేశాలకు బగ్లాదేశ్ వస్త్రాలు ఎగుమతి అవుతూ ఉంటాయి. ఎక్కువ వేతనాలు ఇవ్వాలని, బకాయిలు చెల్లించాలని, ఇతర సదుపాయాలు సమకూర్చాలని కోరుతూ కార్మికులు వీధుల్లోకి వచ్చారు. ఢాకా శివారు ప్రాంతాలైన అజంపూర్, రాజలోఖి లలో ఉన్న అనేక వస్త్ర కర్మాగారాల వెలుపల వేలాదిమంది కార్మికులు గుమిగూడి నిరస ప్రదర్శనలు జరిపారు. దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోయాయని, కుటుంబ పోషణ భారంగా మారిందని కార్మికులు నినాదాలు చేశారు. నెలసరి వేతనాలు 30,000 టాకాలుగా నిర్ణయించాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. అధికారులకు పదే పదే విజ్ఞప్తి చేసినా పట్టించుకోకపోవడంతో విసిగి వేసారిపోయిన కార్మికులు వీధుల్లోకి వచ్చి ప్రదర్శనలు చేస్తున్నారు.

## మోదీ సర్కార్ యుద్ధం

(మొదటి పేజీ తరువాయి)

గురువారం దీప్కే విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జ్ఞానేష్ కుమార్ రాజీనామా కోరుతూ జరుగుతున్న నిరసనలలో ప్రజలు పాల్గొనకుండా నిరోధించడానికి ఢిల్లీలో అసాధారణ ఆంక్షలు విధించారని కూడా ఆరోపించారు. సర్‌పై వ్యక్తమవుతున్న అసమ్మతిని అధికారులు అణచివేస్తున్నారన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఈ తొలగింపులను ప్రశ్నిస్తూ, '2024లో గెలుపు మార్జిన్ కేవలం 2 శాతమే. 13 కోట్లకు పైగా ఓటర్లను తొలగించారు' అని ఆయన అన్నారు. 2 శాతం ఓట్లే ఎన్నికల ఫలితాన్ని నిర్ణయిస్తున్న చోట, 13 కోట్ల ఓట్లను తొలగిస్తున్నారు, ఇది కుట్ర కాకపోతే మరేమిటి? అని ఆయన ప్రశ్నించారు. భారతదేశ చరిత్రలో తొలిసారిగా జ్ఞానేశ్ కోసం రైల్వేలను, మెట్రోలను మూసివేశారు అని అన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను ప్రభుత్వం ఎందుకు రక్షిస్తోందని ఆయన ప్రశ్నించారు. 'ఒకే దేశం, ఒకే ఎన్నిక' అనే నినాదం వేరొక రాజకీయ లక్ష్యానికి ముసుగు అని అభివర్ణించారు. 'ఒకే దేశం, ఒకే ఎన్నిక అనేది ఒక నినాదం మాత్రమే. అసలు ఉద్దేశం 'ఒకే దేశం, ఒకే పార్టీ, ఒకే నాయకుడు'. జాతీయ జెండాను పట్టుకుని నిరసన తెలుపుతున్న వారిని ప్రభుత్వం లక్ష్యంగా చేసుకుంటోందని దీప్కే ఆరోపించారు. 'ముంబయి పతాకాన్ని ఎన్నడూ ఆలింగనం చేసుకోని వారే దానిపై దాడి చేస్తున్నారు. మా సహచరులు కన్నాట్ ప్లేస్‌లో త్రివర్ణ పతాకంతో నడుస్తుంటే వారందరినీ నిర్బంధించారు. త్రివర్ణ పతాకాన్ని పట్టుకోవడం ఎప్పుడు నేరమైంది? అని ఆయన ప్రశ్నించారు. మమతా బెనర్జీ, అరవింద్ కేజ్రీవాల్, పినరయి విజయన్‌లతో సహా ప్రతిపక్ష నాయకులు, మాజీ ముఖ్యమంత్రుల నిర్బంధాన్ని ప్రస్తావిస్తూ, ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను కాపాడటానికి ప్రభుత్వం ప్రభుత్వ యంత్రాంగాన్ని వాడుకుంటోందని దీప్కే మండిపడ్డారు. జాతీయ రాజధానిలో జమ్మూ కాశ్మీర్ నుండి భద్రతా సిబ్బందిని మోహరించడాన్ని కూడా ఆయన ప్రశ్నించారు. ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్‌లోని సెంట్రల్ పార్క్‌లో శుక్రవారం 'లెహ్రా దో త్రివర్ణ' మార్చ్ నిర్వహిస్తామని సిజెపి ప్రకటించింది. జాతీయ జెండాను ఎగురవేయడం ప్రజాస్వామ్య హక్కు అని నొక్కి చెబుతూ, ఈ ప్రదర్శనలో పాల్గొనాలని దీప్కే పౌరులను కోరారు. రాజకీయ పార్టీలు కూడా ఇందులో చేరాలని ఆయన విజ్ఞప్తి చేశారు. నిరసనలను కవర్ చేస్తున్న జర్నలిస్టులను పోలీసులు లక్ష్యంగా చేసుకున్నారని, వారి ప్రెస్ గుర్తింపు కార్డులు ఉన్నప్పటికీ వారిని నిర్బంధించారని, వారి కెమెరాలను లాక్కున్నారని బోరా ఆరోపించారు. ఒక జర్నలిస్టుపై లైంగిక వేధింపుల ఆరోపణలు రాగా, దానిపై ఎఫ్ఐఆర్ నమోదైందని ఆమె ప్రస్తావించారు. ఎన్నికల హక్కులపై ఆందోళన వ్యక్తం చేస్తున్న వారిపై పోలీసులు బలప్రయోగం చేస్తున్నారని ఆమె ఆరోపించారు. 'పోలీసులు శాంతిభద్రతలను కాపాడటానికి బదులుగా, ప్రజలను అణచివేస్తున్నారు. మనం చూసిన దానికి ఇది ఒక చక్కటి ఉదాహరణ' అని ఆమె అన్నారు. 'ఓటు హక్కుకు మద్దతు ఇచ్చే గొంతును మీరు జైలుకు పంపుతున్నారు. మీరు సామాన్య ప్రజలను ఈడ్చుకెళ్తున్నప్పుడు, ఆ 13 కోట్ల మంది ప్రజలను ఈడ్చుకెళ్తున్నట్లే' అని ఆమె అన్నారు. అధికారంలో ఉన్న బిజెపిపై కాకుండా ప్రజలపైనే తనకు నమ్మకం ఉందని చెబుతూ, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవడానికి పౌరులందరూ ఏకం కావాలని ఘోష్ కోరారు.

## ప్రభుత్వం అండ

(మొదటి పేజీ తరువాయి)

సదుపాయాలు కల్పిస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు సహా మంత్రివర్గం మొత్తం పారిశ్రామికవేత్తలకు సహకరించేందుకు సిద్ధంగా ఉందన్నారు. పెట్టుబడిదారులు తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. తెలంగాణలో పరిశ్రమల స్థాపనకు భౌగోళికంగా అనుకూల పరిస్థితులు, మెరుగైన మౌలిక సదుపాయాలు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు ప్రధాన బలాలని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. హైదరాబాద్‌లో శాంతిభద్రతలు, విద్యా సంస్థలు, బహుభాషా సంస్కృతి, వివిధ ప్రాంతాల ప్రజలను ఆదరించే వాతావరణం పెట్టుబడిదారులకు అనుకూలంగా ఉన్నాయని చెప్పారు. ఫార్మా, బయోటెక్నాలజీ, ఐటీ, కృత్రిమ మేధ, ఎగుమతులు, పారిశ్రామిక మౌలిక సదుపాయాలు తదితర రంగాల్లో మరిన్ని పెట్టుబడులు రావాల్సిన అవసరం ఉందన్నారు. హైదరాబాద్, పరిసర ప్రాంతాల అభివృద్ధికి కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్), పెరి అర్బన్ రీజియన్ (ప్యూర్), రూరల్ అగ్రికల్చర్ రీజియన్ (రేర్) విధానాల ద్వారా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు భట్టి విక్రమార్క వివరించారు. కోర్ అర్బన్ ప్రాంతంలో ఐటీ, సేవారంగం, మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యమిస్తామని తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డు, ప్రతిపాదిత రీజినల్ రింగ్ రోడ్డు మధ్య ప్రాంతాన్ని పరిశ్రమల అభివృద్ధికి అనువుగా తీర్చిదిద్దుతామని చెప్పారు. ఈ ప్రాంతంలో రేడియల్ రోడ్ల అభివృద్ధికి సంబంధించి 21 రోడ్లకు మంజూరు, రూపకల్పన ప్రక్రియ చేపట్టినట్లు వెల్లడించారు.

ఫార్మా, బయోటెక్నాలజీ, విద్య, సాఫ్ట్‌వేర్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి రంగాలకు ప్రత్యేక పారిశ్రామిక క్లస్టర్లను అభివృద్ధి చేసే అవకాశాలున్నాయని వివరించారు. గ్రామీణ అగ్రికల్చర్ రీజియన్‌లో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను ప్రోత్సహిస్తామని, స్థానిక వనరులకు విలువ జోడించే పరిశ్రమల ఏర్పాటుతో గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో పరిశ్రమలు, సేవారంగాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని ఉప ముఖ్యమంత్రి అన్నారు. వ్యవసాయంతోపాటు పారిశ్రామిక, సేవారంగాలు బలోపేతం కావడం ద్వారా ఆర్థిక వ్యవస్థ మరింత విస్తరిస్తుందని తెలిపారు. పారిశ్రామికవేత్తలు వ్యాపారాలను విస్తరించడంతోపాటు కొత్తగా వ్యాపారాలు ప్రారంభించాలనుకునే యువతకు తమ అనుభవాన్ని, పరిజ్ఞానాన్ని పంచాలని సూచించారు. సంపద కొద్దిమందికే పరిమితం కాకుండా సమాజంలోని అన్ని వర్గాలకు అభివృద్ధి ఫలాలు అందాలని ఆకాంక్షించారు. పారిశ్రామికవేత్తలు తమతోపాటు ఇతరులను కూడా అభివృద్ధి దిశగా నడిపించినప్పుడే సమగ్ర ప్రగతి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చే వ్యాపారవేత్తలకు స్వాగతం పలుకుతూ, రాష్ట్ర అభివృద్ధి, ఉపాధి కల్పనలో భాగస్వాములు కావాలని భట్టి విక్రమార్క కోరారు.

## ఢిల్లీకి అఖిలపక్షం

(మొదటి పేజీ తరువాయి)

సాగుకు నీటిని అందిస్తే సరిపోదని, అందుకే అందుబాటులో ఉన్న నీటిని కేవలం 24 వేల గ్రామాలకు తాగునీటి అవసరాల కోసమే భద్రపరచాల్సిన క్లిష్ట పరిస్థితి నెలకొంది తెలిపారు. రైతులు దేశానికి రాజులని, 1947 కరవు నుంచి దేశానికి ఏ కష్టం వచ్చినా రైతాంగమే ముందుండి నిలబడిందని సిఎం గుర్తు చేశారు.

**చివరి ఆయకట్టును కాపాడేందుకు చర్యలు**

'వానాకాలంలో 56 లక్షల ఎకరాల్లో వరి, 13 లక్షల ఎకరాల్లో ఇతర పంటలు సాగయ్యాయని, 10 లక్షల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లే అవకాశం ఉందని నివేదికలు చెబుతున్నాయని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. చేతికొచ్చిన పంట ఎండిపోకుండా చివరి ఆయకట్టు దాకా కాపాడేందుకు చర్యలు తీసుకుంటున్నామని, రైతులు వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకుని, వచ్చే యాసంగి సీజన్‌లో తప్పుడు ప్రచారాలను నమ్మి వరి పంట వేయవద్దని, వరి సాగును వాయిదా వేసుకోవాలని కోరారు. నారుమడి దశలోనే ఎండిపోయి, మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయే ప్రమాదం ఉన్నదని, ప్రజలు కూడా నీటిని వృథా చేయకుండా చుక్క చుక్కనూ ఒడిసిపట్టాలని, కాల్లు, బండ్లు కడగడానికి తాగునీటిని వాడొద్దని సిఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

**ఎంత భారమైనా విద్యుత్‌ను కొనుగోలు చేస్తాం**

రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా విద్యుత్ వినియోగం పెరిగిందని సిఎం తెలిపారు. అక్టోబర్ నెలలో 15 వేల మెగావాట్లు ఉండాల్సిన విద్యుత్ డిమాండ్ ఏకంగా 20 వేల మెగావాట్లకు చేరిందని, ఈనెల 15వ తేదీన రికార్డు స్థాయిలో 20,003 మెగావాట్ల విద్యుత్ వినియోగం జరగడం ఇందుకు నిదర్శనమన్నారు. రాష్ట్రంలోని 30 లక్షల వ్యవసాయ పంపుసెట్లు ఒకేసారి ఆన్ అయ్యాయని, మరో 20 రోజుల్లో వానాకాలం పంటలు కోతకు రానున్నాయని, చేతికొచ్చిన పంట ఎండిపోకూడదనే ఏకైక లక్ష్యంతో మార్కెట్‌లో విద్యుత్ యూనిట్ ఎంత ధరకు దొరికినా కొనుగోలు చేసి, రైతులకు అందిస్తున్నామని వివరించారు. పొరుగు రాష్ట్రాలైన కర్నాటక , మహారాష్ట్ర, ఎపి, తమిళనాడు కూడా విద్యుత్ కొరత ఎదుర్కొంటున్నదన్నారు. ఒవర్‌లోడ్‌తో చిన్నపాటి అంతరాయాలు ఏర్పడితే కొందరు పైశాచిక ఆనందం పొందుతున్నారన్నారు. మిగులు విద్యుత్ ఉన్న రాష్ట్రాల నుంచి మిగిలిన రాష్ట్రాలకు కేంద్రమే తక్కువ ధరకు విద్యుత్‌ను సమకూర్చాలని డిమాండ్ చేశారు.

**ఉపాధి హామీ పనుల పెంపు**

రైతు కూలీలను దృష్టిలో పెట్టుకుని గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఉపాధి కల్పించేందుకు ఉపాధి హామీ పథకాన్ని విస్తృతంగా అమలు చేస్తున్నామని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. గత ఏడాది ఇదే సమయానికి 25 వేల మంది ఉపాధి హామీ పనులకు వెళ్తే, ప్రస్తుతం ఆ సంఖ్య 2.5 లక్షలకు చేరిందన్నారు. ఉపాధి హామీ నిధులతో చెరువులు, కుంటల పూడికతీత, మరమ్మతు పనులకు అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నామని, వానాకాలంలో పంట నష్టపోయిన రైతులను, రానున్న సీజన్‌లో పంట సాగు చేయని రైతులను ఆదుకునేందుకు కేంద్ర ప్రయోజిత పథకాల ద్వారా కేంద్ర ప్రభుత్వం 60:40 నిష్పత్తి నిధులతో ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని కోరారు. దీనికి సంబంధించి సమగ్ర నివేదికను కేంద్రానికి పంపుతామన్నారు. పశుగ్రాసం, పశువుల తాగునీటి కొరత రాకుండా, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్యారోగ్య, పశుసంవర్ధక శాఖలను పూర్తి అప్రమత్తం చేశామన్నారు.

గతంలో కరోనా సంక్షోభం వచ్చినప్పుడు ప్రధాని ఏ పిలుపునిచ్చినా రాజకీయాలకతీతంగా రాష్ట్రం మొత్తం సహకరించిందని, ప్రస్తుతం ఎల్‌నినో విపత్తు సమయంలోనూ అదే స్ఫూర్తిని చాటాలని కోరారు. ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు ప్రభుత్వ కార్యాచరణను, పరిస్థితులను ప్రజలకు వివరించేందుకు మీడియా, సినీ ప్రముఖులు, కళాకారుల సహకారం తీసుకుంటామన్నారు.

**ఎల్‌నినోకు ప్రత్యేక నోడల్ అధికారి..**

**వార్ రూమ్ ఏర్పాటు**

ఎల్‌నినో తీవ్రత నేపథ్యంలో ప్రత్యేకంగా వార్ రూమ్‌ను ఏర్పాటు చేసి, నోడల్ అధికారిగా ప్రభుత్వ సలహాదారు రామకృష్ణారావును నియమించినట్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. టోల్ ఫ్రీ నంబర్‌ను కూడా కేటాయిస్తామన్నారు. గ్రామీణ స్థాయిలో ప్రజలను అప్రమత్తం, చైతన్యం చేసేందుకు కళా ప్రదర్శనలు నిర్వహిస్తామని, అవగాహన కల్పించేందుకు నిపుణులు, సీనియర్ జర్నలిస్టులు విస్తృతంగా వ్యాసాలు రాయాలని కోరారు.

## మాదాపూర్‌లో రూ.400 కోట్ల ప్రభుత్వ భూమికి రక్షణ

రెండు ఎకరాలకు పైగా భూమి చుట్టూ హైడ్రా ఫెన్సింగ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం మాదాపూర్ ఖానామెట్ గ్రామంలో ఆక్రమణకు గురవుతున్న రూ.400 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని హైడ్రా రక్షించింది. రెండు ఎకరాలకు పైగా విస్తీర్ణంలో ఉన్న ప్రభుత్వ స్థలానికి గురువారం ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది. రెవెన్యూ అధికారుల విజ్ఞప్తి మేరకు హైడ్రా ఈ చర్యలు చేపట్టింది. ప్రభుత్వ భూమిని కొంతమంది ఆక్రమణదారులు స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించగా, గతంలో రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. కొందరు కోర్టును ఆశ్రయించినప్పటికీ వారికి అనుకూలంగా తీర్పు రాలేదు. తాజాగా ఆక్రమణదారులు ప్రభుత్వ భూమి చుట్టూ బ్లూ షీట్లతో ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంతో రెవెన్యూ అధికారులు హైడ్రాను ఆశ్రయించారు. హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ ఆదేశాల మేరకు అధికారులు రంగంలోకి దిగి ఆక్రమణదారులు ఏర్పాటు చేసిన బ్లూ షీట్ ఫెన్సింగ్‌ను తొలగించారు. అనంతరం రెండు ఎకరాలకు పైగా ఉన్న ప్రభుత్వ భూమి చుట్టూ హైడ్రా ఆధ్వర్యంలో శాశ్వత ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. ఈ స్థలం ప్రభుత్వ భూమి అని తెలియజేస్తూ రెవెన్యూ అధికారుల సమక్షంలో హైడ్రా బోర్డులను కూడా ఏర్పాటు చేసింది. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో భాగంగా ఆక్రమణలపై కఠిన చర్యలు కొనసాగుతాయని హైడ్రా అధికారులు తెలిపారు.

## బిసి కోటా వర్తించదు

(మొదటి పేజీ తరువాయి)

పిటిషన్‌ను కొట్టివేసింది. ఆ అంశంపై మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. జస్టిస్ పికె మిశ్రా, జస్టిస్ శ్రీఛంద్రశేఖర్‌తో కూడిన ధర్మాసనం గురువారం ఆ తీర్పు వెలువరించింది. హిందూ సామాజిక వ్యవస్థ నుంచి మరో మతంలోకి మారిన వ్యక్తి, గతంలో తన సామాజిక వర్గానికి ఉన్న వెనకబాటుతనాన్ని చూపించి రిజర్వేషన్ పొందలేరని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ విషయంలో మద్రాస్ హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని పేర్కొంది. తమిళనాడులో బిసి, అత్యంత వెనకబడిన వర్గాలు

# ఉప్పల్ మ్యాచ్‌లో భారత్ ఓటమి

వెస్టిండీస్‌తో ఐదు టి–20ల సిరీస్‌లో టీమిండియాకు మరో పరాజయం ఎదురైంది. బుధవారం ఉప్పల్ స్టేడియం వేదికగా జరిగిన నాలుగో టి–20లో సమష్టిగా విఫలమైన టీమిండియా 24 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. ఈ పరాజయంతో ఐదు ఇరు జట్లు 2–2తో సమంగా నిలిచాయి. దాంతో బెంగళూరు వేదికగా జరిగే ఆఖరి మ్యాచ్ సిరీస్ డిసైడర్‌గా మారింది. ఈ ఓటమి తెలుగు అభిమానులను తీవ్రంగా నిరాశపర్చింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్లకు 247 పరుగుల భారీ స్కోర్ చేసింది. షై హోప్ (50 బంతుల్లో 4 ఫోర్లు, 9 సిక్స్‌లతో 102 నాటౌట్) విధ్వంసకర శతకంతో చెలరేగగా.. షెర్ఫెన్ రూథర్ఫోర్డ్(26 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్లతో 49 నాటౌట్), షిమ్రాన్ హ్మైర్(12 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్లతో 33) దూకుడుగా ఆడారు. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్, ప్రిన్స్ యాదవ్, అక్షర్ పటేల్ తలో వికెట్ తీసారు. విండీస్ బ్యాటర్ల ధాటికి భారీగా పరుగులు సమర్పించుకున్నారు. అనంతరం భారత్ 19.3 ఓవర్లలో 223 పరుగులకు ఆలౌటైంది. సంజూ శాంసన్(23 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్స్‌లతో 56) హాఫ్ సెంచరీతో రాణించినా.. తిలక్ వర్మ(25 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లతో 43 నాటౌట్), నితీష్‌కుమార్‌రెడ్డి(20 బంతుల్లో ఫోర్, 4 సిక్స్‌లతో 41) పోరాడినా ఫలితం లేకపోయింది. కీమోపాల్(5/41) ఐదు వికెట్లతో భారత్ పతనాన్ని శాసించగా.. గుడకేష్ మోతీ(2/13) రెండు వికెట్లు పడగొట్టాడు. రొమారియో షెపెర్డ్, షమర్ స్ప్రింగర్ తలో వికెట్ తీసారు.

### శుభారంభం దక్కినా..

భారీ లక్ష్యఛేదనలో భారత్‌కు అదిరిపోయే ఆరంభం దక్కింది. సంజూ శాంసన్ విధ్వంసకర బ్యాటింగ్‌తో టీమిండియా 3 ఓవర్లలోనే 50 పరుగులు చేసింది. 20 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్న సంజూ శాంసన్‌ను కీమో పాల్ ఔట్ చేయడంతో తొలి వికెట్‌కు నమోదైన 60 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. క్రీజులోకి వచ్చి రావడంతోనే భారీ సిక్సర్ బాదిన ఇషాన్ కిషన్.. అదే ఓవర్‌లో క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. శ్రేయస్ అయ్యర్‌తో కలిసి మరో ఓపెనర్ అభిషేక్ శర్మ భారీ షాట్స్ ఆడటంతో పవర్ ప్లేలోనే భారత్ 2 వికెట్లకు 80 పరుగులు చేసింది. పవర్ ప్లే అనంతరం స్ప్రింగర్ బౌలింగ్‌లో శ్రేయస్ అయ్యర్(16) ఔటవ్వగా.. తన శైలికి భిన్నంగా ఆడిన అభిషేక్ శర్మ(24 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 29)ను గుడకేష్ మోతీ ఔట్ చేశాడు. ఆ మరుసటి బంతికే నమన్ ధీర్(0) స్టంపౌట్గా వెనుదిరిగాడు. దాంతో భారత్ 130 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయింది.

### పోరాడిన తిలక్, నితీష్..

ఈ పరిస్థితుల్లో తిలక్ వర్మ, నితీష్ కుమార్ రెడ్డి జట్టును ఆదుకున్నారు. తమదైన శైలిలో చెలరేగిన ఈ జోడీ.. ఆరో వికెట్‌కు 70 పరుగులు జోడించింది. హాఫ్ సెంచరీకి చేరువైన తిలక్ వర్మను రొమారియో షెఫెర్డ్ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. మరో ఎండ్ లో పోరాడిన నితీష్ కుమార్ రెడ్డి కూడా భారీ షాట్ ఆడే ప్రయత్నంలో కీమో పాల్ బౌలింగ్‌లో క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. దాంతో భారత్ ఓటమి ఖాయమైంది. ఆ మరుసటి బంతికే ప్రిన్స్ యాదవ్(0)ను ఔట్ చేసిన కీమో పాల్.. ఆఖరి బంతికి అక్షర్ పటేల్‌ను పెవిలియన్ చేర్చి ఐదు వికెట్ల ఘనతను అందుకున్నాడు. ఆఖరి ఓవర్లో అర్ష్‌దీప్‌సింగ్ రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరగడంతో మరో 3బంతులు మిగిలి ఉండగానే భారత్ ఇన్నింగ్స్ ముగిసింది.

# అభిషేక్ శర్మ 'సిక్స్'ల రికార్డ్

టీమిండియా విధ్వంసకర ఓపెనర్ అభిషేక్ శర్మ చరిత్ర సృష్టించాడు. ఒకే క్యాలండర్ ఇయర్‌లో అత్యధిక సిక్స్‌లు బాదిన ఆటగాడిగా నిలిచాడు. ఈ క్రమంలో సూర్యకుమార్ యాదవ్ పేరిట ఉన్న ఈ రికార్డ్‌ను అధిగమించాడు. వెస్టిండీస్‌తో ఉప్పల్ వేదికగా జరిగిన నాలుగో టి–20లో షమార్ స్ప్రింగర్ వేసిన 9వ ఓవర్‌లో అభిషేక్ శర్మ సిక్స్ బాదడం ద్వారా ఈ ఫీట్ సాధించాడు. ఈ ఏడాది అభిషేక్ శర్మ ఇప్పటి వరకు 69 సిక్స్‌లు బాదాడు. 2022లో సూర్యకుమార్ యాదవ్ 68 సిక్స్‌లతో టాప్‌లో ఉండగా.. అభిషేక్ శర్మ తాజాగా అధిగమించాడు. 2025లో అభిషేక్ శర్మ 54 సిక్స్‌లతో టాప్‌లో నిలవగా.. ఇషాన్ కిషన్ ఈ ఏడాది 52 సిక్స్‌లతో రేసులో ఉన్నాడు. షాహిబ్జాద ఫర్హాన్ 2025లో 45 సిక్స్‌లు బాది ఈ జాబితాలో కొనసాగుతున్నాడు. అంతర్జాతీయ టి–20ల్లో ఇప్పటికే 100 సిక్స్‌ల మైలురాయి అందుకున్న అభిషేక్ శర్మ.. 68 ఇన్నింగ్స్‌లలో మొత్తం 102 సిక్స్‌లు బాదాడు. అయితే నాలుగో టి20లో అభిషేక్ శర్మ తన జోరును కొనసాగించలేకపోయాడు. తన శైలికి భిన్నంగా ఆడిన అభిషేక్ 24 బంతుల్లో 29 పరుగులు చేసి వెనుదిరిగాడు.

## పోటీ కోసం బ్రెయిన్

(యుపిఎస్‌సి, గ్రూప్స్‌కు సిద్ధమవుతున్న వారికోసం)

### జీవశాస్త్రం పర్యావరణ శాస్త్రం అంతరిక్ష శాస్త్రం

జీవశాస్త్రం

- జీవుల ప్రాథమిక నిర్మాణ, క్రియాత్మక ప్రమాణం ఏది?
  సమాధానం: కణం.
- కణంలోని జన్యు సమాచారాన్ని ప్రధానంగా మోసుకెళ్లేది ఏది?
  డిఎన్ఎ.
- డిఎన్ఎ పూర్తి రూపం ఏమిటి?
  డియాక్సీరిబోన్యూక్లెయిక్ యాసిడ్.
- ఆర్ఎన్ఎ పూర్తి రూపం ఏమిటి?
  రిబోన్యూక్లెయిక్ యాసిడ్.
- కణంలోని శక్తి కేంద్రంగా దేనిని పిలుస్తారు?
  మైటోకాండ్రియా.
- మొక్కల్లో కిరణజన్య సంయోగక్రియ ప్రధానంగా ఎక్కడ జరుగుతుంది?
  క్లోరోప్లాస్ట్‌లో.
- మొక్కలకు ఆకుపచ్చ రంగును ఇచ్చే వర్ణద్రవ్యం ఏది?
  క్లోరోఫిల్.
- మానవ శరీరంలో అతిపెద్ద అవయవం ఏది?
  చర్మం.
- మానవ శరీరంలో అతిపెద్ద అంతర్గత అవయవం ఏది?
  కాలేయం.
- మానవ గుండెలో ఎన్ని గదులు ఉంటాయి?
  నాలుగు.
- ఎర్ర రక్త కణాల ప్రధాన పని ఏమిటి?
  ఆక్సిజన్ను రవాణా చేయడం.
- హిమోగ్లోబిన్లో ప్రధానంగా ఉండే లోహం ఏది?
  ఇనుము.
- మానవ శరీరంలో ఇన్సులిన్ను ఉత్పత్తి చేసే అవయవం ఏది?
  ప్యాంక్రియాస్.
- విటమిన్ 'సి' లోపం వల్ల వచ్చే వ్యాధి ఏది?
  స్కర్వీ.
- విటమిన్ 'బి' లోపం వల్ల వచ్చే వ్యాధి ఏది?
  బెరిబెరి.
- రక్తం గడ్డకట్టడంలో సహాయపడే విటమిన్ ఏది?
  విటమిన్ 'కె'.
- మలేరియాకు కారణమయ్యే పరాన్నజీవి ఏది?
  ప్లాస్మోడియం.
- మలేరియాను వ్యాప్తి చేసే దోమ ఏది?
  ఆడ అనోఫిలిస్ దోమ.
- క్షయవ్యాధి (టిబి)కి కారణమయ్యే బ్యాక్టీరియా ఏది?
  Mycobacterium tuberculosis.
- ఎయిడ్స్‌కు కారణమయ్యే వైరస్ ఏది?
  హెచ్ఐవి.
- టీకాలు ప్రధానంగా ఏ వ్యవస్థను ప్రేరేపిస్తాయి?
  రోగనిరోధక వ్యవస్థ.
- యాంటీబయాటిక్స్ ప్రధానంగా దేనిపై పనిచేస్తాయి?
  బ్యాక్టీరియా, వైరస్‌లపై సాధారణంగా పనిచేయవు.
- మానవ శరీరంలో సాధారణంగా ఎన్ని జతల క్రోమోజోములు ఉంటాయి?
  23 జతలు.
- జన్యుశాస్త్ర పితామహుడిగా ఎవరిని పిలుస్తారు?
  గ్రెగర్ మెండల్.

పర్యావరణ శాస్త్రం

- గ్లోబల్ వార్మింగ్‌కు ప్రధాన కారణమైన గ్రీన్‌హౌస్ వాయువుల్లో ఒకటి ఏది?
  కార్బన్ డయాక్సైడ్.
- ఓజోన్ పొర ప్రధానంగా ఏ వాయుమండల పొరలో ఉంది?
  స్ట్రాటోస్ఫియర్.
- ఓజోన్ పొర మనలను దేనినుంచి రక్షిస్తుంది?
  హానికరమైన అతినీలలోహిత (యువి) కిరణాల నుంచి.
- ఆమ్ల వర్షాలకు ప్రధాన కారణమైన వాయువులు ఏవి?
  సల్ఫర్ డయాక్సైడ్ మరియు నైట్రోజన్ ఆక్సైడ్‌లు.
- పునరుత్పాదక శక్తికి ఒక ఉదాహరణ చెప్పండి.
  సౌర శక్తి.
- బయోమాస్ శక్తి ఏ వనరుపై ఆధారపడి ఉంటుంది?
  జీవ పదార్థాలపై.
- యూట్రోఫికేషన్కు ప్రధాన కారణం ఏమిటి?
  నీటిలో నైట్రోజన్, ఫాస్ఫరస్ వంటి పోషక లవణాలు అధికంగా చేరడం.
- జీవ వైవిధ్యం అంటే ఏమిటి?
  జీవుల, వాటి జన్యువుల, పర్యావరణ వ్యవస్థల వైవిధ్యం.
- ఆహార గొలుసులో ఉత్పత్తిదారులు సాధారణంగా ఎవరు?
  ఆకుపచ్చ మొక్కలు మరియు ఇతర స్వపోషక జీవులు.




- కార్బన్ చక్రంలో మొక్కలు కార్బన్ డయాక్సైడ్‌ను ఏ ప్రక్రియలో గ్రహిస్తాయి?
  కిరణజన్య సంయోగక్రియలో.

అంతరిక్ష శాస్త్రం

- సౌర కుటుంబంలో అతిపెద్ద గ్రహం ఏది?
  గురుడు (జూపిటర్).
- సౌర కుటుంబంలో సూర్యునికి అత్యంత సమీపంలోని గ్రహం ఏది?
  బుధుడు.
- ఎర్ర గ్రహంగా ఏ గ్రహాన్ని పిలుస్తారు?
  అంగారకుడు (మార్స్).
- భూమికి సహజ ఉపగ్రహం ఏది?
  చంద్రుడు.
- సూర్యుని చుట్టూ భూమి ఒకసారి తిరగడానికి సుమారు ఎంత సమయం పడుతుంది?
  365 రోజులు.
- భూమి తన అక్షం చుట్టూ ఒకసారి తిరగడానికి సుమారు ఎంత సమయం పడుతుంది?
  24 గంటలు.
- సూర్యుడు ప్రధానంగా ఏ రెండు మూలకాలతో కూడి ఉన్నాడు?
  హైడ్రోజన్ మరియు హీలియం.
- చంద్రుడిపై మొదట అడుగుపెట్టిన వ్యక్తి ఎవరు?
  నీల్ ఆర్మ్స్ట్రాంగ్.
- భారతదేశపు తొలి కృత్రిమ ఉపగ్రహం ఏది?
  ఆర్యభట.

# ఆర్థిక ఇబ్బందుల్లో చేనేత కార్మికులు

నేతన్న భరోసా, త్రిఫ్ట్ ఫండ్ నిధులు వెంటనే విడుదల చేయాలి

చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వెంకట్రాములు డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** చేనేత కార్మికులు ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నారని, వారి సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన నేతన్న భరోసా, త్రిఫ్ట్ ఫండ్ పథకాల నిధులను వెంటనే విడుదల చేయాలని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు డిమాండ్ చేశారు. త్రిఫ్ట్ ఫండ్ పథకానికి 18 నెలలుగా నిధులు విడుదల చేయకపోవడంతో కార్మికులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం హైదరాబాద్‌లో తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం ధనంజయ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో వెంకట్రాములు మాట్లాడుతూ చేనేత కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం గా వ్యవహరిస్తోందని విమర్శించారు. సహకార సంఘాల క్యాష్ క్రెడిట్ రుణాలను రద్దు చేసి, తిరిగి వడ్డీలేని రుణాలు అందించాలని కోరారు. ప్రభుత్వ సంస్థలకు అవసరమైన చేనేత వస్త్రాల కోసం ముందుగానే టెస్కోకు ఆర్డర్లు ఇచ్చి కార్మికులకు నిరంతర పని కల్పించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా కూలీ రేట్లు పెంచాలని డిమాండ్ చేశారు. 50 ఏళ్లు నిండిన చేనేత కార్మికులందరికీ నెలకు రూ.5వేలు పింఛన్ ఇవ్వాలని కోరారు. ప్రధాన కార్యదర్శి పాసికంటి లక్ష్మీ నరసయ్య మాట్లాడుతూ టెస్కోకు ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించాలని, చేనేత రంగానికి బడ్జెట్ కేటాయింపులు పెంచాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో సంఘం నాయకులు కోట రాజయ్య, మెరుగు చంద్రప్రకాష్, కె.బాలమోహన్, గోపయ్య, సత్తయ్య, వెంకటేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# 'ఇందిరమ్మ'లో రాజకీయ వివక్ష

లాటరీ పద్ధతిలో నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేయాలి

22న కలెక్టరేట్ వద్ద సర్పంచ్‌లతో కలిసి ఆందోళన : విపక్షాల నిర్ణయం

**ప్రజాపక్షం/ఖమ్మం :** ఇందిరమ్మ పథకం లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ వివక్ష చూపుతున్నారని, నిజమైన లబ్ధిదారులకు అన్యాయం జరుగుతుందని విపక్షాలు ఆరోపించాయి. లాటరీ పద్ధతిలో లబ్ధిదారులను ఎంపిక చేయాలని డిమాండ్ చేశాయి. సిపిఐ, సిపిఎం, బిఆర్ఎస్, సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీల సంయుక్త సమావేశం గురువారం జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో జరిగింది. సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఇందిరమ్మ పథకం లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి సరైంది కాదని, కండువ కప్పుకున్న కాంగ్రెస్ కార్యకర్తలనే లబ్ధిదారులుగా ఎంపిక చేస్తున్నారని నేతలు ఆరోపించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన నిబంధనలను పట్టించుకోవడం లేదని, కాంగ్రెస్ కార్యకర్తలు ఇచ్చిన జాబితాలనే ఆమోదిస్తున్నారని, అధికారులు ఆ జాబితాలో అనర్హులు ఉన్నా పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఈ తీరు మార్చుకోవాలని వారు హెచ్చరించారు. ఈనెల 22న సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, కలిసివచ్చే పార్టీలతో కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది. ఆందోళనకు ప్రజాప్రతినిధులు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, జెడ్పి మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి సివై పుల్లయ్య, నాయకులు యర్రా బాబు, బెల్లం వేణు, ఆవుల అశోక్, శింగు నర్సింహారావు, పర్సా రాంచందర్ రావు, బానోత్ కొండ, శివరామకృష్ణ, తాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# సాగుకు నీటి గండం

పంటల బీమా పథకం లేక రైతుల ఇబ్బందులు

రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ

**ప్రజాపక్షం/కొణిజర్ల:** ఎల్ నినో ప్రభావంతో సాగుకు నీటిగండం ఏర్పడుతుందని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ తెలిపారు. గురువారం ఖమ్మం జిల్లా కొణిజర్ల మండల పరిధిలోని తనికెళ్ల గ్రామంలో రైతు సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పశ్య పద్మ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో వర్షపాతం తక్కువగా నమోదు కావడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎల్ నినో ప్రభావ పరిస్థితుల నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రణాళికాబద్ధంగా కరువు నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో కరువు పరిస్థితులు ఏర్పడ్డాయని, నీళ్లు లేక పంటలు ఎండిపోతున్నాయన్నారు. బోర్లలో నీరు ఉన్నా కరెంటు కోతలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్రంలో పంటల బీమా పథకం లేక రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. రైతు బీమా పథకాన్ని కొనసాగించాలని కోరారు. సీతారామ ప్రాజెక్టు నిర్మాణ పనులను పూర్తి చేసి పాలేరుకు గోదావరి జలాలను అనుసంధానం చేయాలన్నారు. ప్రస్తుత రబీ సీజన్‌కు ప్రభుత్వ సూచనలను పాటిస్తూ పంటల సాగు చేపట్టాలన్నారు. రూ.రెండు లక్షలకు పైగా ఉన్న రుణమాఫీని తక్షణమే అమలు చేయాలన్నారు. కరువు పరిస్థితుల్లో రైతులకు 14 రకాల నిత్యావసర వస్తువులను పంపిణీ చేయాలన్నారు. విబి జీ రాంజీ పథకాన్ని వ్యవసాయ అవసరాలకు ఉపయోగపడేవిధంగా చూడాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి రైతు సంఘం ఆధ్వర్యంలో గ్రామ గ్రామా న రైతులను చైతన్యవంతులను చేసి పోరాటాలకు సిద్ధం చేయాలని పశ్య పద్మ కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్, సిపిఐ మండల కార్యదర్శి గడల భాస్కర్, రైతు సంఘం నాయకులు పెదమాళ్ల రత్తయ్య, దేరంగుల లక్ష్మయ్య, యాసా వెంకటేశ్వర్లు, గోపాలరావు, నర్సారావు, అడపా కృష్ణయ్య, వెంకన్న, దేరంగుల వెంకన్న, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల సమస్యలు

# వెంటనే పరిష్కరించండి : ఎఐటియుసి

**ప్రజాపక్షం/ఖమ్మం :** ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివక్ష విడనాడి వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎఐటియుసి జాతీయ సమితి సభ్యుడు శింగు నర్సింహారావు డిమాండ్ చేశారు. ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేందుకు పాలకులు తాత్సరం చేస్తున్నారని ప్రధానమైన రంగాలకు సంబంధించిన ఉద్యోగుల సమస్యల పట్ల సానుకూల వైఖరి ప్రదర్శించడం లేదని ఆయన ఆరోపించారు. గురువారం ఖమ్మం కలెక్టరేట్ వద్ద గల ధర్నాచౌక్‌లో సమ్మె చేస్తున్న ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల సమ్మెకు ఏఐటియుసి పక్షాన సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా నర్సింహారావు మాట్లాడుతూ వైద్య రంగంలో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ పేరుతో ఉద్యోగులను నియమించి సమాన పనికి సమాన వేతనం ఇవ్వకుండా శ్రమ దోపిడీకి పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. దేశవ్యాప్తంగా ఎన్‌హెచ్ఎంలో 17 లక్షల మంది పనిచేస్తుండగా తెలంగాణలో 17 వేల మంది ఉద్యోగులు, కార్మికులు దశాబ్దకాలంగా పనిచేస్తున్నారని శింగు నర్సింహారావు తెలిపారు. వీరి భవిష్యత్తును పాలకులు అంధకారంగా మార్చారని గత్యంతరం లేక శ్రమ దోపిడీకి గురవుతున్నారని వీరికి కనీసం పిఎఫ్, ఇఎస్ఐ తదితర చట్టబద్ధ హక్కులు ఏవి అమలు కావడం లేదని ఆయన తెలిపారు. కనీసం హెల్త్ కార్డులు కూడా లేవని కొన్ని రాష్ట్రాలు వీరిని పర్మినెంట్ చేశారని రాష్ట్రంలో కూడా పర్మినెంట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఉద్యోగులను బెదిరించడం సరికాదన్నారు. మద్దతు తెలియజేసిన వారిలో ఎఐటియుసి జిల్లా గౌరవాధ్యక్షులు గాదె లక్ష్మి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

**రాజన్న సిరిసిల్ల :** నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్ఎం)లో పనిచేస్తున్న వారందరినీ రెగ్యులర్ చేయాలని జిల్లాకేంద్రంలో మూడు రోజుల నుంచి ఉద్యోగులు, కార్మికులు రిలే నిరాహార దీక్ష చేస్తున్నారు. ఈ దీక్షకు గురువారం ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ప్రమాద భీమా సౌకర్యం కల్పించాలని, హెల్త్‌కార్డులు ఇవ్వాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హామీలతో కమిటీలతో కాలయాపన చేస్తున్నాయని విమర్శించారు. ఎన్‌హెచ్ఎంలను గుర్తించి వారికి న్యాయం చేయడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఎన్‌హెచ్ఎంలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, వారి సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.

# మున్సిపల్ కార్మికుల వేతనాలు చెల్లించాలి

సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జైపాల్‌రెడ్డి డిమాండ్

**ప్రజాపక్షం/వరంగల్ :** మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుధ్య, ఇతర ఎన్ఎంఆర్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న రెండు నెలల బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని ఎఐటియూసి అనుబంధ తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్, కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వానంపల్లి జైపాల్ రెడ్డి అన్నారు. గురువారం వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ గణేష్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సంపేట మున్సిపాలిటిలో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు రెండునెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉండటంతో వారి కుటుంబాలు ఆర్థికఇబ్బందులు ఎదుర్కొంటున్నాయన్నారు. కార్మికుల కుటుంబాల జీవనోపాధిని దృష్టిలో ఉంచుకుని, సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి పెండింగ్‌లో ఉన్న రెండు నెలల వేతనాలను విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర సహ కార్యదర్శి వేల్పుల సారంగపాణి యాదవ్, నర్సంపేట మున్సిపాలిటీ కార్మికులు పాల్గొన్నారు.

## పట్టభద్రుల నియోజకవర్గ ఓటరు నమోదుకు రాజకీయ పార్టీలు సహకరించాలి

నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

**ప్రజాపక్షం/నల్లగొండ :** వరంగల్ఖమ్మంనల్లగొండ పట్టభద్రుల ఓటరు నమోదు వేగవంతం చేసేందుకు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ కోరారు.గురువారం ఆయన కలెక్టరేట్లోని తన ఛాంబర్లో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో వరంగల్ఖమ్మంనల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు,ఎస్ఐఆర్ ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎస్ ఐఆర్ ప్రక్రియలో ఇంకా 2,195 మంది ఓటర్లకు సంబంధించిన ధ్రువపత్రాల పరిశీలన పెండింగ్లో ఉందని, వాటిని ఇంటింటికీ వెళ్లి పరిశీలించి శుక్రవారం నాటికి పూర్తి చేయాలని తహసీల్దార్లు, బీఎల్ఓలను ఆదేశించినట్లు తెలిపారు.ఎన్నికల కమిషన్ సూచనల మేరకు ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు,తొలగింపుల ప్రక్రియ చేపడుతున్నట్లు తెలిపారు.ఓటరు జాబితా నుండి తొలగించబడిన వారు తిరిగి ఓటు హక్కు పొందేందుకు ఫారం6 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.అక్టోబర్ 15,16 తేదీల్లో పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఓటర్ల తొలగింపు విషయంలో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. మరణించిన ఓటర్ల పేర్ల తొలగింపునకు సంబంధిత ధ్రువీకరణ పత్రాలు, నోటీసులు, బీఎల్ఓ నివేదిక తదితర ప్రక్రియలను అనుసరిస్తున్నట్లు తెలిపారు.ఈ సమావేశానికి రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్,జిల్లా రెవెన్యూ అధికారి దశరథ, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## అక్రమంగా మైనింగ్ తవ్వకాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం

వెంటనే నిలిపివేయాలని నిరాహార దీక్షలు

**ప్రజాపక్షం/దేవరకొండ:** దేవరకొండ మండలంలోని కాచారం గ్రామంలో నిర్వహిస్తున్న అక్రమ మైనింగ్ను తక్షణమే నిలిపివేయాలని సిపిఐ దేవరకొండ మండల సహాయ కార్యదర్శి నూనె రామస్వామి అన్నారు. గురువారం గ్రామ ప్రజల ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా నిరహార దీక్ష చేస్తున్న వారికి సిపిఐ ఆధ్వర్యంలో సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా రామస్వామి మాట్లాడుతూ సర్వే నెంబర్ 13లోని 183 ఎకరాలు పలుగురాయితో కూడిన గుట్టమైనింగ్ ఉందని, ఇందులో గ్రామంలోని రైతులకు పట్టాలిచ్చారని నవభారత్ కంపెనీ వారు 1987లో మొదటి దశ పనులు 1997 వరకు మొదటి దశ పనులు ముగిశాయని, అయిన 1999 నుండి 2017 వరకు తవ్వకాలు నిర్వహించారని ఈ మైనింగ్ వలన గ్రామాల్లో మంచినీరు కలుషితం అయి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పీల్చే గాలిలో కూడా ఆ పౌడర్ రావడంతో ఊపిరితిత్తులకు చేరి ప్రజలు రోగాల బారిన పడుతున్నారని, గాలి కలుషితం అవుతున్నందున గుట్ట చుట్టూ గ్రీన్ బౌండరీ చేస్తామని చెప్పిన కంపెనీ దానిని పట్టించుకోలేదని, గ్రామానికి కావాల్సిన అభివృద్ధి చేస్తామని చెప్పి ఏమి చేయలేదని అన్నారు. ప్రజలు రోగాల బారిన పడుతున్నా బ్లాస్టింగ్ చేయడం వల్ల భూమి కదిలి బోర్లు, బావులు ఎండిపోతున్నాయని ప్రభుత్వం మైనింగ్ లీజును రద్దు చేసి గ్రామ పంచాయతీకి అప్పగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిసి సంఘం నియోజకవర్గ నాయకులు చింతపల్లి శ్రీనివాస్గౌడ్, ఏఐటీయూసీ మండల కార్యదర్శి మల్లయ్య, గ్రామ సర్పంచ్ శామలయ్య, ఉప సర్పంచ్ మల్లేష్, అరుణ, సాలయ్య, సరిత, సైదయ్య, సీనయ్య, బాలకృష్ణ, జంగయ్య, పెద్దమ్మ, ప్రేమ్సాగర్, మస్తాన్, అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

## డిండి ప్రాజెక్టు పూర్తి చేయకుండా రైతులను మోసం చేస్తున్న ప్రభుత్వం

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్.అంజయ్య చారి

**ప్రజాపక్షం/నాంపల్లి :** డిండి ఎత్తిపోతల పథకాల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.అంజయ్య చారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు డిండి ఎత్తిపోతల పథకాల పనులను పూర్తి చేయకపోవడంతో మునుగోడు, దేవరకొండ,నల్లగొండ రైతాంగానికి సాగునీరు అందక తీవ్ర నష్టం జరిగిందని,ఈ ప్రభుత్వం కూడా డిండి ప్రాజెక్టు పనులను పూర్తి చేయకుండా రైతులను మోసం చేస్తోందని మండిపడ్డారు.ఎల్ నినో ప్రభావం వల్ల రైతుల పంటలకు సాగునీరు లేక, బోర్ వాటర్ తగ్గడం వల్ల భూగర్భ జలాలు పడిపోవడంతో రైతులు పంట సాగుకు నీరు అందక తీవ్ర నష్టంలోకి కూరుకుపోతుంటే,మునుగోడు,దేవరకొండ,నల్లగొండ ప్రాంతాలకు సాగునీరు అందించకుండా పాలమూరురంగారెడ్డి జిల్లాలకు రెండు పంపులు ఓపెన్ చేసి సాగునీరు అందించడం దారుణమని విమర్శించా రు. రాష్ట్ర ప్రభుత్వం ఇకనైనా స్పందించి డిండి ఎత్తిపోతల పథకాల పనులను త్వరితగతిన పూర్తి చేయకపోతే ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

## ప్రభుత్వ భూముల్లో గుడిసెలు కూల్చివేత

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** పోచంపల్లి మండలం జలాల్ పురం గ్రామంలోని సర్వే నంబర్ 80లో ఆ గ్రామ ప్రజలు అక్రమంగా వేసుకున్న గుడిసెలను గురువారం రెవెన్యూ అధికారులు పోలీసులు జేసిబీలతో కూల్చివేశారు.ప్రభుత్వ భూముల్లో ఎవరైనా సరే ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలతో పాటు చట్టరిత్య నేరాలుగా పరిగణించి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.తహసీల్దారు ,సిఐ,ఎస్సై సంయుక్తంగా చేపట్టిన కూల్చివేతలో 12 తాత్కాలిక నిర్మాణాలని నేలమట్టం చేసినట్లు వివరాలు వెల్లడించారు. కూల్చివేత సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అదనపు పోలీసులను దింపారు.న్యాయబద్ధంగా పట్టాలు,రిజిస్ట్రేషన్ ఉన్న స్థలాల్లో యధేచ్ఛగా ఇంటి నిర్మాణాలు చేపడితే ఎలాంటి ఇబ్బంది ఉండదని తెలిపారు.

# నాణ్యమైన పత్తితో మద్దతు ధర

సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** రైతులు నాణ్యమైన పత్తిని ఉత్పత్తి చేసి, ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర పొందేలా తగిన జాగ్రత్తలు పాటించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సూచించారు. పత్తిసాగు, కోత, నిల్వ, విక్రయ ప్రక్రియల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తేనే ఆశించిన మద్దతు ధర లభిస్తుందని స్పష్టం చేశారు. రైతులు తమ పత్తిని మార్కెట్కు తీసుకువచ్చే ముందు తేమశాతం, పొడవు, మైక్రోనైర్ విలువ వంటి ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. పత్తిలో తేమ గరిష్ఠంగా 8 శాతం మాత్రమే ఉండేలా బాగా ఆరబెట్టాలని, పత్తిలో ఆకులు, చెత్త, ఇతర వ్యర్థ పదార్థాలు కలవకుండా పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. పత్తి విక్రయాల్లో రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోవద్దని, ప్రభుత్వ కొనుగోలు విధానాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. కొనుగోలు ప్రక్రియలో ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే స్థానిక వ్యవసాయ శాఖ అధికారులను గానీ, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను గానీ సంప్రదించాలని కోరారు. రైతుల సంక్షేమం, నాణ్యమైన పత్తి ఉత్పత్తి, సరైన ధర కల్పించడమే లక్ష్యంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పి కె. నరసింహ, అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, సూర్యాపేట, కోదాడ, హుజూర్నగర్ ఆర్డిఓలు వేణుమాధవరావు, సూర్యనారాయణ, శ్రీనివాసులు, ఆర్టిటిఓ పురుషోత్తం రెడ్డి, డిఎంఓ హార్టికల్చర్ ఆఫీసర్ నాగయ్య, ఏసిపిలు, కార్యదర్శులు, మిల్లర్లు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**రాజకీయ పార్టీల ప్రతినిధులు ఓటరు నమోదు ప్రక్రియకు సహకరించాలి**

రాజకీయ పార్టీల ప్రతినిధులు ఓటరు నమోదు ప్రక్రియకు సహకరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ కోరారు. గురువారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన రాజకీయ పార్టీల సమావేశంలో జిల్లా కలెక్టర్, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై ఓటరు నమోదు ప్రక్రియ, ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ పురోగతి, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 15, 16 తేదీల్లో నిర్వహించే ప్రత్యేక ప్రచార దినాల్లో ఆయా రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లు చురుకుగా పాల్గొన్నాలన్నారు. అర్హులైన కొత్త ఓటర్ల నమోదు కోసం ఫారం 6 నింపడంలో సంబంధిత అధికారులకు, ఓటర్లకు సహకరించాలని కోరారు.

# అంధకారంలో బతుకమ్మ సంబరాలు

జిల్లా కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్..
కార్ల లైట్ల వెలుగులోనే మహిళల ఆటపాటలు
ఎన్జి కళాశాల మైదానంలో కనీస సౌకర్యాలు కరువు..
మహిళల ఆత్మగౌరవ పండుగకు అధికారుల నిర్లక్ష్యం

**ప్రజాపక్షం/నల్లగొండ:** తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.మహిళలు ఎంతో భక్తిశ్రద్ధలతో,ఉత్సాహంగా జరుపుకునే బతుకమ్మ సంబరాలకు కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో నల్లగొండ జిల్లా కేంద్రంలో వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ, చేనేత,జౌళి శాఖ, వెటర్నరీ శాఖ, మున్సిపాలిటీ, మెప్మా ఆధ్వర్యంలో ఈ సంబరాలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్ హాజరై బతుకమ్మ సంబరాలను ప్రారంభించారు,వేడుకలు అస్తవ్యస్తంగా మారాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నాగార్జున ప్రభుత్వ కళాశాల మైదానంలో మహిళలు చీకట్లో,కార్ల లైట్ల వెలుగులో బతుకమ్మ ఆడాల్సిన దుస్థితి నెలకొనడం అధికారుల పనితీరుకు అద్దం పడుతోంది.

**జిల్లాకలెక్టర్ ఆదేశాలు బేఖాతర్** : బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించడంతోపాటు మహిళలకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలనే ఉన్నతాధికారుల ఆదేశాలు క్షేత్రస్థాయిలో అమలవుతున్నాయా లేదా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో రోజువారీగా వేడుకలు నిర్వహించేందుకు షెడ్యూల్ రూపొందించినప్పటికీ,అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయడంలో సంబంధిత అధికారులు విఫలమయ్యారనే విమర్శలు వస్తున్నాయి. కార్యక్రమం ఎప్పుడు నిర్వహించాలి,ఎవరు పాల్గొంటారు అనే విషయాలపై దృష్టి పెట్టిన అధికారులు మహిళలకు అవసరమైన కనీస వసతుల గురించి పట్టించుకోలేదనే అసంతృప్తి వ్యక్తమవుతోంది.

## రోడ్డు నిబంధనలు పాటిస్తూ ప్రమాదాలు నివారించాలి

కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా ఎస్పి

**ప్రజాపక్షం/సూర్యాపేట :** ప్రతి ఒక్క ప్రయాణికుడు రోడ్డు నిబంధనలను పాటిస్తూ రోడ్డు ప్రమాదాలను నివారించాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా ఎస్పి కె. నరసింహ సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సూర్యాపేట పట్టణంలోని అంజనాపురి చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన ప్రమాద హెచ్చరిక బోర్డులను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సూర్యాపేట జిల్లాలో రహదారి భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నివారణలో భాగంగా జిల్లా పోలీస్ శాఖ అనేక చర్యలు చేపడుతున్నారని అన్నారు. జిల్లా వ్యాప్తంగా రహదారి ప్రమాదాలను అరికట్టడానికి, ప్రయాణికుల భద్రతను మెరుగుపరచడానికి జిల్లా యంత్రాంగం, పోలీస్ శాఖ సంయుక్తంగా ముమ్మర చర్యలు చేపడుతుందన్నారు. నిత్యం ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న సుమారు 45 కంటే ఎక్కువ బ్లాక్ స్పాట్స్ లొకేషన్లను పోలీస్ యంత్రాంగం ప్రత్యేకంగా గుర్తించిందన్నారు. ప్రమాదాలు ఎదురైతే వెంటనే సహాయం పొందేందుకు 112 నంబర్ అందుబాటులో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్పిలు ప్రసన్న కుమార్, శ్రీనివాస్ రెడ్డి, సూర్యాపేట పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటయ్య, రూరల్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యుత్ అధికారుల ప్రజాబాట

**ప్రజాపక్షం/పెన్పహాడ్ :** మండల కేంద్రంలో గురువారం విద్యుత్ శాఖ అధికారులు ప్రజాబాట కార్యక్రమంలో భాగంగా విస్తృతంగా పర్యటించారు. గ్రామంలోని వివిధ వీధులు, వార్డులను సందర్శించి విద్యుత్ సరఫరా తీరును, స్థానిక సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యుత్ ఏఈ శ్రీనివాస్ మాట్లాడుతూ వినియోగదారుల విద్యుత్ సమస్యలను తక్షణమే పరిష్కరించడమే ధ్యేయంగా విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, లోఓల్టేజి సమస్యలు, లూజ్ వైర్లు, పాడైపోయిన విద్యుత్ స్తంభాలు ఎక్కడైనా ఉంటే వెంటనే తమ సిబ్బంది దృష్టికి తీసుకురావాలని కోరారు. లైన్ ఇన్స్పెక్టర్ పాల్వాయి నాగయ్య, సెకండ్ లైన్ ఇన్స్పెక్టర్ సమ్మయ్య, లైన్మెన్ సురేందర్ రెడ్డి, శ్రీకృష్ణ పాల్గొన్నారు.

## కల్వర్ట్ పై నుండి పడి యువకుడు మృతి

**ప్రజాపక్షం/చివ్వెంల :** ప్రమాదవశాత్తు కాలువ కల్వర్ట్ మీద నుండి పడి యువకుడు మృతి చెందిన సంఘటన గురువారం మండలంలోని ఉంద్రుగొండ సమీపంలోని స్వామి నారాయణ స్కూల్ ముందు చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మోతె మండలం భళ్ళుతండకు చెందిన సపావత్ ఉపేందర్ (24) తన స్నేహితులతో కలిసి కూర్చొని ఉండగా, ప్రమాదవశాత్తు కాలువలో పడి గాయాలు కాగా వెంటనే అతనిని 108 అంబులెన్స్ ద్వారా సూర్యాపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించినట్లు వివరించారు. మృతుని తండ్రి వాంకుడోతు సైదులు ఫిర్యాదు మేరకు చివ్వెంల ఎస్ఐ వి. మహేశ్వర్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించడం జరిగినట్లు తెలిపారు.

## వైటిపిఎస్ స్టేజ్-1 చీఫ్ ఇంజనీర్ సురేష్ సస్పెన్షన్

విధుల్లో నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపాలపై జెన్కో సిఎండి వేటు
ఉత్తర్వులు జారీ చేసిన జెన్కో సిఎండి డాక్టర్ హరీశ్

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** దామరచర్ల మండలంలో నిర్మిస్తున్న యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (వైటీపీఎస్) స్టేజ్1 (5X800 మెగావాట్లు) ప్రాజెక్టు పనుల్లో తీవ్ర నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపాలు ప్రదర్శించినందుకుగాను వైటీపీఎస్ (కన్స్ట్రక్షన్) స్టేజ్1 ఇన్చార్జ్ చీఫ్ ఇంజనీర్ బి.సురేష్ను సస్పెండ్ చేస్తూ జెన్కో చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.హరీశ్ ఐఏఎస్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. గత రెండు నెలలుగా జెన్కో సీఎండీ, డైరెక్టర్ (థర్మల్ అండ్ ప్రాజెక్ట్స్), ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ల పర్యవేక్షణలో వైటీపీఎస్ జనరేషన్ పనితీరుపై క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహిస్తున్నారు. నాణ్యమైన విద్యుత్ ఉత్పత్తిని పూర్తి లోడ్ సామర్థ్యంతో సాధించడం, స్టేజ్1 యూనిట్ల పనితీరు ప్రమాణాలను మెరుగుపరచడంపై ప్రత్యేక దృష్టి సారించారు. అంతేకాకుండా, గత 15 రోజులుగా ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శితో పాటు జెన్కో అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 14న ఉదయం 09:00 గంటలకు నిర్వహించిన జనరేషన్ పనితీరు సమీక్ష సమావేశంలో చీఫ్ ఇంజనీర్ (ఐ/సి) బి. సురేష్ తన విధుల్లో తీవ్రమైన నిర్లక్ష్యం ప్రదర్శించినట్లు గుర్తించారు. విద్యుత్ ఉత్పత్తిని మెరుగుపరచడంలో ప్రాధాన్యతా పనుల ప్రణాళిక, పర్యవేక్షణ మరియు అమలులో సీఈ హోదాలో ఉండి బాధ్యతగా వ్యవహరించడంలో విఫలమైనట్లు తేలింది.ఏపీఎస్ఈబీ (సవరించిన) కండక్ట్ రెగ్యులేషన్స్, ఎంప్లాయీస్ డీ అండ్ ఏ రెగ్యులేషన్స్ నిబంధనల ప్రకారం ఆయన పాల్పడిన చర్యలు తీవ్రమైన దుష్ప్రవర్తన కిందకు వస్తాయని ఉత్తర్వులలో పేర్కొన్నారు. తక్షణమే అమలయ్యేలా శాఖాపరమైన విచారణకు (డిపార్ట్మెంటల్ ఎంక్వైరీ) ఆదేశిస్తూ ఆయనను సస్పెండ్ చేశారు. సస్పెన్షన్ కాలంలో నిబంధనల ప్రకారం సబ్సిస్టెన్స్ అలవెన్స్ చెల్లించబడుతుందని, ముందస్తు అనుమతి లేకుండా ప్రధాన కార్యాలయమైన దామరచర్ల (వైటీపీఎస్) వదలి వెళ్లరాదని సీఎండీ ఆ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

## సాగునీరు లేక ఎండిన వరి పంటను మేస్తున్న గేదెలు

**ప్రజాపక్షం/నాంపల్లి :** ఆరుగాలం కష్టపడి పంట పండించి కుటుంబాన్ని పోషించుకోవాలన్న రైతన్న ఆశలు ఆవిరవుతున్నాయి. మండలంలోని చిట్టెంపహాడ్ గ్రామంలో వరి పంట ఎండిపోవడంతో రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు.పచ్చని పైర్లతో కళకళలాడాల్సిన వరి చేలు నేడు ఎండిపోయి కనిపిస్తుండగా, పంట పొలాల్లో గేదెలు మేస్తున్న దృశ్యాలు రైతుల దయనీయ పరిస్థితికి అద్దం పడుతున్నాయి.రైతులు అప్పులు చేసి సాగు చేసిన పంట నష్టపోవడంతో వారి కుటుంబాల ఆర్థిక పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారే ప్రమాదం ఉందని గ్రామస్తులు పేర్కొంటున్నారు.నష్టపోయిన రైతుల వివరాలను సేకరించి,ప్రభుత్వ నిబంధనల ప్రకారం తగిన సహాయం అందించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.పంట పండితేనే రైతు కుటుంబానికి పూట గడుస్తుంది.పంట ఎండిపోతే అప్పుల భారం పెరుగుతుంది. చిట్టెంపహాడ్లో ఎండిపోయిన వరి చేలు, వాటిలో గేదెలు మేస్తున్న దృశ్యాలు రైతన్న ఎదుర్కొంటున్న కష్టాలను కళ్లకు కడుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి రైతులకు అండగా నిలవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ప్రజా పోరాటాలకు పెన్నిధి కామ్రేడ్ భద్రయ్య

సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు

**ప్రజాపక్షం/కోదాడ(చిలుకూరు):** ప్రజా పోరాటాలకు పెన్నిది , పేద ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడిన గొప్ప నాయకుడు కామ్రేడ్ తాళ్లూరి భద్రయ్య అని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు కొనియాడారు. గురువారం చిలుకూరు మండలం బేతవోలు గ్రామంలో భద్రయ్య 14వ వర్ధంతి సందర్భంగా ఆయన స్తూపానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దశాబ్దాల పాటు ప్రజాప్రతినిధిగా పనిచేసిన భద్రయ్య గ్రామంలో పార్టీని బలోపేతం చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేశారన్నారు. భూ పోరాటాలు, ప్రజా ఉద్యమాల ద్వారా బడుగు, బలహీన వర్గాలకు భూములు పంచి, ఇళ్ల స్థలాలు ఇప్పించి పేదలకు అండగా నిలిచారని తెలిపారు. భద్రయ్య నాయకత్వంలో పనిచేసి తాను జిల్లా, రాష్ట్రస్థాయికి ఎదగడం గర్వంగా ఉందని గుర్తు చేసుకున్నారు. సిపిఐ గ్రామశాఖ కార్యదర్శిగా తాళ్లూరి వెంకటయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అల్వాల రాజేష్, సీనియర్ నాయకులు ఎస్కె ఖాజా మియా, దొంతగాని పెద్ద మల్లయ్య, తాళ్లూరి పెద్ద మల్లయ్య, ఎస్డి మహ్మద్, తాళ్లూరి రామారావు, టిఆర్ఎస్ మండల అధ్యక్షులు అక్కినపల్లి జానకిరామచారి, గ్రామ అధ్యక్షులు తాళ్లూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అవగాహనతోనే మోసాలకు అడ్డుకట్ట

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరగాళ్ల మోసపూరిత మాటలు నమ్మి డబ్బులు కోల్పోవద్దని సూర్యాపేట జిల్లా సైబర్ సెక్యూరిటి సెల్ డిఎస్పి ఏ. వెంకటయ్య సూచించారు. సైబర్ నేరాల నియంత్రణ, ప్రజల్లో అవగాహన పెంపొందించడంలో భాగంగా గురువారం సూర్యాపేట ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థినులకు, కోదాడ పట్టణంలో బ్యాంకర్ల సమావేశంలో బ్యాంకు అధికారులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపికె ఫైళ్ల ద్వారా జరిగే మోసాలు, లోన్, లోన్ యాప్ మోసాలు, ఉద్యోగాల పేరుతో మోసాలు, వ్యాపార, పెట్టుబడి మోసాలు, సెక్స్టార్షన్, సోషల్ మీడియా మోసాలు, డిజిటల్ అరెస్ట్ పేరుతో చేసే మోసాల గురించి వివరించారు. సైబర్ నేరగాళ్లు అనుసరిస్తున్న కొత్త పద్ధతులను గుర్తించి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ ఎం. శివకుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

## 'కోదాడ'ను కరువు నియోజకవర్గంగా ప్రకటించాలని కలెక్టర్కు మాజీ ఎమ్మెల్యే వినతి

**ప్రజాపక్షం/కోదాడ:** కోదాడ నియోజకవర్గంలో తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా ఎండిపోతున్న పంటలకు నష్టపరిహారం చెల్లించాలని, నియోజకవర్గంలోని ఆరు మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ గురువారం జిల్లా కలెక్టర్ తేజస్నంద్లాల్ పవార్ ముఖ్య నాయకులతో కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఎల్నినో ప్రభావంతో తెలంగాణ వ్యాప్తంగా రైతాంగం తీవ్ర కష్టాలు పడుతున్నప్పటికీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఏమాత్రం ముందస్తు జాగ్రత్తలు తీసుకోలేదని ఇది ముమ్మాటికి కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరువేనని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రైతులు ఎన్నో ఆశలతో పెట్టుబడులు పెట్టి, అప్పుల పాలై పంటలు సాగు చేస్తే అవి కళ్లెదుటే ఎండిపోతుంటే గుండెలు అవిసిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ పనులు లేక ఉపాధి కోల్పోయిన కూలీలకు నెలకు వేయి రూపాయల చొప్పున ఏడాదికి 12వేలు ఇస్తామన్న హామీ కూడా గాలికి కొట్టుకుపోయిందని మండిపడ్డారు. ప్రధానంగా కోదాడ నియోజకవర్గంలోని కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఆరు మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. రైతాంగానికి కూలీలకు భరోసా కల్పించాలని, లేని పక్షంలో బిఆర్ఎస్ ప్రజల పక్షాన పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో శీలం సైదులు, ఎలుగూరి వెంకటేశ్వరరావు, ఆంజనేయులు, జానకిరామచారి, తాళ్లూరి శ్రీనివాస్, భూపాల్రెడ్డి, కిరణ్కుమార్, ఉపేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## పత్తి రైతులకు అందుబాటులో శ్రీసాయి కాటన్ ఇండస్ట్రీస్

దూర ప్రాంతాలకు వెళ్లే కష్టాలకు చెక్
తొలి రోజు క్వింటాల్ పత్తికి రూ. 9,200 ధర

**ప్రజాపక్షం/చందంపేట:** నల్గొండ జిల్లా చందంపేట మండలం గన్నెర్లపల్లి గ్రామ పరిధిలో ఏర్పాటు చేసిన శ్రీ సాయి కాటన్ ఇండస్ట్రీస్ పత్తి మిల్లును గురువారం మిల్లు యజమాని తాటికొండ వెంకటనారాయణ రైతులతో కలిసి ప్రారంభించారు. ఈ పత్తి మిల్లు అందుబాటులోకి రావడంతో చందంపేట మండలంతో పాటు చుట్టుపక్కల మండలాల రైతులకు పత్తి విక్రయాల్లో ఎంతో వెసులుబాటు కలగనుంది. దూర ప్రాంతాలకు వెళ్ళాల్సిన అవసరం తగ్గడంతో పాటు రవాణా ఖర్చులు కూడా ఆదా కానున్నాయి. ఈసందర్భంగా మిల్లు యజమాని తాటికొండ వెంకటనారాయణ మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉండే విధంగా మిల్లును ఏర్పాటు చేశామని, రైతులు 50కిలోల పత్తిని కూడా తీసుకువచ్చి మిల్లులో విక్రయించవచ్చని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించడమే తమ లక్ష్యమని ఆయన తెలిపారు.

## ఆయిల్ పామ్ రైతులకు అవగాహన సదస్సు

**ప్రజాపక్షం/భీమదేవరపల్లి:**ములుకనూరు సహకార సంఘం ప్రధాన కార్యాలయంలో గురువారం ఏరిస్ ఆగ్రో లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ పంటలపై రైతు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సదస్సులో ఏరిస్ రీజినల్ మేనేజర్ రాజా రెడ్డి మాట్లాడుతూ ఆయిల్ పామ్ పంటల్లో ప్రతీ మూడు నెలలకు ఒకసారి ప్రథమ పోషకాలతో పాటు ద్వితీయ, సూక్ష్మ పోషకాలను వేసుకోవడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని తెలిపారు. బోరాన్, మెగ్నీషియం, పొటాషియం లోపాల నివారణకు ఏరిస్ కంపెనీకి చెందిన మ్యాగ్ మిక్స్, న్యూక్యాలిభోర్, ఏరిపొటాష్ ఉత్పత్తులను వాడుకోవాలని సూచించారు. నీటి యాజమాన్యం, కీటకాలు, తెగుళ్ల నివారణ పద్ధతులను వివరించారు.ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి, జనరల్ మేనేజర్ మారుపాటి రాంరెడ్డి, ఏరిస్ కంపెనీ సిబ్బంది శ్రీనివాస్, వినయ్, పున్నం, మునేందర్, రమేష్, వెంకన్న, సంఘ వ్యవసాయ అధికారులు ఎస్.శ్రీనివాస్, బి.స్వామిరావు, ఎం.అచ్యుతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బెస్తం చెరువు వద్ద పనులు వేగవంతం

**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** సద్దుల బతుకమ్మ పండగను పురస్కరించుకొని రంగశాయిపేట బెస్తం చెరువు వద్ద తగిన ఏర్పాట్లు చేయిస్తున్నామని 42వ డివిజన్ మాజీ కార్పొరేటర్ గుండు చందన పూర్ణచందర్ అన్నారు. గురువారం సద్దుల బతుకమ్మ పండగ జరిగే బెస్తం చెరువు ప్రాంతాన్ని గుండు చందన పూర్ణచందర్ సందర్శించి చేస్తున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా గుండు చందన పూర్ణచందర్ మాట్లాడుతూ బతుకమ్మలతో వచ్చే మహిళలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉండడానికి బెస్తం చెరువు మైదాన ప్రాంతంతో పాటు ఉరుసు బైపాస్ రోడ్డు వరకు వెళ్లే మెటల్ రోడ్డు మీద, ఖమ్మం రోడ్డు నాయుడు పంపు వెళ్లే మెటల్ రోడ్డు మీద డస్ట్ చల్లించడంతో పాటు పూర్తి స్థాయిలో లైటింగ్, సౌండ్ సిస్టంలను ఏర్పాటు చేయిస్తున్నామని తెలిపారు. చేస్తున్న పనులను సంబంధిత అధికారులు పర్యవేక్షించడంతో పాటు వేగవతంగా పూర్తి అయ్యేలా చూడాలని గుండు చందన పూర్ణచందర్ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో కాకతీయ సేవా సమితి అధ్యక్షుడు మండల నరసింహారాములు, శానిటరీ ఇన్స్పెక్టర్ భీమయ్య, శానిటరీ జవాన్లు అశోక్, ప్రణీత్, ప్రశాంత్, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

## బతుకమ్మ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు

**ప్రజాపక్షం/ నర్సంపేట :** తెలంగాణ మహిళల ఆత్మగౌరవానికి ప్రతీకైనా బతకమ్మ పండుగ వేడుకలను ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నామని నర్సంపేట మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీ రామానంద్ తెలిపారు. పట్టణంలోని అంగడి మైదానం తోపాటు పలు వార్డుల్లోని బతుకమ్మ ఆట స్థలాలను మున్సిపల్ కమిషనర్ కాటం భాస్కర్‌తో కలిసి చైర్ పర్సన్ శ్రీలక్ష్మీ రామానంద్ గురువారం పరిశీలించి, పనులను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బీరం భరత్ రెడ్డి, బాణాల ప్రసన్న శ్రీనివాస్, పొన్నాల మనిషా ప్రకాష్, రాయిడి కీర్తి దుష్యంత్ రెడ్డి, మండల శ్రీదేవి శ్రీనివాస్, మంచినీళ్ల నాగరాజు, సానిటేషన్ ఇన్స్పెక్టర్ కందిక స్వామి, రమేష్, మున్సిపల్ అధికారులు, మున్సిపల్ సిబ్బంది, పాల్గొన్నా రు.

## డ్రగ్స్ వద్దు... మీ కుటుంబం, మీ భవిష్యత్తే ముఖ్యం: ఎసిపి



**ప్రజాపక్షం/ కమలాపూర్:** గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలను వినియోగించి యువత భవిష్యత్తును నాశనం చేసుకోకుండా ప్రతి ఒక్కరు మీ కుటుంబం, మీ భవిష్యత్తు కోసం ఆలోచించి ముందడుగు వేయడమే ముఖ్యమని కాజీపేట ఎసిపి పింగిలి ప్రశాంత్ రెడ్డి యువతకు పిలుపునిచ్చారు. కమలాపూర్ మండలం గూడూరు గ్రామ శివారులోని మామిడి తోటలో కమలాపూర్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరైనా కాజీపేట ఎసిపి పింగిలి ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ... యువత సైబర్ క్రైమ్, డ్రగ్స్, మాదకద్రవ్యాల వంటి వాటికి పూర్తిగా దూరంగా ఉండాలని యువతకు దిశా నిర్దేశాన్ని సూచించారు. భవిష్యత్తు ఊహించుకోండి... మీరు మీ కుటుంబానికి కాక దేశానికి మీ సేవలు ఎంతో అవరం అన్నారు.ప్రతి ఒక్కరు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని ఎసిపి అన్నారు. ఈ కార్యక్రమంలో కమలాపూర్ సిఐ నవీన్, ఎస్ఐ దిలీప్, ఎస్ఐ మధు, పోలీస్ సిబ్బంది, యువత పాల్గొన్నారు.

## నాలుగు నెలల్లో రూ.60 లక్షల టర్నోవర్

**ప్రజాపక్షం/జనగామ:** మహిళా శక్తి రైతు సేవా కేంద్రాల నిర్వహణతో ఇద్దరు మహిళలు స్వయం ఉపాధిలో విజయాలు సాధిస్తున్నారు. స్టేషన్ ఘనపూర్ మండలంలోని ఇప్పగూడెం గ్రామానికి చెందిన రాధిక నాలుగు నెలల్లో రూ.40లక్షల టర్నోవర్ సాధించగా, కొడకండ్ల మండలంలోని రామవరం గ్రామానికి చెందిన ప్రియాంక రూ.20లక్షల టర్నోవర్ సాధించారు. ఉద్యోగ ప్రయత్నాలలో నిరాశ ఎదురైనా కుంగిపోకుండా రాధిక స్వయం ఉపాధిని ఎంచుకుని ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేశారు. అధికారుల ప్రోత్సాహం, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ప్రత్యేక చొరవతో రైతు సేవా కేంద్రాల నిర్వహణకు అవకాశం లభించిందని వారు తెలిపారు. మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా ఎదగడానికి ఈ కేంద్రాలు దోహదపడుతున్నాయి.

## 14 పోస్టులకు 98 మంది హాజరు

**ప్రజాపక్షం/జనగామ:** మిషన్ వాత్సల్య, మిషన్ శక్తి పథకాల కింద జిల్లాలో ఖాలీగా ఉన్న 14 పోస్టుల భర్తీకి గురువారం కలెక్టరేట్లో రాత పరీక్ష ప్రశాంతంగా నిర్వహించారు. మొత్తం 112 దరఖాస్తులు రాగా, 98 మంది అభ్యర్థులు హాజరయ్యారు. మరో 14 మంది గైర్హాజరయ్యారు. మిషన్ వాత్సల్య కింద చైల్డ్ హెల్ప్‌లైన్ 1098లో 8 పోస్టులు, మిషన్ శక్తి మహిళా సాధికారత జిల్లా కేంద్రంలో 6 పోస్టుల భర్తీకి పరీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జేసి బెన్షాలోమ్, ఉపాధి అధికారి కుమార స్వామి, తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ స్థాయి వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం

### వరంగల్ సూపర్ స్పెషాలిటీలో పరిమితసేవలు ఈ నెల 20 నుండి ప్రారంభం : మంత్రి పొంగులేటి

**ప్రజాపక్షం / వరంగల్ :** పేద ప్రజలకు ప్రైవేట్ ఆసుపత్రులకు దీటుగా అత్యాధునిక వైద్య సేవలను అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. వైద్య ఖర్చుల భారం కారణంగా పేదలు ఇబ్బందులు పడకూడదని, ప్రతి ఒక్కరికీ నాణ్యమైన ఉచిత వైద్యం అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. గురువారం వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి వర్యులు ధనసరి అనసూయ సీతక్క, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, మహబూబాబాద్ ఎంపి బలరాం నాయక్, వరంగల్ పశ్చిమ శాసనసభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి, పరకాల శాసన సభ్యుడు రేవూరి ప్రకాష్ రెడ్డి, వర్ధన్నపేట శాసనసభ్యుడు కె ఆర్ నాగరాజు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యతో పాటు తెలంగాణా రాష్ట్ర వైద్యం ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డా. క్రిస్టినా జెడ్ చూంగ్తు, కూడా చైర్మెన్ గుండు సుధారాణి, వరంగల్, హన్మకొండ జిల్లాల కలెక్టర్లు డాక్టర్ సత్య శారద, చాహత్ బాజ్ పాయి,ఎన్పిడిసిఎల్ సిఏండి వరుణ్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భాంగా పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడు తూ ఉత్తర తెలంగాణ ప్రజలు అత్యాధునిక వైద్య చికిత్స ల కోసం హైదరాబాద్‌కు వెళ్లాల్సిన అవసరాన్ని తగ్గించి, వరంగల్‌లోనే మెరుగైన వైద్య సేవలు అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని నిర్మిస్తోందన్నారు. వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో పేదలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు అవసరమై న వైద్య పరికరాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఇ తర మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు. రా ష్ట్ర ఆర్థిక పరిస్థితులు ఎలా ఉన్నప్పటికీ పేదల ఉచిత వై ద్యానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని స్ప ష్టం చేశారు. వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో దసరా సందర్భంగా అక్టోబర్ 20 నుండి పరిమిత వైద్య సేవలను ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. నవంబర్‌లో మరిన్ని వైద్య సేవలు అందుబాటులోకి తీసుకువచ్చి డిసెంబర్ నెల చివరికల్లా పూర్తి స్థాయిలో వైద్య సేవలను అందిస్తామన్నారు . ఉమ్మడి వరంగల్ జిల్లా ప్ర జలే కాకుండా ఖమ్మం ,వరంగల్, నల్గొండ, ఆదిలాబా దు, మహబూబాబాద్, మెదక్ జిల్లాల ప్రజలు ఎంజిఎం లో నాణ్యమైన వైద్య అందుతుందని నమ్మకంతో వస్తున్నారని,ఆ నమ్మకాన్ని మరింత బలపడేలా ఉండేందుకు ఈ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని కార్పొరేట్ వైద్యానికి దీటుగా ఈ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని నిర్మించడం జరిగిందన్నారు. ఆయన వెంట డిఎంఇ డా. వాణి, డా విమల థామస్, అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎల్ కిషోర్ కు మార్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు రాజి రెడ్డి, ఎంజిఎం సూపరింటెండెంట్ డా. రాంకుమార్, ఆర్ ఎంఓ డా. అశ్విన్‌తో, వరంగల్ ,నర్సంపేట ఆర్‌డిఒలు సుమా, ఉమారాణి పాటు ఆరోగ్య, వైద్య, ఇంజినీరింగ్, శాఖలకు చెందిన సంబంధిత అధికారులు, వైద్య అధికారులు , సంబందిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నాటి అయ్యాకొడుకుల పాలనలో అభివృద్ధి దూరమే

### మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

**ప్రజాపక్షం/మల్హార్:** స్వాతంత్ర్యం వచ్చిన 78 ఏండ్ల లో ఇంకా మనం అభివృద్ధిలో వెనుకబడిపోవడానికి కారణం దుద్దిళ్ల శ్రీపాదరావు, దుద్దిళ్ల శ్రీధర్‌ల పాలనేనని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మల్హార్ మండలం తాడిచర్ల గ్రామపంచాయతీ పరిధిలోని శాత్రాజ్‌పల్లి గ్రామంలో అర్ధరాత్రి అధికారులు దౌర్జన్యంగా కూల్చివేసిన ఇండ్లను ఆయన పరిశీలించి బాధిత కుటుంబాలను ఓదార్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు బందిపోట్లు, దోపిడిదారుల కంటే ఎక్కువగా వ్యవహరించి ప్రజాస్వామ్యాన్ని మంటగలిపారని అన్నారు. శాత్రాజ్‌పల్లిలో అక్రమంగా ఇండ్ల నిర్మాణాలు చేస్తే అధికారులు పట్టపగలు రావాలే కానీ అర్ధరాత్రి వచ్చి దౌర్జన్యం చేయడం ఏంటని ప్రశ్నించారు. నియోజకవర్గంలో పదేపదే తాను దుద్దిళ్ల శ్రీధర్ గురించి మాట్లాడటం వెనుక అర్థం ఉందని, దుద్దిళ్ల శ్రీధర్ ఐసుగడ్డతో చంపేస్తాడని, ఈ సమాజాన్ని అభివృద్ధి చేయాల్సింది పోయి రోజురోజుకు ఈ సమాజాన్ని అర్థికంగా సామాజికంగా రాజకీయంగా అణగదొక్కుతున్నాడని, ఈ విషయాన్ని షోకాల్డ్ మేధావులు ఆలోచన చేయాలన్నారు. 40 ఏండ్ల తండ్రి కొడుకుల పాలనలో శాత్రాజ్‌పల్లికి ఒక రోడ్డు వేయలేదని, ఆ ఊరును పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. అయినా 40 ఏండ్లుగా అవకాశం ఇస్తూనే ఉన్నారని ఆయన గుర్తు చేశారు. అధికారులు వచ్చి ఈ దుశ్చర్యకు పాల్పడ్డారంటే అందుకు దుద్దిళ్ల శ్రీధరే కారణమని అన్నారు. శాత్రాజ్‌పల్లిలో ఇండ్లు కూల్చివేయించి మళ్లీ వాళ్లే సానుభూతి చూపిస్తున్నారని ఎద్దేవా చేశారు. నాడు లద్నాపూర్, ఇవ్వాల శాత్రాజ్‌పల్లి ఇలా అనేక గ్రామాల్లో ఇలాగే చేశాడని అన్నారు. శాత్రాజ్‌పల్లిలో మైన్ వస్తదని ఎవరూ చెప్పలేదని, కనీసం నోటిఫికేషన్‌కూడా ఇవ్వలేదని, అక్కడ ఎందుకు ఇండ్లు కట్టుకోకూడదో దుద్దిళ్ల శ్రీధర్ జవాబు చెప్పాలన్నారు.శాత్రాజ్‌పల్లికి రోడ్డు వేయించి వెలుగులు తీసుకువచ్చింది తామేనని, ఈనాడు అన్యాయంగా ఇండ్లు కూల్చివేశారని, ప్రతి కట్టెకు, ప్రతి గూనపెంకకు పరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.

## తెలంగాణ అస్తిత్వానికి ప్రతీక బతుకమ్మ

### సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి

**ప్రజాపక్షం/హనుమకొండ :** తెలంగాణ అస్తిత్వానికి ప్రతీక బతుకమ్మ పండుగ అని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాసరావు అన్నారు. హనుమకొండ మండలం గుండ్ల సింగారం గ్రామంలోని సురవరం సుధాకర్ రెడ్డి నగర్ కాలనీలో గురువారం అత్యంత వైభవంగా ఎంతో ఉత్సాహంగా బతుకమ్మ సంబరాలు బతుకమ్మ ఆట పాట నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైనా సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ మన అస్తిత్వానికి ప్రతీక అయినటువంటి మన సంస్కృతికి వారధి అయినటువంటి బతుకమ్మ పండుగను తెలంగాణలో ప్రతీ ఆడబిడ్డ అత్యంత వైభవంగా జరుపుకునే పండుగలలో అతిపెద్ద పండుగ అని కొనియాడారు. అదే విధంగా ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి మాట్లాడుతూ మహిళ పెళ్ళికి తులం బంగారం, విద్యార్థినిలకు స్కూటీలు, వితంతువుల పెన్షన్లు రెట్టింపు, స్థానిక సంస్థల రిజర్వేషన్లలో 50 శాతం మహిళలకు కేటాయింపు వాగ్దానాలను, గ్యారంటీలను బతుకమ్మ పండుగ సందర్భంగా వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, హనుమకొండ మండల కార్యదర్శి ఎన్ ఎ స్టాలిన్, మా లోత్ శంకర్ నాయక్, గుంటి రాజేందర్, మహిళా సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాసమళ్ళ దీన, సిపిఐ నాయకులు పూజారి అమృతయ్య, కోడెపాక బాబు, మామునూరి దామోదర్, కేతపాక ప్రసాద్, మాలోత్ మంగ, తెలంగాణ ప్రజానాట్య మండలి జిల్లా ఉపాధ్యక్షుడు తాటికంటి మమత, రొంటాల శ్యామ్, కళ్యాణి, హేమలత, సునీత, కవిత పాల్గొన్నారు.

## ఎల్ నినోతో ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు

### కలెక్టర్ రాహుల్ శర్మ

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం, ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రైతులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలకు శ్రీకారం చుట్టిందని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఇందులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాకు ప్రత్యేక అధికారిగా మున్సిపల్ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి డా॥ టి.కె. శ్రీదేవిని ప్రభుత్వం నియమించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రత్యేక అధికారి అక్టోబర్ 16, 17 తేదీల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాల పరిధిలో పర్యటించి, జిల్లా యంత్రాంగంతో కలిసి క్షేత్రస్థాయిలో వాతావరణ పరిస్థితులు, వ్యవసాయ రంగంపై వాటి ప్రభావం, ముందస్తు నివారణ చర్యలను సమీక్షించనున్నట్లు తెలిపారు. ప్రధానంగా పంటల సంరక్షణ, తాగునీటి లభ్యత, వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా, భూగర్భ జలాల పరిస్థితులపై ప్రత్యేక దృష్టి సారించనున్నారని తెలిపారు. పంటలకు నష్టం వాటిల్లకుండా, కోతకు సిద్ధంగా ఉన్న పంటలను కాపాడేందుకు వ్యవసాయ, విద్యుత్, సాగునీరు, భూగర్భ జల శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. అలాగే భూగర్భ జలమట్టాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ బోరుబావుల్లో నీటి లభ్యతను అంచనా వేయాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉంటూ పరస్పర సమన్వయంతో పనిచేయాలని, రైతులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ స్పష్టం చేశారు.

## వెట్టి చాకిరి నిర్మూలనకు సమష్టి కృషి

### జిల్లా అదనపు కలెక్టర్ సిహెచ్ మహేందర్

**ప్రజాపక్షం/ములుగు:** వెట్టిచాకిరి నిర్మూలనపై అవగాహన కల్పించేందుకు చేపట్టిన స్వేచ్ఛా రథం ప్రచార వాహనాన్ని అదనపు కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెట్టి చాకిరి, బలవంతపు శ్రమ నుండి కార్మికులకు విముక్తి కల్పించేందుకు ప్రజల్లో అవగాహన పెంపొందించాలని పేర్కొన్నారు. కార్మికులు తమ హక్కులను తెలుసుకోవాలని, వారి రక్షణకు సంబంధిత శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. వెట్టి చాకిరి బాధితులు, అటువంటి పరిస్థితులను గుర్తించిన ప్రజలు టోల్‌ఫ్రీ నంబర్ 080..69434343ను సంప్రదించి సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ప్రత్యేక కళాజాత బృందం వెట్టిచాకిరి నిర్మూలనపై ప్రదర్శించిన అవగాహన నాటిక కలెక్టరేట్ సిబ్బందిని ఆకట్టుకుంది.అనంతరం వెట్టిచాకిరి నిర్మూలనపై అవగాహన పోస్టర్‌ను అదనపు కలెక్టర్ ఆవిష్కరించారు. వెట్టిచాకిరి నిర్మూలనకు కృషి చేస్తామని అధికారులు, కలెక్టరేట్ సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ అధికారి వినోద, జిల్లా పౌర సంబంధాల అధికారి రఫిక్, కలెక్టరేట్ పరిపాలనాధికారి అల్లం రాజకుమార్, పర్యవేక్షకులు మంజుల, మహేష్ బాబు, కలెక్టరేట్ సిబ్బంది, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పారిశ్రామికవేత్తలుగా మహిళలు ఎదగాలి : కలెక్టర్

**ప్రజాపక్షం/జనగామ:** మహిళలు చిన్న వ్యాపారాలకే పరిమితం కాకుండా ఆహార శుద్ధి పరిశ్రమలు, రవాణా రంగాలలో పెద్ద స్థాయి వ్యాపారాలు స్థాపించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో వ్యవసాయశాఖ, ఆత్మ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా కిసాన్ దివస్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 170 ధాన్యం కొనుగోలు కేంద్రాలను మహిళా సంఘాలకు కెటాయించినట్లు తెలిపారు. 62 రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు. మూడు నియోజకవర్గాలలో రైస్ మిల్లుల ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. అనంతరం ప్రగతిశీల మహిళలను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధికారులు అంబికా సోని, నూరుద్దీన్, అపర్ణ, నళిని, సఖీలు, రైతు సేవా కేంద్రాల మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## గూడూరులో కలెక్టర్ స్నేహ శబరీష్ విస్తృత పర్యటన

**ప్రజాపక్షం/గూడూరు;**మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ గురువారం విస్తృతంగా పర్యటించారు.మండలంలోని బొద్దుగొండ ముదునాపురం గ్రామాలలె కోనసాగుతున్న అభివృద్ధి సంక్షేమ పాలనాపరమైన పరిశీలించారు.మదునాపురం గ్రామంలో కొనసాగుతున్న భూముల రీ సర్వే పనులను కలెక్టర్ పరిశీలించి సిబ్బందికి పలు మార్గదర్శకాలు జారీ చేశారు. ప్రభుత్వం నిబంధనలకు అనుగుణంగా సర్వే నిర్వహించాలని రైతులకు ముందుస్తు సమాచారం అందించి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు.రైతులు కూడా తమ పోలాల హద్దులను ముందుగానే నిర్ధారించుకుంటే సర్వే పారదర్శకంగా వేగంగా పూర్తవుతుందని సూచించారు.ప్రస్తుత ఎలినో పరిస్థితుల దృష్ట్యా తక్కువ నీటితో పండే పంటలను వేయలని పంట మార్పిడి విధానాన్ని పాటించాలని రైతులకు పిలుపునిచ్చారు.అర్హులైన రైతులందరికి ఉపాధి హామీ పథకం పనులు కల్పించాలని ఫీల్డ్‌అసిస్టెంట్లను ఆదేశించారు.సాగు తాగునీటి ఇబ్బంది కలగకుండా చూడటంతో పాటు పిఏసిఎస్ ద్వారా అర్హులైన ప్రతి రైతుకూ పంట రుణాలు అందించాలని సృష్టం చేశారు. నవంబర్ 9న ప్రచురించనున్న సర్(ఎస్ఐఆర్) ఓటర్లు తుది జిబితాలో పేర్లు నమోదుకు కేంద్ర ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించిందని కలెక్టర్ తెలిపారు.ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో భాగంగా ఈనెల 15.16 తేదీల్లో అన్ని పోలింగ్ కేంద్రాలలో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ముసాయిదా జాబితాలో ఎఎస్‌డిటి( ఆబ్సెంట్ షిఫ్టెడ్ డెడ్ డూప్లికేట్) కింద పోరపాటున పేర్లు తోలగించబడిన వారు కొత్తగా ఓటు నమోదు చేసుకోవాలనుకునే వారు పొలింగ్ కేంద్రాల్లో ఫారం 6 సమర్పించి ఈ అవకాశాన్ని సద్వియోగం చేసుకోవాలని కోరారు.అనంతరం గూడూరు మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వార్డులను మండుల నిల్వ గది ఒపి రిజిస్టర్ హాజరు పట్టిక సిసి కెమెరాల పనితీరును పరిశీలించారు.చికిత్స పోందుతున్న రోగులతో మాట్లాడి వైద్య సెవలపై ఆరా తీశారు.వైద్యులు సిబ్బంది సమయపాలన పాటి స్తూ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలని మీ ప్రమాణం యాప్‌లో వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేవించారు.విధుల్లో ని ర్లక్ష్యం వహిస్తే కఠన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఆసుపత్రిలో ఎక్స్‌రే ల్యాబ్ తదితర సౌకర్యాలను మెరుగుపరచాలని సిబ్బందికి సూచించారు. ఈకార్యక్రమంలో ల్యాండ్ సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ చీర శ్రీనువాసులు తహశీల్దార్ నాగభవని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నరేశ్ రెడ్డి సర్వేయర్లు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## భూపాలపల్లి అభివృద్ధే లక్ష్యం

**ప్రజాపక్షం/భూపాలపల్లి:** భూపాలపల్లి పట్టణ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు స్పష్టం చేశారు. ఒకప్పుడు 600 ఓట్లతో గ్రామ పంచాయతీగా ఉన్న భూపాలపల్లి నేడు లక్ష జనాభాతో జిల్లా కేంద్రంగా ఎదిగిందని, పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా రహదారుల విస్తరణ చేపడుతున్నామని తెలిపారు. గురువారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంబేద్కర్ జంక్షన్ నుంచి ఒసి2 వరకు 200 అడుగుల రహదారితో పాటు, అంబేద్కర్ జంక్షన్ నుంచి సింగరేణి గ్రౌండ్ వరకు 80 అడుగుల రహదారి అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. గతంలోనే భూసేకరణజరిగినప్పటికీ ఆక్రమణల కారణంగా రహదారుల విస్తరణకు ఆటంకాలు ఏర్పడ్డాయన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో మున్సిపాలిటీకి కోట్ల నిధులు మంజూరయ్యాయని వెల్లడించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఎవరైనా అవినీతికి పాల్పడినా, తప్పు చేసినా ఉపేక్షించేది లేదని గండ్ర సత్యనారాయరావు హెచ్చరించారు. ఎవరి వద్దా లంచం తీసుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. పేదల కష్టమే తమ వృత్తి, నియోజకవర్గ అభివృద్ధే తమ లక్ష్యమని పేర్కొన్నారు. అంబేద్కర్, రాజీవ్‌నగర్, హనుమాన్, 5 ఇనెక్లైన్, జయశంకర్, మంజూర్నగర్ జూర్నగర్ జంక్షన్లను అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో డిసిసి అధ్యక్షుడు బట్టు కర్ణాకర్, మున్సిపల్ చైర్మన్ కొమురయ్య, వైస్ చైర్మన్ శ్రీనివాస్, రెడ్ క్రాస్ చైర్మన్ మధు, ఐఎన్‌టియుసి నాయకులు రఘుపతిరెడ్డి, మధుకర్ రెడ్డి, బొడ్డు అశోక్, టౌన్ అధ్యక్షుడు

## ప్రభుత్వాధికారులు (మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్‌లో

వేములవాడలో

కీసరలో

పండాల సంధ్యారాకేశ్, వేములవాడ రూరల్ తహసీల్దార్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే... ఆరు కొత్త విద్యుత్ మీటర్ల మంజూరు కోసం రూ.1.20 లక్షల లంచం తీసుకుంటూ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టిజిఎస్‌పిడిసిఎల్) అసిస్టెంట్ ఇంజినీర్ ఎసిబి అధికారులకు పట్టుబడ్డారు. హైదరాబాద్‌లోని సంతోష్‌నగర్ సబ్ డివిజన్ పరిధి మదన్నపేట సెక్షన్‌లో అసిస్టెంట్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న పండాల సంధ్య రాకేశ్ గురువారం లంచం తీసుకుంటుండగా ఎసిబి అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. పాత విద్యుత్ మీటర్లు కనిపించకపోవడంతో వాటి స్థానంలో ఆరు కొత్త మీటర్లు మంజూరు చేయాలని ఫిర్యాదుదారుడు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించారు. ఆ దరఖాస్తులను ఆమోదించి కొత్త మీటర్లు మంజూరు చేసేందుకు ఎఇ రూ.1.20 లక్షల లంచం డిమాండ్ చేశారు. దీంతో ఫిర్యాదుదారుడి నుంచి లంచం స్వీకరిస్తున్న సమయంలో ఎసిబి అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. ఎఇ వద్ద నుంచి ఆయన సూచన మేరకు లంచం సొమ్ము రూ.1.20 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని నాంపల్లిలోని అవినీతి నిరోధక చట్టం కేసుల ప్రత్యేక న్యాయస్థానం ఎదుట హాజరుపరిచి, న్యాయ రిమాండ్‌కు తరలించనున్నట్లు తెలిపింది.

**కీసర మండల రెవెన్యూ కార్యాలయ డిప్యూటీ తహసీల్దారు**

ఓ భూ సంబంధిత లావాదేవీలకు సంబంధించి అధికారిక పని అనుకూలంగా చేసేందుకు రూ. 5 లక్షలు డిమాండ్ చేసి రూ.2.5 లక్షలు లంచంగా తీసుకొంటుండగా ఎసిబి అధికారులు నిర్వహించిన దాడుల్లో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసర మండల రెవెన్యూ కార్యాలయ డిప్యూటి తహసీల్దారుతో పాటు మరో ఇద్దరు ఉద్యోగులను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొన్నారు. కీసర ప్రాంతానికి చెందిన పన్నాల బుచ్చిరెడ్డి భార్య సుశీల ఇటీవల మృతి చెందటంతో ఆమె పేరిట సర్వే నంబర్ 183, 184లో ఉన్న మూడెకరాల భూమిని తన పేరిట వారసత్వంగా (సక్సెషన్)మ్యూటేషన్ కోసం కుమారుడు పన్నాల గిరిధర్‌రెడ్డి కొద్ది నెలల క్రితం కీసర తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి దరఖాస్తు చేసుకున్నాడు. అప్పటి నుండి కార్యాలయానికి తరచూ వెళుతున్న క్రమంలో సంబంధిత భూమి 22 ఎ పరిధిలోకి వస్తోందని, దీన్ని మ్యూటేషన్ చేయాంటే 22ఎ పరిధిలోంచి ముందుగా తొలగించాల్సి ఉంటుందని, దీని కోసం తమకు రూ. 5 లక్షలు ఇవ్వాల్సి ఉంటుందని, ఈ డబ్బులోంచి కొంత తాము ఆర్‌డిఓ కార్యాలయ అధికారులకు సైతం ఇవ్వాల్సి ఉంటుందని తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ సందీప్‌రెడ్డి దరఖాస్తుదారుడితో చెప్పాడు. అంత సొమ్ము తామిచ్చుకోలేమని ఎంత బతిమిలాడినా వినక పోగా దరఖాస్తును ఏ మాత్రం పట్టించుకోవటంతో దరఖాస్తుదారుడు గిరిధర్‌రెడ్డి విసిగి పోయి ఎసిబి అధికారులను ఆశ్రయించి లిఖిత పూర్వకంగా తనను లంచంగా డిమాండ్ చేస్తున్న విషయాన్ని ఫిర్యాదు చేశాడు. దీంతో ముందస్తు పథకం ప్రకారం గిరిధర్‌రెడ్డి డిప్యూటీ తహసీల్దార్ సందీప్‌రెడ్డిని కలిసి తొలి విడతగా రూ. 2.5 లక్షలు ఇస్తానని చెప్పాడు. దీనికి అంగీకరించిన డిప్యూటీ తహసీల్దార్ తెలిపిన ప్రకారం గురువారం సదరు సొమ్మును గిరిధర్‌రెడ్డి కార్యాలయంలోని విజయకుమార్‌కు ఇవ్వగా అతడి నుండి రికార్డు అసిస్టెంట్ బాలకృష్ణ తీసుకొని డిటి సందీప్‌రెడ్డి గదిలోకి తీసుకొని వెళ్లి బ్యాగ్‌లో పెడుతున్న సమయంలో పథకం ప్రకారం అక్కడ వెన్నంటి ఉన్న ఎసిబి అధికారులు దాడి చేసి లంచంగా బాధితుడు ఇచ్చిన రూ. 2.5 లక్షలు స్వాధీనం చేసుకొన్నారు. డిప్యూటీ తహసీల్దార్ సందీప్‌రెడ్డితో పాటు అతడికి సహకరించిన ఇద్దరు ఉద్యోగులు విజయకుమార్‌రెడ్డి,బాలకృష్ణలను అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎసిబి అధికారులు తెలిపారు

**వేములవాడ రూరల్ తహసిల్దార్ కార్యాలయంలో**

వేములవాడ రూరల్ తహసిల్దార్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు గురువారం సాయంత్రం ఆకస్మికంగా సోదాలు నిరహించారు. భూ సంబంధిత పనుల కోసం చెక్కపల్లి గ్రామానికి చెందిన ఓ మహిళ రైతు ల్యాండ్ గిఫ్ట్ డిడి విషయంలో డబ్బులు డిమాండ్ చేసిన వ్యవహారంలో వచ్చిన ఫిర్యాదు మేరకు వేములవాడ రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో ఎసిబి అధికారులు దాడులు నిర్వహించి రూ. 8,000 లంచం తీసుకుంటుండగా కంప్యూటర్/భూభారతి ఆపరేటర్‌ను, తహసీల్దార్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. బాధితుడు ఒక పని నిమిత్తం జులై నెలలో స్లాట్ బుక్ చేసుకోగా, రకరకాల కారణాలు చూపుతూ దానిని తిరస్కరించి, పని పూర్తి చేయడానికి అధికారులు రూ. 10,000 లంచం డిమాండ్ చేశారని, చివరకు రూ. 8,000 ఇచ్చేందుకు ఒప్పందం కుదరడంతో బాధితుడు ఎసిబి అధికారులను ఆశ్రయించారని. బాధితుడి ఫిర్యాదు మేరకు పథకం ప్రకారం దాడులు నిర్వహించామన్నారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు భూభారతి ఆపరేటర్ అనిల్ బాధితుడి నుంచి రూ. 8,000 లంచం తీసుకుంటుండగా అధికారులు పట్టుకున్నారు. లంచం తీసుకున్న భూభారతి ఆపరేటర్‌తో పాటు తహసీల్దార్‌ను కూడా అదుపులోకి తీసుకుని, వారిని ఎసిబి ప్రత్యేక కోర్టులో హాజరుపరచనున్నట్లు డిఎస్పీ మహేందర్ రెడ్డి స్పష్టం చేశారు.

## వ్యవసాయ అధికారుల పదోన్నతులకు లైన్ క్లియర్

**మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు టిఎడిఎ కృతజ్ఞతలు**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** న్యాయపరమైన చిక్కులతో నిలిచిపోయిన వ్యవసాయ అధికారుల పదోన్నతుల ప్రక్రియకు మార్గం సుగమం కావడంపై తెలంగాణ అగ్రి డాక్టర్స్ అసోసియేషన్ (టిఎడిఎ) హర్షం వ్యక్తం చేసింది. బిసి,ఎస్‌సి, ఎస్‌టి మహిళా అధికారులకు న్యాయం జరిగేలా చొరవ తీసుకున్న సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు టిఎడిఎ ప్రతినిధుల బృందం కృతజ్ఞతలు తెలిపారు. మెరిట్ వర్సెస్ రోస్టర్ సీనియారిటీ కేసులో హైకోర్టు స్టే ఎత్తివేతతో పదోన్నతుల ప్రక్రియ ముందుకు సాగేందుకు మార్గం ఏర్పడిందనిటిఎడిఎ రాష్ట్ర అధ్యక్షుడు సల్మాన్ నాయక్, ప్రధాన కార్యదర్శి జె. తిరుపతి నాయక్‌లు పేర్కొన్నారు. ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, అడ్వకేట్ జనరల్, న్యాయశాఖ కార్యదర్శి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో సమన్వయం చేస్తూ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఎంతో కృషి చేశారన్నారు. అర్హత, సీనియారిటీ, రోస్టర్ నిబంధనల ప్రకారం మిగిలిన పదోన్నతులను వేగంగా పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా టిఎడిఎ రాష్ట్ర అధ్యక్షుడు సల్మాన్ నాయక్, ప్రధాన కార్యదర్శి జె. తిరుపతి నాయక్, కోశాధికారి మధుమోహన్ సహా పలు జిల్లాల ప్రతినిధులు మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిఎడిఎ రాష్ట్ర కోశాధికారి మధుమోహన్ సహా కరీంనగర్, మంచిర్యాల, సిద్దిపేట, జగిత్యాల, నిర్మల్, మెదక్, సిరిసిల్ల జిల్లాల ప్రతినిధులు మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను కలిసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జగిత్యాల డిఎఇఒ భాస్కర్, ఎడిఎ రామచందర్, నిశాంత్, అనిల్, అంజిత్, ఖాదర్, తిరుమల్, సురేందర్, పరశురాం రెడ్డి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## మణిపూర్‌లో ఫుడ్ పాయిజనింగ్

**75 మంది బిఎస్‌ఎఫ్ జవాన్‌లు ఆసుపత్రిలో చేరిక!**

**ఇంఫాల్:** మణిపూర్ రాజధాని ఇంఫాల్‌లో తీవ్ర కలకలం రేగింది. అనుమానాస్పద ఫుడ్ పాయిజన్ కారణంగా 75 మంది బిఎస్‌ఎఫ్ (బార్డర్ సెక్యూరిటీ ఫోర్స్) జవాన్లు, మరో ముగ్గురు పౌరులు అస్వస్థతకు గురయ్యారు. వీరిని వెంటనే చికిత్స నిమిత్తం గురువారం నగరంలోని ఓ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చినట్లు అధికారులు తెలిపారు. ఉదయం తర్వాత జవాన్లతో పాటు ముగ్గురు పౌరులకు వాంతులు, కడుపులో వికారం వంటి లక్షణాలు కనిపించాయి. దీంతో అప్రమత్తమైన అధికారులు మధ్యాహ్నం 1 గంట ప్రాంతంలో వారిని రీజినల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై రిమ్స్ (ఆర్‌ఐఎమ్‌ఎస్) ఆసుపత్రి అధికారి మాట్లాడుతూ.. 'బిఎస్‌ఎఫ్ సిబ్బందికి, ము గ్గురు పౌరులకు అత్యవసర విభాగంలో వెం టనే ప్రాథమిక చికిత్స అందించాము. ప్ర స్తుతం అందరి ఆరోగ్యం నిలకడగా ఉంది. ఆహారం విషపూరితం కావడంతోనే వీరు అస్వస్థతకు గురయ్యారు' అని వెల్లడించారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com